ఆదివారం ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

గుంటూరు

: fb.com/vaartha Digital

కపిల్ చిట్స్ మీ వెంట ఆనందం మీ ఇంట
KAPIL GROUP
కపిల్ చిట్స్
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

16-11-2025 ఆదివారం సంపుటి: 31 సంచిక: 285 పేజీలు: 12 వెల: 8.00

# ఇంధన రంగంలో సైబర్ భద్రత



శనివారం విశాఖలో ఎనర్జీ సైబర్ రెజిలియన్స్ సెంటర్ ఎంఒయు కార్యక్రమంలో పాల్గొన్న సిఎం చంద్రబాబు, మంత్రులు నారా లోకేష్, గొట్టిపాటి రవికుమార్, ఫ్రాంటియర్ టెక్నాలజీస్ ఎండి జెరెమీ జర్గెన్స్, సిఎస్ కె.విజయానంద్

## ఎఐ ద్వారా విద్యుత్ పంపిణీ, సరఫరా నష్టాలు తగ్గించే చర్యలు

## ఎక్కడికక్కడే విద్యుత్ ఉత్పత్తికి ప్రణాళికలు

## సిఇసిఆర్‌సి ఏర్పాటుపై ఎంఒయు కార్యక్రమంలో సిఎం చంద్రబాబు

## వరల్డ్ ఎకనమిక్ ఫోరంతో రాష్ట్రం కీలక ఒప్పందం

## తక్కువ ఖర్చుతో నాణ్యమైన విద్యుదుత్పత్తి: మంత్రి లోకేష్

**విశాఖపట్టణం, నవంబరు 15, ప్రభాతవార్త:** ఇంధన భద్రత కోసం మెరుగైన రక్షణ విధానాన్ని ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. ఇదే సమయంలో టెక్నాలజీని వినియోగించి ప్రజలకు లబ్ది కలిగేలా విద్యుత్ ఉత్పత్తి, సరఫరా వ్యవస్థలు ఉండాలని అభిప్రాయపడ్డారు. శనివారం సీఐఐ భాగస్వామ్య సదస్సులో భాగంగా ఇంధన భద్రత, విద్యుత్ రంగంలో అధునాతన టెక్నాలజీ వినియోగం కోసం రాష్ట్ర ప్రభుత్వం వరల్డ్ ఎకనమిక్ ఫోరంతో ఒప్పందం కుదుర్చుకుంది. సెంటర్ ఫర్ ఎనర్జీ, సైబర్ రెజిలియన్స్ సెంటర్ ఏర్పాటుపై జూనినీతో ప్రభుత్వం ఎంఒయూ చేసుకుంది. సీఎం చంద్రబాబు సమక్షంలో ఈ ఒప్పందం చేసుకుంది. ఈ సందర్భంగా ముఖ్య మంత్రి చంద్రబాబు మాట్లాడుతూ 'ఇంధన రంగంలో అవసరమైన సైబర్ రక్షణ వ్యవస్థలను కూడా తయారు చేసుకోవాలి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు జూనినీ ముందుకు రావడం సంతోషం. ప్రపంచం అంతా గ్రీన్ ఎనర్జీ వినియోగం గురించే ఆలోచన చేస్తోంది. 160 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీని ఏపీలో ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. అతితక్కువ వ్యయంతో విద్యుత్ ఉత్పత్తి చేసి సరఫరా చేయాలనేది ప్రభుత్వ ఆలోచన. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ సంస్కరణలు చేసి వినియోగాన్ని పెంచగలిగాం. ఏఐ లాంటి టెక్నాలజీ వినియోగం ద్వారా విద్యుత్ పంపిణీ నష్టాలు, సరఫరా వ్యయం తగ్గించాలి. అప్పుడే ఇంధన రంగంలో సుస్థిరత సాధ్యం అవుతుంది. వ్యవసాయం, వాణిజ్యం, పరిశ్రమలు, గృహాలు ఇలా అన్నిటికీ ఇలా ప్రతి రంగానికీ విద్యుత్ అవసరమే. ఈ మేరకు విద్యుత్ డిమాండ్‌ను

>>2



# ఇంటికో పారిశ్రామికవేత్త ప్రభుత్వ లక్ష్యం

## ఎపిని భారత్ టెక్ రాజధానిగా మారుస్తాం

## ఆర్‌టిఐహెచ్ సమ్మిట్‌లో మంత్రి లోకేష్

## ఆరు సంస్థలతో ఎంఒయు

**విశాఖపట్నం, నవంబరు 15 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు ఒక కీలక మలుపులో ఉంది. అభివృద్ధి, పరిపాలన, భాగస్వామ్యాన్ని నేడు ఇన్నోవేషన్ నిర్ణయిస్తోందని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఆర్ టిఐహెచ్ – వన్ ఫ్యామిలీ వన్ ఎంటర్ ప్రెన్యూర్ –ఇన్నోవేషన్, ఇంక్లూజన్ అండ్ ఇంపాక్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అనే అంశంపై సిఐఐ పార్టనర్ షిప్ సమ్మిట్‌లో జరిగిన సదస్సులో మంత్రి లోకేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ కుటుంబానికి ఒక పారిశ్రామికవేత్త తయారు కావాలన్నది మా విజన్. దీనిని కొంతమందికి మాత్రమే దక్కే హక్కుగా కాకుండా ఆచరణీయ మార్గంగా చూడాల్సి ఉంది. 2029నాటికి ఆంధ్రప్రదేశ్‌ను ఇన్నొవేషన్ ఆధారిత రాష్ట్రంగా మార్చాలని మేము కోరుకుంటున్నాం. ఈ రంగంలో 20వేలకు పైగా స్టార్టప్‌లు, లక్ష ఉద్యోగాలు, 10 ప్రధాన రంగాల్లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ లను ఏర్పాటు చేయడం మా లక్ష్యం. ఇది కేవలం స్టార్టప్ ల సంఖ్య గురించి మాత్రమే కాదు. విద్యార్థులు, ఎంఎస్‌ఎంఇలు,భారీ పరిశ్రమలు, ప్రభుత్వంతో సహా అందరిలోనూ ఇన్నోవే షన్ మైండ్ సెట్ కల్పించే మా ప్రధాన ధ్యేయం. మీ కలలు నిజం కావాలంటే ముందు కలలు కనాలిమీ కలలు నిజం కావాలంటే ముందు కలలు కనాలని ఏపీజే అబ్దుల్ కలాం గారు చెప్పారు. 90వ దశకంలో చంద్రబాబునాయుడు గారు కూడా ఇంటికో ప్రొఫెషనల్ గురించి మాట్లాడారు. ఈ రోజు కుటుంబానికో పారిశ్రామికవేత్త గురించి మాట్లాడుతున్నారు. ప్రతిభను గ్రామ స్థాయిలోనే గుర్తించి వారి ఆలోచనను పెంచడంతో పాటు వాటిని అమలుపరిచే విధంగా

>>2

ఎర్రచందనం అక్రమరవాణా నిరోధానికి

# ప్రత్యేక టాస్క్‌ఫోర్స్

## పోలీసు, అటవీశాఖల మధ్య సమన్వయం ప్రధానం: డిసిఎం పవన్



**విజయవాడ,నవంబరు15,ప్రభాతవార్తప్రతినిధి:** ఎర్రచందనం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రకృతి ప్రసాదించిన అమూల్యమైన సంపద అని ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు.పర్యావరణపరంగానూ, ఆధ్యాత్మికంగానూ, ఆర్థికంగానూ దీనికి ఉన్న ప్రాధాన్యం అపారమైందని ఏపీ ఉపముఖ్యమంత్రి అన్నారు. దీన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉంది. పవన్ కళ్యాణ్ శనివారం మధ్యాహ్నం అటవీశాఖ ఉన్నతాధికారులతో ఎర్ర చందనం పరిరక్షణ, అక్రమ రవాణా నిరోధానికి ఉన్న మార్గాలపై టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షి ంచారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్

>>2

# సిఐ సతీష్‌ది హత్యేనా!

## సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేసిన పోలీసులు

## ఘటనా స్థలంలో మరిన్ని ఆధారాల కోసం అన్వేషణ



వివరాలపై ఆరా తీస్తున్న సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యన్నార్

**తాడిపత్రి, నవంబరు 15, ప్రభాతవార్త:** తిరుమల పరకామణి చోరీ కేసులో కీలకంగా ఉన్న సీఐ సతీష్ కుమార్‌ది హత్యేననే దిశగా పోలీసులకు పలు ఆధారాలు లభిస్తున్నాయి. అనంతపురం జిల్లా తాడిపత్రి సమీపంలోని కోమలి వద్ద శుక్రవారం ప్రాణాలు కోల్పోయిన పూర్వ అసిస్టెంట్ విజిలెన్స్ సెక్యూరిటీ అధికారి(ఎవిఎస్‌వో) సతీష్ కుమార్ కేసును పోలీసు ఉన్నతాధికారులు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు.పరకామణి కేసును విచారిస్తున్న

>>2



# నేడు విజయవాడకు సిజెఐ గవాయ్

**విజయవాడ,నవంబరు 15,ప్రభాతవార్తప్రతినిధి:** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ ఆదివారం విజయవాడకు రానున్నారు. ఉదయం 11 గంటలకు

>>2





శనివారం విశాఖలో వరల్డ్ ఎకనామిక్ ఫోరం ఎండీ జెర్మీ జర్గన్స్‌తో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

# ఇంధన రంగంలో సైబర్ భద్రత

>> తట్టుకునేందుకు మరింత విద్యుత్ ఉత్పత్తి చేయడం ద్వారా ప్రజలకు లాభాలుకల్గించేలా, మరింత మేలు జరిగేలా ఎక్కడికక్కడే విద్యుత్ ఉత్పత్తి చేసుకునేలా విధానాలను కూడా తయారు చేసుకుంటున్నాం. ట్రాన్స్ మిషన్ నష్టాలను కూడా గణనీయంగా తగ్గించుకునేందుకు చర్యలు చేపట్టాం. పునరుత్పాదక విద్యుత్ రంగంలో ప్రజలకు ప్రయోజనాలు కలిగేలా వ్యవస్థలు ఉండాలి. ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన కింద ఏపీలో సోలార్ రూఫ్ టాప్ ప్రాజెక్టునువేగంగా చేపట్టాం అని ముఖ్యమంత్రి వివరించారు.

**డేటా సెంటర్లకు విద్యుత్ తక్కువ ఖర్చులో ఇవ్వగలగాలి: నారా లోకేష్:** ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో ఏపీ అభివృద్ధి దిశగా దూసుకువెళ్తోంది. 6 గిగావాట్ల సామర్ధంతో డేటా సెంటర్ విశాఖకు తీసుకురావాలని ఆలోచన చేశాం. ఇప్పుడది సాకారం అయ్యింది. ఇలాంటి డేటా సెంటర్లు వినియోగించే విద్యుత్ తయారు చేయటం ఓ సవాలు. అలాగే తక్కువ వ్యయంతో నాణ్యమైన విద్యుత్ తయారు చేయటం కూడా ము ఖ్యమైన అంశం. అధిక ధరలకు విద్యుత్ ఉత్పత్తి చేసి డేటా సెంటర్లకు సరఫరా చేస్తే ఖర్చులు పెరిగిపోతాయి. అందుకే ఆధునిక టెక్నాలజీలపై ఆలోచన చేసిన సీఎం చంద్రబాబు వాటిని నిజం చేస్తున్నారు. సెంటర్ ఫర్ ఎనర్జీ అండ్ సైబర్ రెజిలియన్స్ సెంటర్ అనేది విద్యుత్ వ్యవస్థల రక్షణకు పనిచేస్తుంది. సీఎం ఆలోచన చేస్తే దానిని తక్షణం అమలు చేయాలని ఆదేశిస్తారు. అందుకే మంత్రులుగా మేమూ అధికారులు అంతా వాటిని సాకారం చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. ఏపీ అభివృద్ధి ప్రయాణంలో భాగస్వాములు కావాలని పారిశ్రామిక వేత్తలను కోరుతున్నాను." అని లోకేష్ చెప్పారు.

**గ్రీన్ ఎనర్జీలో ఏపీకి భారీగా పెట్టుబడులు : మంత్రి గొట్టిపాటి:** ఈ సందర్భంగా విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ టెక్నాలజీ కోసం మాత్రమే కాకుండా ఇంధన వ్యవస్థల రక్షణ కోసం CECRC ఏర్పాటు చేస్తున్నామ న్నారు. ఏపీ 160 గిగావాట్ల గ్రీన్ విద్యుత్ ఉత్పత్తి దిశగా భారీ పెట్టుబడులు వస్తున్నాయని వివరించారు. ఈ సమయంలో విద్యుత్ వ్యవస్థల సెక్యూరిటీ చాలా ముఖ్యమని మంత్రి గొట్టిపాటి అభిప్రా యప డ్డారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరం ఎండీ జెరేమీ జర్గన్స్ మాట్లా డుతూ ఏఐ ట్రాన్సి షన్ సమయంలో ఇంధన వ్యవస్థల భద్రత అత్యంత కీలకమైన అంశంగా మారిందని చెప్పారు. ఏపీలో ఇంధన భద్రత, సైబర్ సెక్యూరిటీ అంశాల్లో జాగ్రత్తలు తీసుకోవటం అభినం దనీయమని చెప్పారు. విద్యుత్ ఉత్పత్తి, ఇంధన భద్రత విషయంలో భారత్‌లో వేగంగా నిర్ణయాలు జరుగుతున్నాయని... ఇలాంటి సమయంలో వ్యవస్థల రక్షణ అత్యంత కీలకమైన అంశమని వివరిం చారు. సామాజికంగా, ఆర్థికంగా స్వావలంబన సాధించాలంటే ఈ తరహా కేంద్రాలు అవసరమవుతాయని జెరేమీ సూచించారు. ఈకార్యక్రమంలో సీఎస్ విజయానంద్ పాల్గొన్నారు.

# సిఐ సతీష్‌ది హత్యేనా!

>> సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యన్నార్ స్వయంగా సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించి కొన్ని వివరాలను ఆరాతీశారు. ఆయనతో పాటు ఘటనా స్థలానికి వచ్చిన డీఐజీ షిమోషి, ఎస్పీ జగదీష్, ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరిలను ఆయన పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. సీన్ రీ కన్‌స్ట్రక్షన్‌లో భాగంగా 50 కిలోల మనిషి ఆకార బొమ్మను రైలు నుంచి పడదోసి ప్రయోగాత్మక ప్రక్రియను చేపట్టమని ఆయన సూచించినట్లు తెలిసింది. అలాగే సతీష్ కుమార్ ప్రయాణించిన బోగీలోని సహ ప్రయాణీకుల వివరాలు ఆరా తీయాలని ఆయన పోలీసు అధికారులకు సూచించారు. సతీష్ కుమార్ చరవాణితో పాటు ఆయన భార్య మమత చరవాణిల్లోని కాల్ లిస్ట్‌ను పరిశీలించడానికి వాటిని ఎఫ్‌ఎస్ఎల్‌కు పంపాలని ఆయన సూచించారు. సంఘటనా స్థలమంతా పోలీసు అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి వివిధ అంశాలను నమోదు చేసుకున్నారు. సతీష్ కుమార్ మృత దేహంతో పాటు కిందపడిపోయిన ఆయన చరవాణి ఏ మాత్రం పగిలిపోకపోవడం కూడా పోలీసు అధికారుల్లో పలు అనుమానాలను రేకెత్తించింది. సీన్ రీకన్‌స్ట్రక్షన్‌లో భాగంగా అదే రైలు అదే వేగంతో వెళుతుండేలా బొమ్మను కూర్చోబెట్టి, నిల్చోబెట్టి, తోస్తున్నట్లు వివిధ ప్రక్రియలు నిర్వహించి పరిశీలించారు. వాస్తవగా సతీష్‌కుమార్ మృతదేహం పడి ఉన్న దూరం, బొమ్మలు వివిధ ప్రక్రియల్లో పడిన దూరాలకు పోలికే లేకపోవడంతో సతీష్ కుమార్‌ది హత్యేననడానికి ఇప్పటి వరకు లభించిన ఆధారాలకు మరింత బలం చేకూరినట్లయిందని పోలీసు వర్గాలు పేర్కొంటున్నాయి. సతీష్ ప్రమాదవశాత్తు రైలు నుంచి పడినా, ఆత్మహత్యకు పాల్పడినా మొహం వైపు తీవ్రగాయాలు కావాలి కాని, తల వెనుక వైపు, వీపు వైపు గాయాలు కావడం పలు అనుమానాలకు తావిస్తోందనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే పోలీసులు దీన్ని హత్యగా పరిగణించి ఆ కోణంలోనే దర్యాప్తు ముమ్మరం చేయడంతో త్వరలోనే ఓ నిర్ధారణకు రావచ్చని తెలుస్తోంది. సతీష్ మృతి విచారణ మరింత వేగవంతం చేయడానికి ఇప్పటికే 10 పోలీసు బృందాలను ఏర్పాటు చేసినట్లు పోలీసు ఉన్నతాధికారులు చెబుతున్నారు. రాష్ట్రస్థాయిలో సంచలనం రేకెత్తించిన పరకామణి కేసులో కీలక అధికారి మరణం కూడా అంతే స్థాయిలో సంచలనంగా మారడం గమనార్హం.


సంఘటన పునర్నిర్మాణ(సీన్‌రీకన్‌స్ట్రక్షన్) తీరును పరిశీలిస్తున్న పోలీసులు

# సిఐ సతీష్‌కుమార్ మృతిపై కేసు నమోదు

## తాడిపత్రి సబ్‌డివిజన్‌కు కేసు బదలాయింపు

**గుత్తి, నవంబరు 15 ప్రభాతవార్త:** అనంతపురం జిల్లా గుంతకల్లు రైల్వే రిజర్వుడు సిఐగా విధులు నిర్వహిస్తున్న సతీష్‌కుమార్ శుక్రవారం తెల్లవారుజామున గుత్తి జిఆర్‌పి పరిధిలోని కోమలి రైల్వే స్టేషన్ సమీపంలో మృతి చెందిన సంఘటనలో స్థానిక రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. కర్నూల్ జిల్లా పత్తికొండకు చెందిన బ్రహ్మయ్య, చిదంబరమ్మ కుమారుడైన సతీష్‌కుమార్ గతంలో తిరుమలలో ఏవిఎస్ఓగా విధులు నిర్వహించేవారు. గత మూడు నెలల క్రితం గుంతకల్లు రైల్వేకు బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో ఆయన తిరుమల దేవస్థానం పరకామణి కేసు వ్యవహారంలో సాక్ష్యం ఇచ్చేందుకై గురువారం రాత్రి రాయలసీమ ఎక్స్‌ప్రెస్ (ట్రైన్‌నెంబర్ 12794)లో ఏ1 కోచ్ సీటు నెంబర్ 29లో గుంతకల్లు నుండి తిరుపతికి ప్రయాణమయ్యారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయంకోమలి రైల్వే స్టేషన్ సమీపంలో కి.మీ.373/911 సమీపంలో మృతుడిగా అగుపించాడు. గమనించిన రైల్వేకీ మెన్ పంపేర్ ఈ సమాచారాన్ని కోమలి రైల్వేస్టేషన్ మేనేజర్ రమేష్‌బాబుకు అందించాడు. ఆయన జిఆర్‌పి ఏఎస్ఐ ప్రేమ్‌కుమార్‌కు సమాచారం ఇచ్చారు. తదుపరి మృతుడి వద్ద ఉన్న ఐడీ కార్డు మేరకు ఆయన వివరాలను తెలుసుకున్నారు. తదుపరి మృతుడి సోదరుడు హరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు జిఆర్‌పి ఇన్‌చార్జ్ ఎస్ఐ చంద్ర కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారంపై దర్యాప్తు అధికారి గుంతకల్లు రైల్వే సిఐ అజయ్‌కుమార్ మాట్లాడుతూ రిజర్వుడు సతీష్‌కుమార్ మరణం ప్రమాదవశాత్తు కాదని హత్య జరిగినట్లు వైద్యనివేదికలో తెలుస్తోందన్నారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కేసును తాడిపత్రి పోలీస్‌సబ్ డివిజన్ తాడిపత్రి రూరల్ పోలీస్‌స్టేషన్‌కు కేసు బదలాయించామని తెలిపారు. అయితే ఈ సంఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపింది.

# టెక్స్‌టైల్స్‌లో రూ.4380కోట్ల పెట్టుబడులు

## సీఎం చంద్రబాబు, మంత్రి సవిత సమక్షంలో ఒప్పందాలు

## కుదిరిన 7ఏంఓయులు, 6,100ఉద్యోగాల రాక

### విశాఖ,చిత్తూరు.గుంటూరు,శ్రీసత్యసాయి,అనకాపల్లిలో పరిశ్రమల ఏర్పాటు

### రూ.4వేల కోట్లతో ఫిన్లాండ్‌కు చెందిన ఇన్ఫినిటెడ్ ఫైబర్ సంస్థ పెట్టుబడులు

**విశాఖపట్నం, నవంబరు 15,ప్రభాతవార్త:** విశాఖలో జరిగిన సిఐఐ పార్టనర్ షిప్ సమ్మిట్‌లో టెక్స్‌టైల్స్ రంగంలో రూ.4380.38కోట్ల మేరక 7ఏంఓలు జరిగాయి.ఈ ఒప్పందాలతో ప్రత్యక్షంగా 6100ఉద్యోగాలు లభించనున్నాయి.విశాఖ సమ్మిట్‌లో శనివారం మంత్రి సవిత సమక్షంలో ఈ ఒప్పందాలు కుదిరాయి.టెక్నికల్ టెక్స్‌టైల్స్,రీసైక్లింగ్,గారె మ్మెంట్స్,సిల్క్ అప్పారెల్స్ రంగాల్లో ఈ పెట్టుబడులు పెట్టడానికి ఇన్వెస్టర్స్ ఆసక్తి చూపారు.విశాఖపట్నం,చిత్తూరు,గుంటూరు,శ్రీసత్యసాయి,అనకాపల్లి జిల్లాల్లో పరిశ్రమల ఏర్పాటుకు పెట్టుబడిదారుల ముందుకొచ్చారు.కామధేను సటికా సంస్థ రూ.90కోట్లతో కృష్ణాజిల్లా మచిలీపట్నంలో పరిశ్రమ ఏర్పాటు చేయనున్నారు.ఈ పరిశ్రమతో 650మందికి ఉద్యోగాలు రానున్నాయి.చిత్తూరు జిల్లా గంగ్రాజుపల్లిలో జీనియస్ ఫిల్టర్స్ సంస్థ రూ.120కోట్లు,దీంతో 250మందికి ఉపాధి లభించనుంది.శ్రీసత్యసాయి జిల్లా హిందూపురంలో అరవింద్ అపెరల్ పార్క్ రూ.20కోట్లు పెట్టుబడులు పెట్టనుంది,దీనివల్ల 2వేల ఉద్యోగాలు రానున్నాయి.గుంటూరులో వామిని ఓవర్సీస్ ప్రైవేట్ లిమిటెడ్: రూ.35కోట్లు,విశాఖలో ఎంవిఆర్ టెక్స్‌టైల్స్ రూ.105.38కోట్ల మేరక పెట్టుబడులు పెట్టడానికి ఆ సంస్థ యాజమాన్యం ముందుకొచ్చింది.ఈ సంస్థ ఏర్పాటుతో 900ల మందికి ఉద్యోగాలు లభించనున్నాయి.అనకాపల్లిలో బిసీయుబిఈ టెక్స్‌టైల్స్ యాజమాన్యం రూ.10కోట్ల పెట్టుబడులు పెట్టనుంది.దీంతో 100మందికి ఉపాధి కల్పించనుంది.

సీఎం చంద్రబాబు సమక్షంలో రూ.4వేల కోట్ల పెట్టుబడులకు ఒప్పందం ఫిన్లాండ్‌కు చెందిన ఇన్ఫినిటెడ్ ఫైబర్ సంస్థ ఏపిలో రూ.4వేల కోట్లు పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చింది.ఈ మేరకు సీఎం చంద్రబాబు,మంత్రి సవిత సమక్షంలో ప్రభుత్వంతో ఇన్ఫినిటెడ్ ఫైబర్ సంస్థ ఒప్పందం చేసుకుంది.ఈ సంస్థ విశాఖలో ఏర్పాటుకానుంది,టెక్స్‌టైల్స్ రీసైక్లింగ్ టెక్నాలజిని ఈ సంస్థ భారత్ కు తొలిసారి తీసుకొస్తుంది.మొత్తం 7ఒప్పందాలు ద్వారా ఏపి టెక్స్ టైల్స్ రంగంలో రూ.4380.38కోట్ల మేర పెట్టుబడులు తరలివచ్చాయి.ఈ పరిశ్రమల ఏర్పాటుతో 6100ఉద్యోగాలు రానున్నాయి.

**టెక్స్‌టైల్స్ రంగానికి ఊతం : మంత్రి సవిత**

విశాఖ పార్టనర్‌షిప్ సమ్మిట్‌లో చేసుకున్న ఒప్పందాతో ఏపి టెక్స్‌టైల్స్ రంగానికి ఊతం లభించిందని రాష్ట్ర చేనేత,జౌళిశాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు.సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన నూతనటెక్స్‌టైల్స్ విధానంతో ఏపిలో పెట్టుబడులు పెట్టడానికి పలువురు పారిశ్రామికవేత్తలు ముందుకొచ్చారన్నారు.వారే కాక మరింత మంది రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపుతున్నారని తెలిపారు.ఈ పరిశ్రమలను ఆరు నెలల్లో నెలకొల్పనున్నట్లు మంత్రి సవిత వెల్లడించారు.

# ఇంటికో పారిశ్రామికవేత్త ప్రభుత్వ లక్ష్యం

>> కృషిచేయడం జరుగుతుంది. పెద్ద కంపెనీలు ఎప్పుడూ పెద్ద పెద్ద కార్యాలయాల్లో ఉద్భవించలేదు. సమాజంలోని సమస్యల నుంచి ఉద్భవించాయి. ఇక్కడ కూడా అలాంటి ఎంతోమంది ఉన్నారు. మాకు కావాల్సింది కూడా అదే. ఈ ప్రయాణంలో భాగస్వామ్యం కావాడం, యువ వ్యాపారవేత్తలను నడిపించడం, వారికి శిక్షణ ఇవ్వడం, తగిన వేదిక కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం. మా దార్శనికతకు కార్యరూపం ఇచ్చే సంస్థగా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ (RTIH) పనిచేస్తుంది. ప్రభుత్వం, పరిశ్రమ, విద్యాసంస్థలు, పెట్టుబడిదారులు ఆవిష్కర్తలను కలిపే ఒక వేదిక ఇది. వీటిద్వారా డీసెంట్రలైజ్డ్ ఇన్నోవేషన్ ను ప్రోత్సహిస్తాం. ప్రతి హబ్ అండ్ స్పోక్ కేంద్రాలు కార్పొరేట్, అకడమిక్ పార్టనర్ల ఆధ్వర్యంలో ఉంటాయి. దీనివల్ల ప్రజా-ప్రైవేట్ భాగస్వామ్యంతో బలమైన ఇన్నోవేషన్ నెట్‌వర్క్ రూపుదిద్దుకుంటుంది. ఆర్ టిఐహెచ్ ద్వారా మన దగ్గర ప్రస్తుతం పూర్తిస్థాయిలో స్టార్టప్ లైఫ్‌సైకిల్ ఉంది. ఐడియా డిస్కవరీ, ఫ్యూచర్ ఫౌండర్స్, కేటలిస్టు, వెలాసిటీ ల్యాబ్స్ ద్వారా వేగంగా అభివృద్ధి సాధించడమే మా లక్ష్యం. APIC, MIవిని ద్వారా ప్రోటోటైపింగ్, గ్రామీణ ప్రాంతాల్లో మొబైల్ యూనిట్ల ద్వారా ఇంక్యూబేషన్ చేపడతాం. ఆంధ్రప్రదేశ్‌ను భారత్ కు టెక్ రాజధానిగా మారుస్తాంమేం పరిపాలనలో కొత్తధనాన్ని నేరుగా ప్రవేశపెడుతున్నాం. ఆంధ్రప్రదేశ్‌ను భారత్ కు టెక్ రాజధానిగా మారుస్తాం. కోఇన్నోవేటర్స్, స్టార్టప్‌లకు ప్రభుత్వం తొలి కస్టమర్ గా ఉంటుంది. ఆర్ టిఐహెచ్ GovTech ద్వారా వాస్తవిక సమస్యలను గుర్తించి వెనువెంటనే పరిష్కరిస్తాం. హ్యాకథాన్‌లు నిర్వహించి స్టార్టప్‌లు అమలు, స్కేల్ చేయగలిగే సొల్యూషన్‌లు అందిస్తాం. ఇది కొత్త మోడల్ !! ప్రజా సమస్యల ఆధారంగా పరిష్కారాలకు ఇన్నోవేషన్స్ ను ప్రోత్సహిస్తాం. ఆంధ్రప్రదేశ్ ప్రపంచంలో గుర్తింపు పొందాలన్నదే మా లక్ష్యం. ముఖ్యంగా ఇక్కడ ప్రారంభించి ప్రపంచాన్ని గెలవాలనుకునే మహోన్నత లక్ష్యం కలిగిన కొత్తతరం ఎంటర్ ప్రెన్యూర్స్ కోసమే ఈ ప్రయత్నం.

వన్ ఫ్యామిలీ - వన్ ఎంటర్ ప్రెన్యూర్ అన్నది కేవలం నినాదం కాదు. ఇది కొత్త అభివృద్ధి నమూనా. దీన్ని సాధించేందుకు, AP Innovation !! Startup Policy 2024 ను ప్రవేశపెట్టాం. విద్యార్థి దశ నుంచి వ్యాపారవేత్తగా ఎదిగేందుకు ఇందులో స్పష్టమైన మార్గాలు ఉన్నాయని మంత్రి లోకేష్ పేర్కొన్నారు. నారా లోకేష్ సమక్షంలో 6 సంస్థలతో ఎంవోయూమంత్రి నారా లోకేష్ సమక్షంలో 6 సంస్థలతో ఎంవోయూలు కుదుర్చుకోవడం జరిగింది. ఏపీ వాగ, స్టార్టప్ యూఏఈ, క్వాంటమ్ ఏఐ, AIM/AIG, స్టార్టప్ రన్ వే, ఆర్ఆర్ పీ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ కంపెనీలతో ఒప్పందాలు చేసుకోవడం జరిగింది. ఆర్ఆర్ పీ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ రూ.10వేల కోట్ల పెట్టుబడి పెట్టనుంది. ఈ కార్యక్రమంలో ఆర్ టిఐహెచ్ సిఇఓ పి.ధాత్రి రెడ్డి, టాటా ఇన్నొవేషన్ గ్రూప్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రవి అరోరా, బ్లాక్ బక్ కో ఫౌండర్ రాజేష్ యాబాజీ, ఎండియా పార్టనర్స్ ఎండి సతీష్ ఆంధ్ర, ప్రొఫెసర్ రమేష్ లోకనాథన్, గ్లోబల్ అలయెన్స్ ఫర్ మాస్ ఎంటర్ ప్రెన్యూర్ షిప్ (GAME) కో ఫౌండర్ మదన్ పాడకి తదితరులు పాల్గొన్నారు.

# సత్యసాయి బోధనలు మార్గదర్శక కాంతి పుంజాలు

## కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

**శ్రీసత్యసాయి జిల్లా, నవంబర్ 15, ప్రభాతవార్త ప్రతినిధి:** సత్యసాయి బాబా బోధనలు సమాజానికి మార్గదర్శక కాంతి పుంజాలు అని భారత ప్రభుత్వ వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయుష్ గోయల్ పేర్కొన్నారు. ఆయన శనివారం భగవాన్ సత్య సాయి బాబా మహా సమాధి నీ ప్రత్యేకంగా దర్శించుకుని భక్తిపూర్వక ప్రార్థనలు చేశారు. భగవాన్ శ్రీ సత్య సాయి బాబా వారి జన్మ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా శ్రీ సత్య సాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె. రత్నాకర్ ఆయనకు ఆత్మీయ స్వాగతం పలికారు. భగవాన్ సందేశాన్ని, వారి పవిత్ర సేవా మిషన్‌ను ప్రపంచానికి చాటుకోవడంలో శ్రీ సత్య సాయి సెంట్రల్ ట్రస్ట్ చేస్తున్న నిరంతర కృషిని పీయూష్ గోయల్ హృదయపూర్వకంగా అభినందించారు. అనంతరం సత్యసాయి భక్తులను ఉద్దేశించి కేంద్రమంత్రి పీయూష్ గోయల్ మాట్లాడుతూ, 2016లో తొలిసారి ప్రశాంతినిలయానికి వచ్చినప్పుడు అనుభవించిన ఆ దివ్యానుభూతి, తిరిగి అడుగు పెట్టగానే మళ్లీ తన హృదయాన్ని అలుముకుందని ఆయన సంతోషంగా పంచుకున్నారు. భగవాన్ శ్రీ సత్య సాయి బాబా ప్రతి హృదయంలో నాటిన మానవత విలువలను కొనియాడారు. ముఖ్యంగా"అందరినీ ప్రేమించండి, అందరినీ సేవించండి (లవ్ ఆల్ సర్వ్ ఆల్) అందరికీ సహాయం అందించు ఎవరిని బాధ పెట్టకు" (హెల్ప్ ఎవర్ హర్ట్ నెవెర్ ) అన్న దివ్య సందేశాల్ని ఎంతో ప్రేమగా స్మరించారు. ఈ విలువలను సమాజంతో పంచుకోవడం ఎంతో ముఖ్యమని, ఇవే భారతదేశానికి నిజమైన బలం , మార్గదర్శక కాంతి గా అభివర్ణించారు. భగవాన్ వారి జన్మ శతాబ్ది ఉత్సవాలలో పాల్గొనడం తనకు ఎంతో ఆనందంగా ఉందని , భవిష్యత్తులో పుట్టపర్తికి మరింత తరచుగా రావాలని ఉందన్న తన ఆకాంక్షను వ్యక్తం చేశారు. సేవాదళ్ సభ్యులు, భక్తులు మరియు శ్రీ సత్య సాయి సెంట్రల్ ట్రస్ట్ చేస్తున్న విశిష్ట సేవలను ప్రత్యేకంగా ప్రశంసిస్తూ, భగవాన్ ప్రేమ మరియు నిస్వార్థ సేవా సందేశాన్ని ప్రశాంతినిలయం ద్వారా , అనేక కార్యక్రమాల ద్వారా ప్రపంచ మంతటా వ్యాప్తి చేయడం అభినందనీయమన్నారు.


సత్యసాయి మహాసమాధి వద్ద పూలమాలలు సమర్పిస్తున్న కేంద్రమంత్రి పీయూష్ గోయల్, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి

# ప్రత్యేక టాస్క్‌ఫోర్స్

>> తూ ఎర్రచందనం అక్రమ రవాణాను పూర్తిగా నిరోధించాలి. ఎర్ర చందనం విక్రయాల ద్వారా సమకూరే ఆదాయంలో నిర్దేశిత శాతం ఎర్ర చందనం విత్తనాలు జల్లడం, ఎర్ర చందనం వనాలు అభివృద్ధి, సంరక్షణకు కేటాయించే ఆలోచన చేస్తున్నామ్మ అని చేశారు. శేషాచలం అడవుల నుంచి ఒక్క ఎర్రచందనం దుంగ కూడా అక్రమంగా బయటకు వెళ్లకూడదనీ, దీని కోసం ఓ పటిష్టమైన ప్రణాళికను రూపొందించాలని ఆదేశించారు. వ్యవస్థలన్నీ సమన్వయంతో పని చేస్తే అక్రమార్కుల ఆటకట్టించడం అసాధ్యం కాదన్నారు. ఎర్రచందనం అక్రమ రవాణాను ప్రధాన ఆదాయ వనరుగా మార్చుకొన్న కింగ్ పిన్స్ ను చట్టం ముందు నిలపడానికి ప్రత్యేక బృందాలను పోలీసుఅటవీ అధికారుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

చెట్లను నరకడానికి వస్తున్న కూలీలు, మేస్త్రీలు, సూపర్ వైజర్లు, గోదాము కీపర్లు వంటి కిందిస్థాయి వారిని గుర్తించి, వారికి చట్టంపై అవగాహన కల్పించి కౌన్సిలింగ్ చేసి, ఇతర ఉపాధి మార్గాలు చూపించాల్సిన అవసరం ఉందన్నారు. ."2015లో ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధానికి అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం చొరవ తీసుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అప్పట్లోనే దీని కోసం ప్రత్యేకంగా ఆలోచించి రెడ్ సాండర్స్ యాంటీ స్మగ్లింగ్ టాస్క్ ఫోర్సును ఏర్పాటు చేస్తూ జీవో విడుదల చేశారు. కార్యకలాపాలను విస్తృతం చేశారు. ఐజీ స్థాయి అధికారిని టాస్క్ ఫోర్స్ కు నియమించి, అటవీపోలీసు అధికారులతో ప్రత్యేకంగా దళం ఏర్పాటు చేయించి ముందుకు వెళ్లారు. 2019లో ప్రభుత్వం మారిన తర్వాత టాస్క్ ఫోర్సును ఓ పద్ధతి ప్రకారం నిర్వీర్యం చేశారు. తత్ఫలితంగా అక్రమ రవాణాకు ద్వారాలు తెరిచినట్లయింది. ఫలితంగానే 2019-24 మధ్య లక్షలాది ఎర్రచందనం చెట్లను నరికి అక్రమంగా తరలించారు. నేను ఇటీవల సందర్శించిన తిరుపతిలోని 8 గోదాముల్లో 2,63,267 ఎర్రచందనం దుంగలున్నాయి. కేవలం పట్టుబడిన దుంగలను బట్టి చూస్తేనే సుమారు 2 లక్షల చెట్లు నరికినట్లు అర్థమవుతోంది. మరి అక్రమ మార్గాల్లో ఎన్ని లక్షల చెట్లను నరికివేశారో ఊహకు అందటం లేదు.

ఎర్రచందనం అనేది పర్యావరణహితమైన చెట్టు. అత్యంత పటిష్టంగా శేషాచలం అడవుల్లో మాత్రమే పెరిగే అరుదైన వృక్షం. ఇక నుంచి ఎర్రచందనం ఒక్క దుంగ కూడా బయటకుపోకుండా చేయాలి. దీనికి మన ముందున్న దారులన్నీ వినియోగించుకుందాం. మళ్లీ టాస్క్ ఫోర్సుకు జీవం పోసి, అక్రమ రవాణా నిరోధించే ప్రణాళికపై ముఖ్యమంత్రితో మాట్లాడుతాను. స్మగ్లర్లపై పెట్టిన కేసుల్లోనూ న్యాయస్థానాల నుంచి వేగంగా తీర్పులు రావడం శుభసూచకం. అటవీ శాఖ సిబ్బంది ఎర్ర చందనం సంరక్షణను ఒక సంకల్పంలా తీసుకోవాన్నారు.

## వారం - వర్జ్యం

16-11-2025, ఆదివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆశ్వయుజ మాసం, దక్షిణాయణం
శరదృతువు, కృష్ణపక్షం
ద్వాదశి తె.4.48
హస్త రా.2.11
వర్జ్యం : ఉ.11.08 - 12.55
దు.ము.3.59-4.44
రాహుకాలం - సా.4.30-6.00

## వార్తాఫలం

**మేషం:** ఏ కార్యక్రమాన్ని చేపట్టినా ఆలోచించి నిర్ణయాలు తీసుకోండి. బంధువుల నుండి వచ్చిన ఆహ్వానాలు ఆనందం కలిగిస్తాయి.

**వృషభం:** పెద్దల అభీష్టం మేరకు మాత్రమే స్థిరాస్తి వ్యవహారాలలో ముందడుగు వేయండి. వృత్తి, వ్యాపారాలలో లాభాలు పొందుతారు.

**మిథునం:** వృత్తి, వ్యాపారాలకు సంబంధించి ఫలప్రదమైన చర్చలు కొనసాగిస్తారు. పారిశ్రామిక రంగాలవారికి విజయవంతమైన కాలం.

**కర్కాటకం :** ఎదుటివారు మీతో సంభాషించేటప్పుడు వారి మాటలలోని మంచిని మాత్రమే గ్రహించండి. వాహనాలు కొనుగోలు చేస్తారు.

**సింహం:** మీరు ఎదురు చూస్తున్నా ఉత్తర్వులు చేతికి అందుతాయి. సన్నిహితుల నుండి కీలక సమాచారం అందుతుంది.

**కన్య :** భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని గోప్యతకు ప్రాధాన్యతనిస్తారు. సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు.

**తుల :** ఎవరికి తెలియకుండా రహస్య కార్యాచరణ సాగిస్తారు. సంగీత సాహిత్యాలపై ఆసక్తి చూపుతారు.

**వృశ్చికం:** అనుకోని అవకాశాలు లాభిస్తాయి. స్థిరాస్థి వివాదాలు తీరి లబ్ధిపొందుతారు. ఇంటా బయటా ప్రోత్సాహం లభిస్తుంది.

**ధనుస్సు:** నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. అనుకోని అవకాశాలు లభిస్తాయి. క్రయ విక్రయాలలో ప్రోత్సాహం పొందుతారు.

**మకరం:** కుటుంబ సభ్యులతో కలిసి తీర్థ యాత్రలు చేస్తారు. ఇంటా బయటా ప్రోత్సాహం. వృత్తి, వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి.

**కుంభం:** సంఘ సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు. జీవిత భాగస్వామి నుండి ఆస్తి లాభం పొందుతారు.

**మీనం :** మీలోని లోటుపాట్లు గుర్తించి కొన్ని అలవాట్లలో మార్పులు చేస్తారు. ఉద్యోగులకు బాధ్యతలు పెరిగిన సమర్థ వంతంగా నిర్వహిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ప్రభుత్వోద్యోగాల్లో ట్రాన్స్‌జెండర్లకు రిజర్వేషన్లు కల్పించండి

## రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ హైకోర్టు తీర్పు

**విజయవాడ,నవంబరు 15,పభాతవార్త ప్రతినిధి:** ప్రభుత్వ ఉద్యోగాల్లో ట్రాన్స్‌జెండర్లకు రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ హైకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. తీర్పు ప్రతి అందిన ఆరు నెలల్లో ఈ ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టం చేసింది. పిటీషనర్‌ను స్కూలు అసిస్టెంట్ పోస్టులో నియమించే వ్యవహారాన్ని పరిగణలోకి తీసుకోవాలని పేర్కొంది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.విజయ్ ఇటీవల ఈ తీర్పు ఇచ్చారు. మెగా డీఎస్సీలో ట్రాన్స్‌జెండర్లకు రిజర్వేషన్ కల్పించకపోవడాని్న సవాలు చేస్తూ ఏలూరుజిల్లా జంగారెడ్డిగూడేనికి చెందిన ట్రాన్స్‌జెండర్(ఉమన్) కె.రేఖ హైకోర్టులో వ్యాజ్యం చేశారు. ట్రాన్స్‌జెండర్లకు పోస్టులు నోటిఫై చేయకపోవడంతో అధికారులు తనను ఉద్యోగానికి ఎంపిక చేయలేదన్నారు. పోస్టులు కేటాయించకపోవడం సుప్రీం కోర్టు తీర్పునకు విరుద్ధమన్నారు. పిటీషనర్ తరపున న్యాయవాది ఎం.సాల్మన్‌రాజు వాదనలు వినిపించారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి రిజర్వేషన్లు కల్పించాలని తీర్పు ఇచ్చారు. కుటుంబం,సమాజం నుండి ఎదురవుతున్న వివక్ష కారణంగా ట్రాన్స్‌జెండర్లు సాంఘిక,ఆర్థిక, సాంస్కృతిక,రాజకీయ రంగాలకు దూరమయ్యారు. వారిని తిరిగి జనజీవనంతో మిళితం చేయాలి.వారికి ప్రభుత్వ ఉద్యోగాల్లో,అన్ని రంగాల్లో అవకాశం కల్పించడానికి సమగ్ర విధానం అవసరం అని న్యాయమూర్తి అభిప్రాయపడ్డారు. కేంద్ర ప్రభుత్వం ట్రాన్స్‌జెండర్ల హక్కుల పరిరక్షణ చట్టం 2019 తీసుకొచ్చింది. ఈ చట్టాన్ని అనుసరించి రాష్ట్ర ప్రభుత్వాలు ట్రాన్స్‌జెండర్లకు విద్య,ఉద్యోగ అవకాశాల్లో రిజర్వేషన్లు కల్పించాలి' అని జస్టిస్ ఎన్.విజయ్ తన తీర్పులో పేర్కొన్నారు.

# నేడు విజయవాడకు సిజెఐ గవాయ్

>>మంగళగిరిలోని సీకే కన్వెన్షన్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొంటారు. ఇండియా అండ్ ది లివింగ్ ఇండియన్ కాన్స్టిట్యూషన్ ఎట్ 75 ఇయర్స్ అనే అంశంపై ప్రసంగిస్తారు. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్ల పూర్తయిన సందర్భంగా ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, హైకోర్టు న్యాయమూర్తులు, రాష్ట్ర అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, న్యాయవాదులు పాల్గొంటారు. సీజేఐ పర్యటన నేపథ్యంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి, సెషన్ జడ్జి బి.సాయి కల్యాణ చక్రవర్తి, హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చిదంబరం, గుంటూరు జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా, ఎస్పీ వకుల్ జిందాల్ సీ కన్వెన్షన్‌లో ఏర్పాట్లను పరిశీలించారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, తెనాలి సబ్‌కలెక్టర్ సంజనా సింహా తదితరులు పాల్గొన్నారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్సింగ్ ఠాకుర్, హైకోర్టు న్యాయమూర్తులు, అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, పలువురు న్యాయవాదులు పాల్గొంటారు.

# లిక్కరు స్కామ్ నిందితుడు అనిల్ చోకరాకు 21 వరకు రిమాండ్

## రిమాండ్ రిపోర్టులో అనేక కీలకాంశాలు వెల్లడి

**విజయవాడ,నవంబరు 15,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ మద్యం కుంభకోణం కేసు లో ఏ49 అనిల్ చోకరాను ముంబైలో అరెస్టు చేసి విజయవాడ సిట్ కార్యాలయానికి తరలించారు. శనివారం విచారణ చేపట్టారు. అయితే ఈ విచారణలో పలు కీలక విషయాలు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. ఈ కేసులో కీలక నిందితుడుగా ఉన్న అనిల్ చోఖ్రా రిమాండ్ రిపోర్టులో సంచలన అంశాలు పొందుపర్చారు. అనిల్ చోఖ్రా.. లిక్కర్ స్కాం కేసులో ఎ1 రాజ్ కేసిరెడ్డి, ఎ7 ముప్పిడి అవినాష్ రెడ్డితో చేతులు కలిపి మనీ ల్యాండరింగ్‌కు పాల్పడ్డారని పేర్కొన్నారు. ముంబై కేంద్రంగా షెల్ కంపెనీల ద్వారా



నిధులను చట్టవిరుద్ధంగా అనిల్ చోకరా మళ్లించినట్లు సిట్ అధికారులు గుర్తించారు. ఆ ధనాన్ని మద్యం సిండికేట్‌లకు, అప్పటి ప్రభుత్వ పెద్దలకు ముడుపులు చెల్లించడానికి ఉపయోగించారని దర్యాప్తులో నిర్ధారిం చారు. రూ.77.55 కోట్లను ఆదాన్, లీలా, స్పై నుంచి ముంబైకి చెందిన నాలుగు షెల్ కంపెనీల ద్వారా బ్లాక్ మనీ మార్పిడి చేసినట్లు సిట్ అధికారుల దర్యాప్తులో తేలింది. లిక్కర్ స్కాం కేసులో బ్యాంకు ఖాతాలను సృష్టించి, డబ్బులురూటింగ్ చేయడంలో అనిల్ చోఖ్రా కీలక పాత్ర పోషించాడు. తాజాగా ఏ49గా ఉన్న అనిల్ చోఖ్రాకు ఏసిబికోర్టు రిమాండ్ విధించింది.ఈనెల 21వ తేదీ వరకు రిమాండ్ విధిస్తూ ఏసిబి కోర్టు ఆదేశాలు ఇచ్చింది.

16-11Pg3exHMNWJQET 3RD_16-11Pg3exHMNWJQET.qxd 16/Nov/25 12:42 AM Page 1



## వంతెన కూలి కాలువలో పడిన టిప్పర్

**విజయవాడ,నవంబరు 15,ప్రభాతవార్తప్రతినిధి:** కృష్ణాజిల్లా పెదపారుపూడి మండలం పాముల పాడు గ్రామంలో ప్రమాదవశాత్తు వంతెన కూలింది. దోసపాడు చానల్ కాలువలో టిప్పర్ లారీ పడిపోయింది. అధిక లోడుతో టిప్పర్ లారీ రావడంతోనే వంతెన కూలింది. ఈ ప్రమాదంలో టిప్పర్ డ్రైవర్ అదృష్టవశాత్తు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. వంతెన కూలడం వల్ల మండలంలోని పలు గ్రామాలకు వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. గతంలో సైతం: పెదపారుపూడి మండలం ఈదుల మద్దాలి గ్రామ సమీపంలో వంతెన మధ్య భాగం కూలి ట్రాక్టర్ బోల్తా పడింది. దీంతో పెదపారుపూడి నుంచి విజయవాడకు వెళ్లే మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. 8 నెలల కిందట వంతెన కుంగిపోవటంతో భారీ వాహనాలు ప్రయాణించకుండా అధికారులు చర్యలు చేపట్టారు. గుడివాడకంకిపాడు రహదారి అధ్వానంగా ఉండడంతో వాహనదారులు ఈ రహదారినే రాకపోకలు సాగిస్తున్నారు.

# అతిపెద్ద గ్రీన్‌ఫీల్డ్ సిటీగా అమరావతి

### న- విశాఖ భాగస్వామ్య సదస్సులో మంత్రి నారాయణ - దేశవిదేశాల నుంచి హాజరైన పెట్టుబడిదారులకు అమరావతి గురించి వివరించిన మంత్రి

**విశాఖపట్నం,నవంబర్ 15,ప్రభాతవార్త :** అమరావతి రాజధాన్ని ప్రపంచస్థాయి ప్రమాణాలతో దేశంలోనే అతిపెద్ద గ్రీన్ ఫీల్డ్ సిటిగా నిర్మిస్తున్నామని పురపాలక శాఖ మంత్రి నారాయణ స్పష్టంచేశారు. అమరావతి నిర్మాణం ద్వారా భవిష్యత్ తరాలకు స్థిరమైన రాజధాన్ని అందిస్తున్నామన్నారు. విశాఖలో జరుగుతున్న 30వ సిఐఐ భాగస్వామ్య సదస్సులో ప్లీనరీ సెషన్‌లో స్థిరమైన నగరాలు - ఫ్రం విజన్ టు ఇన్వెస్ట్‌మెంట్స్ అనే అంశంపై మంత్రి నారాయణ ప్రసంగించారు. అమరావతి ప్రజా రాజధానిని ప్రపంచ స్థాయి రాజధానిగా నిర్మించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను దేశ విదేశాల పారిశ్రామిక వేత్తలకు మంత్రి నారాయణ వివరించారు. అటు అమరావతిపై నిపుణులతో పాటు పెట్టుబడి దారులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. సదస్సులో మంత్రి నారాయణ అమరావతిపై ఇంకా ఏమన్నారంటే.. అమరావతి ప్రజారాజధాని 217చకిమీ విస్తీర్ణంతో దేశంలోని రాజధాని నగరాల్లో ప్రత్యేకంగా నిలుస్తుంది. దేశంలోని అతి పెద్ద ల్యాండ్ పూలింగ్ పథకం లో స్వచ్ఛంధంగా పాల్గొన్న 29వేల కంటె ఎక్కువ మంది రైతులు నుంచి అమరావతి జన్మించిందన్నారు. అఖండ మద్దతు నుంచి జన్మించింది. అమరావతిని ఆర్థికంగా, శక్తివంతమైన, పర్యావరణ పరంగా స్థిరమైన, రాబోయే తరాలకు అవకాశాలను సృష్టించేలా నిర్మిస్తున్నామన్నారు. 2050నాటికి 3.5మిలియన్ల జనాభాతో 35బిలియన్ డాలర్ల జిడిపితో 1.5మిలియన్ల ఉపాధి అవకాశాలు కల్పించాలనేది లక్ష్యంగా పెట్టుకున్నాం. సింగపూర్ ప్రభుత్వం ఇచ్చిన మాస్టర్ ప్లాన్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు మార్గదర్శకత్వంలో ప్రపంచస్థాయి ప్రమాణాలతో అమరావతి నిర్మాణం జరుగుతుందని మంత్రి చెప్పారు. సుమారు 90కిమీ పొడవైన ఇన్నర్ రింగురోడ్డు, 190కిమీ మేర ఔటర్ రింగ్‌రోడ్డు నిర్మాణానికి ఇప్పటికే అనుమతి వచ్చింది. దేశంలోనే రద్దీగా ఉండే విజయవాడ రైల్వే స్టేషన్ కేవలం 10కిమీల మేర ఉండగా, కొత్తగా నిర్మిస్తున్న హైదరాబాద్-నంబూరు రైల్వే లైన్ కేపిటల్ సిటిని ఆనుకొని వెళ్తుందన్నారు. గన్నవరం ఎయిర్‌పోర్టుతోపాటు కొత్తగా మరో అంతర్జాతీయ విమానాశ్రయంతో పాటు మచిలీపట్నం పోర్టు కనెక్టివిటీ అమరావతికి ఉంది. 30శాతం బ్లూ గ్రీన్ రాజధానిగా 7సహజమై ద్వీపారు, 21కిమీ నదీతీరం అమరావతిని అత్యంత అనుకూల వాతావరణం ఉన్న రాజధానిగా మారుస్తాయన్నారు. అమరావతి నివాసయోగ్యమైన ప్రజాకేంద్రిత రాజధానిగా నిర్మిస్తున్నామని మంత్రి తెలిపారు. 5-10-15నిమిషాల నివాసయోగ్యంగా ప్రణాళికా బద్ధంగా నిర్మాణం జరుగుతుందన్నారు. అమరావతిలో ఉండే ప్రజలు అత్యవసర సేవలకు 5నిమిషాలు, వినోద ప్రదేశాలకు 10నిమిషాలు, పని ప్రాంతాలకు 15నిమిషాల్లో చేరుకునేలా నివాసయోగ్యంగా అమరావతి నిర్మాణం ఉంటుందన్నారు. 360కిమీ ట్రంక్ రోడ్లు, 1500కిమీ రోడ్డు నెట్వర్ క్‌తో ట్రాఫిక్ సజావుగా సాగేలా ప్రణాళికలు రూపొందించినట్లు మంత్రి చెప్పారు.




## ఎపిలో సెమి కండక్టర్స్, చిప్ డిజైనింగ్ యూనిట్ ఏర్పాటుచేయండి

### సిలికాన్ జెన్ చైర్మన్ చిదంబరంతో మంత్రి నారా లోకేష్

**విశాఖపట్నం,నవంబరు 15:** ఎలక్ట్రానిక్స్ సిస్టమ్ డిజైన్ !! తయారీ - సెమీకండక్టర్స్ లో పేరెన్నిగన్న సిలికాన్ జెన్ సంస్థ చైర్మన్ చీదా చిదంబరంతో మంత్రి నారా లోకేష్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ... ఎపిలో కోలొకేటెడ్ ఓశాట్ తో సెమీ కండక్టర్స్ ఫ్యాబ్రికేషన్ (ఫ్యాబ్), చిప్ డిజైనింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. ఎపి ఐటి, సెమీ కండక్టర్స్ పాలసీ 2.0లో దేశంలోనే అత్యుత్తమ ప్రోత్సాహకాలు ఉన్నాయని తెలిపారు. సంస్థ చైర్మన్ చీదా చిదంబరం మాట్లాడుతూ.... ఇంటిగ్రేటెడ్ సిస్టమ్‌ఇన్‌ప్యాకేజ్ సొల్యూషన్స్ కోసం అధునాతన 3దీ వేఫర్ స్టాకింగ్‌పై తాము దృష్టి సారించినట్లు చెప్పారు. తి৷ బిశిగేలు, దిశిగేలు, హైబ్యాండ్‌విడ్త్ మెమరీ, పవర్ మేనేజ్‌మెంట్ ।దిలు తయారీపై తమకు ఆసక్తి ఉందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదనలపై తమ సంస్థలో చర్చించి సానుకూల నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

## మైనింగ్ లీజుల్లో సిఎఫ్ఓ సరిహద్దుల తనిఖీ



ఐదు మైనింగ్ లీజుల హద్దులనుతనిఖీ చేస్తున్న సిఎఫ్ఓ

**డి.హిరెహాళ్ నవంబరు 15 ప్రభాతవార్త** కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ లోని బళ్లారి రిజర్వ్ ఫారెస్ట్ లో సంతరించుకున్న వివాదాస్పదంగా మారిన ఇనుప గనులు లీజులు సరిహద్దుల బౌండరీలను సర్కిల్ ఫారెస్ట్ అధికారిని యశోదాబాయి తనిఖీ చేశారు. శనివారం ఆమె సోషల్ ఫారెస్ట్రీ డిఎఫ్ఓ గురుప్రభాకర్ స్థానిక అటవీ శాఖ అధికారులతో కలిసి అనంతపురం జిల్లా డి.హిరెహాళ్ మండలం ఓబులాపురం వన్, ఓఎంసీ వన్, హెచ్ సిద్దాపురం వన్, మలపనగుడి వన్ లీజు గనులతో పాటు కర్ణాటక మైనింగ్ లీజులను చూపే సరిహద్దు బౌండరీలను పరిశీలించారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు 6 మంది కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గత 15 రోజులు వివాదాస్పదమైన ఐదు మైనింగ్ లీజుల్లో నిర్వహించిన సర్వే తో పాటు ఇరు రాష్ట్రాల సరిహద్దులను సర్వే బృందం చరవాణిలో నిక్షిప్తం చేసిన సర్వే చిత్రాలు, రికార్డుల మేరకు మ్యాప్ చిత్రపటాలను ఆమె పరిశీలించినట్లు తెలిసింది. సుప్రీంకోర్టు పునర్నినియమించిన 6 మంది సభ్యులకు కమిటీ ఈనెల 26న వివాదాస్పద గనుల లీజులను క్షేత్రస్థాయిలో నిర్ధారించేందుకు రానున్న సందర్భంగా సిఎఫ్ఓ పరిశీలనకు ప్రాముఖ్యత సంతరించుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. సర్వే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రాష్ట్రానికి చెందిన సర్వే ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్, గనులు భూగర్భ శాఖ, అటవీ శాఖలు అధికారులు, సిబ్బంది వివాదాస్పద మైనింగ్ లోని ఐదు లీజుల్లో డ్రోన్, లిడార్ సర్వేను క్షేత్రస్థాయిలో 15 రోజులపాటు సరిహద్దుల బౌండరీల సర్వేను నిర్వహించారు. ఓఎంసీ, బిఐకెపి, వైఎం, ఏజీఎం, ఏఎంసీ లీజు గనుల్లో మూడు శాఖల ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించిన సరిహద్దు బౌండరీల సర్వేను నిజనిర్ధారణ కమిటీ ఓఎంసీ యజమాని గాలి జనార్దన్ రెడ్డి ఆయా లీజు మైనింగ్‌ల్లో అన్యాక్రాంతం, అక్రమ తవ్వకాలు, అవినీతికి పాల్పడ్డారా లేదన్న అంశాలను తేల్చాల్సి ఉంది. ఈనెల 26 తర్వాత నిజనిర్ధాలను కమిటీ ఎలాంటి నివేదికలను సుప్రీంకోర్టుకు సమర్పించనుందని ఆయా మైనింగ్ లీజుల యజమానులతో పాటు కర్ణాటక కు చెందిన మైనింగ్ లీజుల యజమానులు, స్థానిక ప్రాంతం ప్రజలు, కార్మికులు వేచి చూస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ రామచంద్రుడు, డిఆర్ఓ దామోదర్ రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

# విశాఖ సాగర తీరాన పెట్టుబడుల సునామీ

### ఫలించిన చంద్రబాబు కృషి - సిఎం సమక్షంలో రూ. 7,63,210 కోట్ల పెట్టుబడులకు ఎంఒయూలు - మంత్రుల సమక్షంలో రూ. 5,62,506 కోట్ల పెట్టుబడులకు ఎంఒయూలు - 3 రోజుల్లో రూ. 13,25,716 కోట్ల పెట్టుబడులు - విశాఖ సమ్మిట్‌ను బిగ్ హిట్ చేసిన పారిశ్రామిక వేత్తలు

**విశాఖపట్నం, నవంబర్ 15 ప్రభాతవార్త** విశాఖ సాగర తీరానికి పెట్టుబడుల సునామీ వచ్చింది. సీఐఐ భాగస్వామ్య సదస్సుకు అంచనాలకు మించిన స్థాయిలో పెట్టుబడులపై ఎంఓయూలు కుదిరాయి. ఒకటి కాదు.. రెండు కాదు.. వందల సంఖ్యలో ఎంఓయూలు కుదిరాయి... లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి... అదే స్థాయిలో ఉద్యోగాల కల్పనపై కంపెనీల నుంచి హామీలు వచ్చాయి. రెండు రోజుల పాటు జరిగే 30వ భాగస్వామ్య సదస్సులో ఎంఓయూలు కుదుర్చుకోవాలని భావిస్తే... పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామిక వేత్తలు పెద్ద ఎత్తున ముందుకు రావడంతో మూడు రోజుల పాటు ఎంఓయూలు కుదుర్చుకోక తప్పని సరైంది ప్రభుత్వానికి. మూడు రోజుల పాటు కుదుర్చుకున్న ఒప్పందాల విలువ రూ. 13,25,716 కోట్ల పెట్టుబడులు కాగా వీటి ద్వారా 16,31,188 ఉద్యోగాలు కల్పించేందుకు అవకాశాలు కన్పిస్తున్నాయి. వాస్తవానికి భాగస్వామ్య సదస్సులో భారీగా పెట్టుబడులు వస్తాయని ప్రభుత్వం ముందుగానే అంచనా వేసింది. రెండు రోజుల్లో సుమారుగా రూ. 10 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని భావిస్తే... పారిశ్రామిక తగ్గేదెలే అన్నట్టుగా విశాఖ నగరానికి పోటెత్తారు. ఒప్పందాల విలువ రూ. 13 లక్షల కోట్లకు పైగా చేరింది. దీంతో ప్రభుత్వ వర్గాల్లో సంతృప్తి వ్యక్తమవుతోంది. అంచనాలకు మించి 30 శాతానికి మించి అదనంగా పెట్టుబడులుకూటమి ప్రభుత్వం ఏర్పడి నాటి నుంచే చంద్రబాబు నేతృత్వంలోని సర్కార్... పారిశ్రామికాభివృద్ధి మీద ఫోకస్ పెట్టింది. ప్రతి 15 రోజులకోసారి కెబినెట్ సమావేశాలు పెట్టుకున్న తరహాలో ఎస్ఐపీబీ సమావేశాలు పెట్టుకుంది. వివిధ సంస్థలకు పెద్ద ఎత్తున అనుమతులు ఇచ్చింది. ఈ క్రమంలో విశాఖ భాగస్వామ్య సదస్సు నాటికే సుమారుగా రూ. 10 లక్ష కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఏపీపై పారిశ్రామిక వర్గాల్లో నమ్మకం కలగడానికి ఇదే నిదర్శనం అని ప్రభుత్వం వివిధ సందర్భాల్లో చెబుతూనే ఉంది. దీన్ని మరింతగా కొన సాగించాలని... రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో పెద్ద ఎత్తున పరిశ్రమలు తీసుకువచ్చేలా చూడాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం విశాఖ తీరాన భాగస్వామ్య సదస్సును చేపట్టాలని ప్లాన్ చేసింది. దీనికి అనుగుణంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సింగపూర్, యూఏఈ, లండన్ వంటి దేశాల్లో పర్యటించారు. అక్కడి పారిశ్రామిక వేత్తలను ఆహ్వానించారు. పెట్టుబడులు పెట్టాల్సిందిగా కోరారు. దీంతో భాగస్వామ్య సదస్సు నిర్వహించిన రెండు రోజుల్లో భారీగా పెట్టుబడులు వచ్చేలా ఉన్నాయని ప్రభుత్వం కూడా అంచనాతో ఉంది. అయితే మూడు రోజుల పాటు రాష్ట్ర ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందాల విలువ రూ. 13 లక్షల కోట్లకు పైగా చేరడంతో అంచనాలను 100 శాతం చేరుకోవడంతో పాటు... అదనంగా మరో 30 శాతం మేర పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చేలా మార్గం సుగమం అయింది. ముఖ్యమంత్రి సమక్షంలోనే సగానికి పైగా పెట్టుబడులకు ఒప్పందాలుమూడు రోజుల పాటు జరిగిన ఒప్పందాల్లో మొత్తంగా రూ. 13,25,716 కోట్ల ఒప్పందాలు జరిగితే... అందులో సగానికి పైగా ఒప్పందాలను ముఖ్యమంత్రి సమక్షంలోనే జరిగాయి. మూడు రోజుల పాటు చంద్రబాబు సమక్షంలో కుదుర్చుకున్న ఒప్పందాల విలువ రూ.7,63,210 పెట్టుబడులు. 123 ఎంఓయూల ద్వారా ఈ పెట్టుబడులు వచ్చాయి. మూడు రోజుల పాటు జరిగిన ఎంఓయూల మేళాలో తొలి రోజున రూ. 3,65,304 కోట్ల మేర పెట్టుబడులకు ఒప్పందాలు జరిగాయి. రెండో రోజున రూ. 3,49,476 కోట్లు.

# గ్రీన్ ఎనర్జీ, సైబర్ సెక్యూరిటీ రంగాల్లో సహకారం అందించండి

### స్వదేశీ సైబర్‌సెక్యూరిటీ నిపుణులను మేమే తయారు చేస్తాం

### వరల్డ్ ఎకనమిక్ ఫోరం ఎండి జెరేమి జుర్గెన్స్‌తో మంత్రి లోకేష్ భేటీ




**విశాఖపట్టణం, నవంబర్ 15, ప్రభాతవార్త** :వరల్డ్ ఎకనమిక్ ఫోరం సెంటర్ ఫర్ ఫ్రాంటియర్ టెక్నాలజీస్ మేనేజింగ్ డైరక్టర్ జెరెమీ జుర్గెన్స్ తో రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... 2070 నాటికి భారత్ నెట్‌జీరో ఉద్గారాలు సాధించేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తోంది. 2040 నాటికి దేశంలో విద్యుత్ అవసరం రెట్టింపు అవుతుంది. ఈ నేపథ్యంలో బలమైన గ్రీన్ ఎనర్జీ వ్యవస్థను నిర్మించడం అత్యవసరం. ఆంధ్రప్రదేశ్ లో మేము మార్పుకోసం ఎదురుచూడటం లేదు. మార్పును తెచ్చే క్రమంలో మేం ముందు వరుసలో ఉన్నాః మా రాష్ట్రాన్ని ప్రపంచ గ్రీన్ ఎనర్జీ హబ్‌గా మార్చేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నాం. పునరుత్పాదక ఇంధన రంగంలో !!115 బిలియన్ల పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం. భారతదేశ గ్రీన్ హైడ్రోజన్ లక్ష్యంలో 30!! ఆంధ్రప్రదేశ్ లోనే సాధించాలన్నది మా ధ్యేయం. ఇవి కేవలం గణాంకాలు మాత్రమే కాదు. విద్యుత్ భద్రత, ఆర్థిక పోటీ, పర్యావరణ సంరక్షణకు మేం చిత్తశుద్ధితో కృషిచేస్తున్నాం. మా లక్ష్యసాధనకు మీ వంతు సహకారం అందించండి. ఈరోజు ప్రపంచం పరస్పరం అనుసంధానమైన నేపథ్యంలో సైబర్‌సెక్యూరిటీ జాతీయ భద్రతలో కీలకం. అక్టోబర్ 2023 నుండి సెప్టెంబర్ 2024 వరకు, భారతదేశంలో 369 మిలియన్లకి పైగా సైబర్‌సెక్యూరిటీ ఘటనలు గుర్తించారు. ప్రపంచవ్యాప్తంగా 2033 నాటికి సైబర్‌దాడులు సుమారు !!1 ట్రిలియన్ నష్టాలను కలిగించనుందని అంచనా. ఇవి చాలా ఆందోళనకరమైన అంశం. ఇవి కీలకమైన మౌలిక సదుపాయాలకు అడ్డంకులు సృష్టించి, ఆర్థిక అభివృద్ధి ప్రతిబంధకంగా మారతాయి. ఆంధ్రప్రదేశ్ ఐటి హబ్ గా అభివృద్ధి చెందుతోంది. మా రాష్ట్రంలో పరిశ్రమలు, రవాణా, విద్యుత్ రంగాలు వేగంగా అభివృద్ధి సాధిస్తున్నాయి. ఈ ప్రయాణం సజావుగా సాగాలంటే బలమైన సైబర్ సెక్యూరిటీ అవసరం. ఇదే సమయంలో, మాకు ఒక అనుకూల అంశం కూడా ఉంది. మా విద్యార్థుల 70!! ఠీగినిలీ కార్యక్రమాల్లో చేరారు. ఇది స్వదేశీ సైబర్‌సెక్యూరిటీ నిపుణులను తయారు చేసుకునేందుకు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న 40 లక్షల ప్రొఫెషనల్ సైబర్ నిపుణుల లోటును తీర్చే అవకాశం మాకు ఉంది. చమురు సహజ వాయువు, విద్యుత్, సప్లయ్ చెయిన్ వంటి కీలక రంగాల్లో సైబర్ సెక్యూరిటీ మూల్యాంకన నమూనాలను అమలు చేయడంలో సహకారాన్ని అందించండి.

### ఎల్జీ కెమ్ చీఫ్ సస్టైనబిలిటీ స్ట్రాటజీ ఆఫీసర్ యున్జోకోతో సిఎం చంద్రబాబు భేటీ


**విజయవాడ,నవంబరు 15,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలోని కాకినాడ, మూలపేటల్లో నాఫ్తా క్రాకర్ కాంప్లెక్స్, పాలిమర్స్ మాన్యుఫాక్చరింగ్ యూనిట్ నెలకొల్పేందుకు ముందుకు రావాలని ఎల్జీ కెమ్ సంస్థకు సీఎం ప్రతిపాదన జేఎస్ డబ్ల్యూతో కలిసి ఎల్జీ కెమ్ ఏర్పాటు చేయదలిచిన కాథోడ్ యాక్టివ్ మెటీరియల్ తయారీ యూనిట్‌కు పూర్తి సహకారం అందిస్తామన్న ముఖ్యమంత్రి ఏపీ సర్క్యులర్ ఎకానమీ పాలసీలో భాగంగా ప్లాస్టిక్ రీసైక్లింగ్ యూనిట్లను ఏర్పాటు చేసేందుకు వీలుందని సూచించిన సీఎం డేటా సెంటర్, ఏఐ, క్వాంటమ్.. రంగాల్లో ఏపీ ముందుకెళ్తోందని, ఏఐ యూనివర్సిటీ ఏర్పాటులో భాగస్వామి కావాలని కోరిన సీఎం.

# పరకామణి కేసు రాజీలో అసలు 'దోషు' లెవరు?

### - పూర్వ ఎవిఎస్‌ఓ హత్యతో తేలని దర్యాప్తు సందిగ్ధత



**తిరుమల,నవంబర్ 15ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి భక్తులు సమర్పించిన కానుకల లెక్కింపు పరకామణి భవనంలో చోరీ కేసును అనుకూలంగా మలచుకుని రాజీచేసిన ఉదంతంలో ఫిర్యాది, పూర్వ ఏవిఎస్ఓ వై.సతీశ్‌కుమార్ హత్యతో కర్త, కర్మ, క్రియ ఎవరనేది తేల్చడంలో సిఐడి అధికారులు తలలుపట్టుకునే పరిస్థితి ఎదురైంది. ఈ కేసు దాదాపు ఓ కొలిక్కి వచ్చి అసలు దోషులెవరనేది తేల్చేందుకు సిద్ధమవుతున్న సమయంలో ఉన్నఫళంగా శుక్రవారం వేకువజామున అనంతపురంజిల్లాతాడిపత్రి సమీపంలో రైల్వేట్రాక్‌పై మృతదేహంగా తేలడం పెద్ద సంచలనం కలిగిస్తోంది. ఇంతటి దారుణానికి ఎవరు ఒడిగట్టారు, పరకామణి కేసులో రాజీచేసుకునేలా ఒత్తిడి చేసిన వారెవరు, నిందితుడు రవికుమార్‌నుండి లబ్ధిపొందిన వారెవరనేది తేల్చడంలో సతీశ్‌కుమార్ వాంగ్మూలం కీలకమనేది సిఐడి డిజి రవిశంకర్‌అయ్యన్నార్, ఇతర అధికారులు భావించారు. ఇప్పుడు అసలు కీలక వ్యక్తి, పూర్వ ఏవిఎస్ఓ హత్యతో దర్యాప్తు ఎలా సాగనుందనేది ఆసక్తికరంగా మారింది. టిటిడి వర్గాలు కూడా ఒకింత అనుమానం వ్యక్తంచేస్తున్నారు. 2023 ఏప్రిల్‌లో పరకామణి నుండి విదేశీ కరెన్సీని రవికుమార్ చేతివాటం చూపి చోరీచేశాడనడంలో కీలక వ్యక్తి, సాక్షి పూర్వ ఏవిఎస్ఓ సతీశ్‌కుమారే. ఆయన ఫిర్యాదుపై నమోదైన కేసును 2023 మేనెల 30న ఛార్జిషీట్ దాఖలు చేయడం, సెప్టెంబర్ 9వతేదీ లోక్‌అదాలత్‌లో రాజీకుదుర్చుకోవడం వంటివి చకచకా జరిగిపోయాయి. ఈ ఉదంతంలో కీలకవ్యక్తిగా ఉన్న ఏవిఎస్ఓ పై ఒత్తిడి తీసుకువచ్చిందెవరనేది ఇప్పుడు తేలాల్సిన మొదటి ప్రశ్న. ఆయనపై అధికారి సివిఎస్ఓగా పనిచేసిన నరసింహకిశోర్ ప్రోద్భలం చేశారనేది వైసిపి నేతలు చెబుతున్న ప్రధాన ఆరోపణలు. అయితే ఇంకా అసలు దోషులెవరనేది తేల్చాలంటే సిఐడి డిజి ,సిఐడి బృందం , గత విజిఒ, ఇద్దరు సిఐలు, ఓ ఎస్ఐ కీలకంగానే ఉన్నారు. గత టిటిడి బోర్డులో పెద్దలు, ఓ ఉన్నతాధికారి, ఓ పోలీస్ అధికారి కీలకంగా వ్యవహరించి వాటాలు పంచుకున్నారనేది బలమైన ఆరోపణలు కూడా. ఈకేసు వివరాలు సిఐడి ఐజి ద్వారా డిసెంబర్ 2కి హైకోర్టు ధర్మాసనంకు సీల్డుకవర్‌లో నివేదిక సమర్పించేందుకు వేగంగా విచారణ చేస్తున్న సమయంలో సతీశ్‌కుమార్ మరణంతో సిఐడి అధికారులు కలతచెందారు. చోరీకేసులో నిందితుడుగా ఉన్న రవికుమార్ హైకోర్టును ఆశ్రయించి తన ఆస్తుల విచారణపై నిలుపుదలచేయాలని పిటిషన్‌దాఖలు చేసిన సందర్భంలా దారుణం జరగడం కూడా అనేక అనుమానాలకుతావిస్తోంది.



సమావేశంలో మాట్లాడుతున్న అనుముల వంశీకృష్ణ

## రాజ్యసభ, ఎమ్మెల్సీ రిజర్వేషన్‌లు ఇవ్వాలి

### ఆదివాసీల సదస్సు డిమాండ్

**విజయవాడ, నవంబర్ 15, ప్రభాతవార్త** :ఎస్సీ, ఎస్టీ, బిసిలకు రాజ్యసభ, ఎమ్మెల్సీ పదవులలో రిజర్వేసన్లు అమలు చేయాలని, ఈ మేరకు కేంద్రప్రభుత్వం రాజ్యాంగ సవరణ చేయాలని ఆదివాసీ రాష్ట్ర సదస్సు కేంద్ర ప్రభుతానిన డిమాండ్ చేశారు. శనివారం విజయవాడలో బిరా ్సముండా 150వ జయంతి సందర్భంగా జరిగిన ఆదివాసీల రాష్ట్ర సదస్సు లో ఆదివాసీ మేథావుల ఫోరం రాష్ట్రాధ్యక్షుడు వంశీకృష్ణ అధ్యక్షత వహించి మట్లాడుతూ ఆదివాసీలకు నామినేటెడ్ పోస్టులివ్వడంలో తీవ్ర వివక్ష నెలకొందని, రాజకీయ పార్టీలన్నీ ఆదివాసీలను నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆరోపించారు. ఈ వివక్షను ఎదుర్కోవాలంటే రాజ్యసభ, ఎమ్మెల్సీ పదవుల్లో రిజర్వేషన్ కల్పించడం తప్పదన్నారు. ఈ రిజర్వేషన్ల చట ్టం కోసం పోరాటాలకు సిద్ధం కావాలని వరప్రసాద్ యాదవ్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ రాష్ట్రాధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు, ఎరుకుల హక్కుల పోరాట సంఘం అధ్యక్షుడు

# రూ.ఐదుకోట్లతో అదనంగా నెయ్యి నిల్వ ట్యాంకర్లు

### - రూ.2.24లక్షల కిలోల నెయ్యికి దాత సహకారం

**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి నిత్యనైవేద్యాలు ,లడ్డూప్రసాదాల తయారీకోసం అవసరమైన నెయ్యిని బూందీపోటులో నిల్వచేసుకునే దిశగా తిరుమల తిరుపతి దేవస్థానం చర్యలు తీసుకుంది. ఇందుకోసం దాత సహకారంలో ఐదుకోట్ల రూపాయలతో అదనంగా నాలుగు ట్యాంకర్లు ఏర్పాటుజరిగింది. ఈ నూతన నెయ్యిట్యాంకర్లు ఆలయానికి పక్కనే ఉన్న నెయ్యిట్యాంకర్లు సమీపంలోనే ఏర్పాటు చేశారు. రానున్న రోజుల్లో నెయ్యి సరఫరాకు టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లు సరఫరా చేసే నెయ్యిని ఈ నూతన ట్యాంకర్లలో నిల్వచేసేలా చూడనున్నారు. ఇప్పటికే తిరుమలలో ఆలయానికి పక్కనే బూందీపోటుకు అనుబంధంగా ఉన్న నెయ్యిట్యాంకర్లలో 85వేల లీటర్ల నిల్వచేసుకునే సామర్థ్యం ఉంది. గతంలో 24,500లీటర్ల నెయ్యి మాత్రమే నిల్వచేసుకునే సదుపాయం ఉండేది. అయితే ఇతరరాష్ట్రాల నుండి డెయిరీలు నెయ్యిసరఫరాలో జాప్యం జరుగుతుండటంతో వాటి సామర్థ్యాన్ని ఐదేళ్లక్రిందట పెంపుచేశారు. ప్రస్తుతం టిటిడి దాత సహకారంతో మరో నాలుగు నెయ్యి ట్యాంకర్లను ఏర్పాటుచేసింది. ఇందులో 2.24లక్షలు కిలోల నెయ్యినిల్వకు అవకాశం కలుగుతుంది. ప్రస్తుతం తిరుమలలో నాలుగులక్షల వరకు లడ్డూలు రోజువారీగా తయారుచేస్తున్నారు. ఇందుకు రోజుకు 500లీటర్లపైగా నెయ్యి వినియోగిస్తున్నారు. లడ్డూల తయారీలో నెయ్యి కీలకం కావున నెయ్యినిల్వలను పెంచుకునేందుకు టిటిడిఅధికారులు శ్రద్ద చూపారు. ఎన్.( శీనివాసన్ విరాళంగా అందించిన ఐదుకోట్ల రూపాయలతో పనులు చేపట్టారు.

## ఆంధ్రప్రదేశ్ బాలల సంఘం రాష్ట్ర అధ్యక్షుడుగా పరుచూరి లోహిత్

### ప్రధాన కార్యదర్శిగా మన్నవ రిషిత్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా తన్నీరు రెహాన్ ఎన్నిక

**విజయవాడ,నవంబరు 15,ప్రభాతవార్తప్రతినిధి:** అఖిల భారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ అనుబంధ సంఘం ఆంధ్రప్రదేశ్ బాలల సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా పరుచూరి లోహిత్ (ఎన్టీఆర్ జిల్లా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మన్నవ రిషిత్ (ఈ ఏలూరు జిల్లా) ఆర్గనైజింగ్ కార్యదర్శిగా తన్నీరు రెయిన్ (బాపట్ల జిల్లా) గౌరవాధ్యక్షులుగా మందగల సాయికుమార్ ఎన్నిక. విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర బాలల సమ్మేళనం కార్యక్రమంలో విజయవాడ ఎన్టీఆర్ జిల్లాకు చెందిన పరుచూరి లోహిత్ అధ్యక్షులుగా ఏలూరు జిల్లాకు చెందిన మన్నవ రిషిత్ ప్రధాన కార్యదర్శిగా బాపట్ల జిల్లాకు చెందిన తన్నీరు రెయిన్ ఆర్గనైజేషన్ కార్యదర్శిగా మంద గళ్ళ సాయికుమార్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులుగా లంకా గోవిందరాజులు రాష్ట్ర కోఆర్డినేటర్గా ఎన్నికైనట్లు అఖిల భారతీయ యువజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరుచూరి రాజేంద్ర బాబు తెలిపారు. ఉపాధ్యక్షులుగా బాణాల జాహ్నవి విజయవాడ, జల్లిక భగత్ గుంటూరు లాస్య శ్రీకాకుళం, మనోహర్ నెల్లూరు సహాయ కార్యదర్శులుగా పి చైత్ర ప్రియ రాజమండ్రి అప్ప రాజు శ్రీరామ్ పల్నాడు కోశాధికారిగా షణ్ముఖప్రియ.

# 'కల్తీ' నెయ్యి కేసులో గత 'పోటు' తప్పిదాలు

**తిరుమల, నవంబర్ 15ప్రభాతవార్తప్రతినిధి:** అసంఖ్యాక మంది భక్తులు గడచిన ఐదేళ్ళలో కొన్ని వందలసార్లు తిరుమల లడ్డూ నాణ్యత లేదని, రుచితగ్గిందని చేసిన ఫిర్యాదులు అప్పట్లో దుమారం రేపాయి. లడ్డూలు గట్టిగా ఉన్నాయని, పంచిపెట్టేందుకు చూసినా తునగడం లేదని కూడా ఆరోపణలు వెల్లువెత్తాయి. ప్రతినెలా శుక్రవారం జరిగే "డయల్ యువర్ ఇఒ"కార్యక్రమంలోనూ దేశవ్యాప్తంగా ఉన్న శ్రీవారి భక్తులు లడ్డూనాణ్యతపై పెదవిరిచారు. లడ్డూల నాణ్యత పెంచాలని, నెయ్యి వాసన లేకపోయిందని, పంచదార ,కలకండ పలుకులు తప్ప కుంకుమపువ్వు, జీడిపప్పు, ఎండుద్రాక్ష, పచ్చకర్పూరం మిశ్రమం అస్సలు కనిపించడం లేదని ఫిర్యాదు చేసిన సందర్భాలు కోకొల్లలు. దీనిపై అప్పట్లోనే టిటిడి అధికారులు ఆ సమయానికి ఏదో ఒక సమాధానం చెప్పి చేతులు దులుపేసుకున్నారు. అప్పుడే లడ్డూపై వస్తున్న ఫిర్యాదులు, ఆరోపణల నేపథ్యంలో ఏకంగా టిటిడి ఉన్నతాధికారులు పట్టుబట్టి ఆలయ డిప్యూటీ ఇఒ సమక్షంలో పోటు అధికారితో కలసి వైష్ణవబ్రాహ్మణులతో వైభవోత్సవ మండపంలో మీడియాకు వివరణతో కూడిన తప్పులు వెల్లడించారు. లడ్డూనాణ్యతపై "2023 డిసెంబర్ 9వతేదీ" తిరుమలలో పోటులో పనిచేస్తున్న వైష్ణవ బ్రాహ్మణులుతో దిట్టంప్రకారమే లడ్డూలు తయారుచేస్తున్నామని, కొన్ని తరాలనుంచి పారంపర్యంగా స్వామివారి పోటులో సేవలందిస్తూ లడ్డూల తయారీ జరుగుతోందని పలికించారు. లక్షమందిపైగా భక్తులు వస్తున్నారని, అవసరమైన మేరకు రోజువారీగా 3.50లక్షల లడ్డూలు తయారుచేస్తున్నామని అప్పట్లో వెల్లడించారు. లడ్డూల తయారీలోరాజీలేని ధోరణితో పనిచేస్తున్నామని వైష్ణవ బ్రాహ్మణులు మనసులో మాట బలవంతంగా బయటపెట్టారు. గత అధికారులుకూడా లడ్డూ నాణ్యతపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారని ఆరోజు పలికారు. పోటులో వైష్ణవ బ్రాహ్మణులు కొన్ని తరాలుగా లడ్డూ తయారీలో నైపుణ్యం సాధించామని చెప్పడం కొసమెరుపు. లడ్డూ ప్రసాదం నాణ్యత తగ్గేప్రసక్తేలేదని వారిద్వారా స్పష్టం చేయించారు.

తొమ్మిదేళ్లుగా చాపకింద నీరులా వ్యాప్తిస్తున్న ఐసిస్ ఉగ్రవాదం పోలీసులను ఇబ్బంది పెడుతోంది. ఎక్కడో సిరియాలోస్థావరం కలిగి మధ్య ఆసియా దేశాలతో పాటు పలు యూరప్ దేశాలను, అమెరికానువణికించిన ఐసిస్ భారత్‌లో వేళ్లానుకుని దేశ వ్యాప్తంగా విస్తరించాలని చేస్తున్న ప్రయత్నాలు నిఘా వర్గాలను సైతం షాక్‌కు గురిచేయసాగాయి. ఈ సంస్థ కార్యకలాపాలపై జాతీయ దర్యాప్తు సంస్థ మొదటి నుంచి అనుమానం చెంది నిఘావుంచగా 2016లో వీరి కార్యకలాపాలపై పక్కా సమాచారం అందడంతో అదే ఏడాది ముగ్గురిని, అనంతరం మరో ఆరుగురిని అరెస్టు చేసింది. ఇందులో ఎనిమిది మందికి జైలు శిక్షలుపడ్డాయి. హైదరాబాద్‌తో పాటు కేరళనుంచి పలువురు యువతీ, యువకులు ఐసిస్‌లో చేరేందుకు సిరాయాకు వెళ్లగా ఇందులో కొందరు అక్కడి యుద్ధంలో చనిపోగా ఇంకొందరు వెనక్కు వచ్చారు. యుపి, మధ్యప్రదేశ్‌లలోనూ ఐసిస్ పలుఉగ్రదాడులకు పాల్పడింది. ఇక తాజావిషయానికి వస్తేభారత్‌లో ఐఎస్ఐ ఉగ్రవాదులతోపాటు ఐసిస్ తొలిసారిగాకలిసి ఉగ్రదాడులకు పాల్పడడం పోలీసులను కలవర పరిచింది. వారంరోజులక్రితం గుజరాత్‌లో నలుగురు ఐసిస్‌టెర్రరిస్టులు అరెస్టవగా ఇందులో హైదరాబాద్‌కు చెందిన ఒక వైద్యుడు వున్నాడు. దీని తరువాత కొన్నిగంటల వ్యవధిలో జమ్మూకాశ్మీర్, హరియాణా, ఢిల్లీలో తొమ్మిదిమంది ఐఎస్ఐ ఉగ్రవాదులు అరెస్టయ్యారు. వీరివద్ద నుంచిభారీగాఆయుధాలు, పేలుడు పదార్థాలు లభ్యమయ్యాయి. అరెస్టయిన వారిలో ముగ్గురు వైద్యులుండగా ఒక మహిళా వైద్యురాలుకూడా వుంది. వీరినివిచారిస్తున్న తరుణంలో ఢిల్లీలోని ఎర్ర కోటవద్ద కారు బాంబు పేలుడుజరిగింది. ఇది ఆత్మాహుతి దాడిగా నిర్ధారించారు. ఘటనలతో ఐసిస్, ఐఎస్ఐలు భారత్‌లో ఉగ్రదాడులకు కలిసిపని చేయాలని భావిస్తున్నట్లు నిఘావర్గాలు అనుమానిస్తున్నాయి. మొత్తం మీద భారత్‌ను 33 ఏళ్లుగాఉగ్రవాద భూతంవెంటాడుతూనేవుంది.

# భారత్‌లో ఆగని ఉగ్రదాడులు..

**డి.మురళీధర్ అమర్‌నాథ్**

ప్రపంచ పటంలో ఓవైపు అగ్రగామిగా దూసుకుపోతున్న భారత్‌ను దశాబ్దాలుగా ఉగ్రభూతం వెంటాడుతూనే వుంది. ఒకప్పుడు ఢిల్లీ, ముంబాయి నగరాలలోనే ఉగ్రవాదుల దాడులు జరగగా ఇప్పుడు అన్ని మెట్రోనగరాలు వారి హిట్ లిస్టులో చేరాయి. నిన్నటి వరకు పాక్ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థలు భారత్‌ను టార్గెట్ చేయగా కొన్నేళ్లుగా ఐసిస్ కూడా ఈ జాబితాలో చేరింది. 1992 డిసెంబరులో యుపిలోని బాబ్రీ మసీదు విధ్వంసం తరువాత జంట నగరాలలో వెలుగు చూసిన ఉగ్రవాదం అనంతర కాలంలో పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థల నుంచి తాజాగా మధ్య ఆసియా దేశాలతో పాటు అమెరికా, యూరప్ దేశాలను హడలెత్తించిన ఐసిస్ రాకతో అనేక రూపాలు సంతరించుకుని 33ఏళ్ల కాలంలో అనేక విధ్వంసాలకు నిలయంగా మారింది. ఈ క్రమంలోనే మూడు ఆత్మాహుతి దాడులతో పాటు పదుల సంఖ్యలో బాంబు పేలుళ్ల ఘటనలు జరగగా ఆత్మాహుతికి పాల్పడ్డ ఉగ్రవాదులతో కలిపి అమాయకులు, పోలీసులు వెయ్యిమంది వరకు చనిపోయారు. ఇదే సందర్భాలలో రాజకీయ నాయకులు కూడా హత్యకు గురయ్యారు. ఒకప్పుడు కేవలం కొన్ని నగరాలలోనే ఉగ్రవాద కార్యకలాపాలు వుండగా ఇప్పుడు గ్రామీణ ప్రాంతాలలోనూ విస్తరించడం గమనార్హం. ఉగ్ర సంస్థలకు సిమి, పిఎఫ్ఐ వంటి మరికొన్ని ఛాందసవాద సంస్థలు సహకరిస్తుండడం విశేషం. ఈ నేపథ్యంలో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) తరహాలో దేశ వ్యాప్తంగా ఉగ్రవాద కదలికలను శాశ్వతంగా అణచి వేసేందుకు ప్రత్యేక విభాగం వుండాలని నిపుణులు కోరుతున్నారు. భారత్‌లో ఉగ్రవాద దాడుల వెనుక పాక్ హస్తం వుందనేది బహిరంగ రహస్యమే. ఒకప్పుడు బ్రిటీష్ వలసవాద రాజ్యంగా వున్న అఖండ భారత్ 1947లో భారత్, పాకిస్థాన్‌గా అవతరించగా ఇండియా ప్రజాస్వామ్య దేశంగా వర్థిలి ఆర్థికంగా ఎదిగింది. పాక్ మాత్రం మిలటరీ కబందహస్తంలో నలిగి, అవినీతికి కేరాఫ్‌గా మారి ఆర్థికంగా చితికి పోయింది. ఇదే సమయంలో 1972లో తూర్పు పాకిస్థాన్‌గా వున్న బంగ్లాదేశ్ స్వతంత్ర దేశంగా అవతరించేందుకు భారత్ చేసిన సహాయం తరువాత పాక్ భారత్‌పై శతృత్వం పెంచుకుంది. దీని తరువాత భారత్‌లో ఉగ్రదాడులతోపాటు నకిలీ నోట్ల చలామణికి పూనుకుంది. భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చిన సమయంలో జమ్మూ కాశ్మీర్, రాజస్థాన్‌లోని జునాఘడ్, హైదరాబాద్ సంస్థానాలకు కావాలని డిమాండ్ చేసి విఫలమైన పాక్ ఆ తరువాత బంగ్లాదేశ్ కూడా కోల్పోవడంతో మరింత రగిలిపోసాగింది. దీని తరువాత అవకాశం వచ్చిన ప్రతీసారి భారత్‌లో ఉగ్రదాడులకు



పాక్ ప్రయత్నాలు చేస్తూనే వుంది. ఇందుకోసం పాక్ గూఢచార సంస్థ ఐఎస్ఐ లష్కర్ ఏతోయిబా, జైష్ ఏ మహమద్ సహా పలు ఉగ్రవాద సంస్థలను ఏర్పాటు చేసింది. ఇందులో వందల సంఖ్యలో జీహాదీలను చేర్పించి వారిని వీలు చూసుకుని భారత్‌లో పంపుతోంది. 1992 డిసెంబరులో బాబ్రీ మసీదు విధ్వంసానికి ముందు భారత్‌లో పెద్దగా ఉగ్రవాద కార్యకలాపాలు లేవని చెప్పాలి. ఒకటి అరా వున్నా ఇవన్నీ జమ్మూకాశ్మీర్‌కే పరిమితం అయ్యేవి. అయితే 1992 తరువాత ముంబాయి, ఢిల్లీ, బెంగళూరు, చెన్నై. పూణె సహా అనేక నగరాలలో ఉగ్రదాడులు జరిగాయి. ముంబాయిలో అయితే అనేకసార్లు ఉగ్రవాదులు విధ్వంసానికి పాల్పడ్డారు. హైదరాబాద్ వరకు వస్తే 1992లో మొదట అబిడ్స్, హుమాయూన్ నగర్ పోలీస్ స్టేషన్‌పై బాంబు దాడులు జరగగా ఆ తరువాత బిజెపి నాయకులు వరుసగా హత్యకు గురయ్యారు. ఈ హత్యలకు కారకులైన ఉగ్రవాదులు తిరుమల్‌గిరిలోపోలీసు ఎన్‌కౌంటర్‌లో హతమయ్యారు. హైదరాబాద్‌తో పాటు బెంగళూరు, చెన్నై, కోయంబత్తూరు, ముంబాయి. ఢిల్లీ, పూణె నగరాలలో ఆ తరువాత ఉగ్రవాద కార్యకలాపాలు మరింత పెరిగాయి. ప్రతియేటా డిసెంబర్ ఆరవ తేదీన జరిగే బ్లాక్ డే హైదరాబాద్‌లోని పాతబస్తీతో పాటు ముంబాయి నగరాలలో పదేళ్లకుపైగా హింసకు దారితీసి ఏటా చాలామంది అమాయకులు బలవడం వరకు వెళ్లింది. ఈ క్రమంలోనే భారత్‌లో పాకిస్థాన్ ప్రేరేపిత జమ్మూకాశ్మీర్ లెబరేషన్ ఫ్రంట్ (జెకెఎల్ఎఫ్) ద్వారా మొదట ఉగ్రవాద కార్యకలాపాలకు బీజం పడింది. అప్పట్లో ఢిల్లీ, ముంబాయి. హైదరాబాద్‌లో జెకెఎల్ఎఫ్ బలంగా వుండింది. ఈ క్రమంలోనే జెకెఎల్ఎఫ్ సంస్థ ఉగ్రవాదులను పట్టుకునేందుకు టోలిచౌకిలోని బృందావన్ నగర్‌కు వెళ్లిన అప్పటి ఇంటెలిజెన్స్ అదనపు ఎస్పీ కృష్ణ ప్రసాద్‌తోపాటు గన్‌మెన్ వెంకటేశ్వరరావు ఉగ్రవాదుల కాల్పుల్లో చనిపోయారు. ఈ ఘటన అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలనం రేపింది. దీని తరువాత జరిగిన పోలీసు ఎన్‌కౌంటర్‌లో పోలీసు అధికారి, ఆయన గన్‌మెన్‌ను కాల్చి చంపిన లాయక్ అహ్మద్ అనే ఉగ్రవాది హతమయ్యాడు. అనంతరం మరో ఉగ్రవాది ముజీబ్ అహ్మద్‌ను అరెస్టు చేసి అతనికి జీవితఖైదు పడేలా చేయడంలో పోలీసులు విజయం సాధించారు. దీని తరువాత లష్కర్ ఏ తోయిబా, జైష్ ఏ మహమ్మద్, హర్కతుల్ అన్సార్ వంటి పలు సంస్థలు భారత్‌ను టార్గెట్ చేశాయి. అయితే వీటి కార్యకలాపాలను భద్రతా బలగాలు సమర్థవంతంగా ఎదుర్కొంటున్నా కొన్నిసార్లు ఉగ్రమూకలది పై చేయిగా వుంటోంది. 1993లో ముంబాయి రైల్లో జరిగిన బాంబు పేలుళ్లు, 2010లో ముంబాయి తాజ్ హోటల్‌లో జరిగిన ఉగ్రవాదుల భీతావహ దాడులు, ఢిల్లీ, ముంబాయి, పూణె, చెన్నై, కోయంబత్తూరులో జరిగిన వరుస బాంబు పేలుళ్లు ఆయా నగరాలను వణికించాయి. 2019లో జమ్మూ కాశ్మీర్‌లోని పుల్వామలో సిఆర్‌పిఎఫ్ సిబ్బంది వెళుతున్నబస్సుపై జరిగిన ఆత్మాహుతి దాడి అదిపెద్ద దాడిగా చెప్పాలి. ఈ దాడిలో 44మంది పోలీసులు బలయ్యారు. భారత్‌లో జరిగిన రెండవ ఆత్మాహుతి దాడి ఇది. అంతకు ముందు 2006లో హైదరాబాద్‌లో జరిగింది. ఇక హైదరాబాద్ వరకు వస్తేఇక్కడ కూడా పలు ఉగ్రదాడులు జరిగాయి. పలువురు నాయకులు, పోలీసు అధికారులు హత్యకు గురయ్యారు. పలుమార్లుబాంబు దాడులు, ఒక ఆత్మాహుతి దాడులు జరిగాయి. లష్కర్ ఏ తోయిబా, హుజీతో పాటు మరికొన్ని ఉగ్రవాద సంస్థలు హైదరాబాద్‌ను అనేకమార్లు టార్గెట్ చేయగా ఈ సంస్థల కుట్రలను పోలీసులు నిర్వీర్యం చేశారు. ఇదే సమయంలో పాక్ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థలు నగరంలో ఐదు చోట్ల బాంబు పేలుళ్లకు పాల్పడి వంద మంది వరకు బలిగొన్నారు. ఇందులో 2006లో బేగంపేట్‌లోని అప్పటి టాస్క్‌ఫోర్స్ కార్యాలయంపై బంగ్లాదేశ్‌కు చెందిన దాలిన్ అనే ఉగ్రవాదితో పాక్ ఉగ్రవాద సంస్థలు ఆత్మాహుతిదాడి చేయించగా సత్య నారాయణ అనే హోంగార్డుతో పాటు ఉగ్రవాది దాలిన్ కూడా చనిపోయాడు. ఇక ఇదంతా ఒక ఎత్తుకాగా 2007 మే నెలలో మక్కా మసీదులో జరిగిన బాంబు పేలుడులో ఏడుగురు, అనంతరం చెలరేగిన అల్లర్లలో పోలీసు కాల్పులకు మరో 11 మంది మరణించడం దేశ వ్యాప్తంగా కలకలం రేపింది. దీని తరువాత అదే ఏడాది ఆగస్టు నెలలో లుంబినీ పార్క్, గోకుల్ ఛాట్‌లో జరిగినజంట పేలుళ్లలో 42మంది బలికాగా వంద మందికి పైగా క్షతగ్రాతులయ్యారు. మక్కా మసీదు బాంబు పేలుడు, పోలీసు కాల్పులకు ప్రతీకారంగానే ఈ జంట పేలుళ్లకు పాల్పడినట్లు పాక్ ప్రేరేపిత ఇండియన్ ముజహిదీన్ సంస్థ ఉగ్రవాదులు లేఖ వదలడం సంచలనం రేపింది. ఇదే సమయంలో మలక్‌పేట్ లో పేలకుండా వున్న మరో బాంబును పోలీసులు నిర్వీర్యం చేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ కుట్రకు కారకుడైన కర్నాటకు చెందిన రియాజ్ భత్కల్ పాకిస్తాన్‌కు పారిపోగా మిగతా వారిలో పది మంది పట్టుబడ్డారు. దీని తరువాత 2013 ఫిబ్రవరి 21వ తేదీన దిల్‌సుక్‌నగర్‌లో సంభవించిన జంట బాంబు పేలుళ్ల మరోసారి దేశ వ్యాప్తంగా కలకలం రేపాయి. ఈ జంట పేలుళ్లలో 18 మంది మరణించగా 150 మందికి పైగా గాయపడ్డారు. ఈ ఘటనకు కూడా ఇండియన్ ముజహిదీన్ సంస్థ కారణంగా తేలింది. ఈ కేసులో కూడా కొందరు పట్టుబడగా మరికొందరు పరారీలు వున్నారు. ●

# కనువిప్పు లేదా?

రాష్ట్రం

బీహార్

**ఎ.వి.వి ప్రసాద్**

జడివాన వెలిసిన తర్వాతే విరిగిన చెట్లు, ఒరిగిన ఇళ్ల లెక్క తెలుస్తుంది. బీహార్‌లో తాజాగా జరిగిన ఎన్నికలు, వాటి ఫలితాలను పరిశీలిస్తే.. ఎంతో ఎత్తుకు ఎదగాలనుకొని చివరికి కదలలేని స్థితిలో కూలబడిన పార్టీగాకాంగ్రెస్ కనిపిస్తుంది. మహాగఠ్‌బంధన్ ( విపక్ష కూటమి)లో ఆర్జేడీ తర్వాత ప్రధాన పక్షంగా ఉన్న కాంగ్రెస్ అసెంబ్లీ ఫలితాల తర్వాత తిరిగి కోలుకోలేని పరిస్థితిలోకి వెళ్లిపోయినట్లుగాకనిపిస్తుంది. ఆ పార్టీ అగ్రనేత అయిన రాహుల్ గాంధీ ఈ ఎన్నికలను చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రచారం చేశారు. ఎన్నో ఓటముల తర్వాత కూటమిని అధికారంలోకి తేవడం ద్వారానైనా రాజకీయాల్లో తలెత్తుకోవాలని భావించారు. మహాగఠ్ బంధన్ అధికారంలోకి వస్తే కీలక భాగస్వామిగా చక్రం తిప్పాలనుకున్నారు. అయితే ఆయనవన్నీ అడియాశలేనని ఫలితాలు మరోసారి నిరూపించాయి. 243 సీట్లున్న అసెంబ్లీలో 61 స్థానాలకు పోటీ చేసినా దానిలో పదోవంతు అంటే ఆరు సీట్లనుమాత్రమే సాధించగలిగిందంటే గత వైభవాన్ని కాంగ్రెస్ పూర్తిగా కోల్పోయినట్లే భావించాలి. కనీసం గత ఎన్నికల్లో సాధించిన సీట్లనైనా నిలబెట్టుకొనలేక పోయిందంటే 'రాహుల్ ప్రభావం' ఎన్నికల్లో ఎంతగా క్షీణించిందో అర్థమవుతుంది. 2020లో జరిగిన ఎన్నికల్లో 19 సీట్లు గెలుచుకొని కనీసం తలెత్తుకు తిరిగిన కాంగ్రెస్ ఈసారి వాటి లో 13 సీట్లను కోల్పోయి అట్టడుగుకు చేరింది. మహాకూటమిలోని ప్రధాన పార్టీ ఆర్జేడీ కూడా ఈసారి 50సీట్లను కోల్పోయి 25 స్థానాల దగ్గర నిలబడింది. మొత్తం అన్ని స్థానాలకు పోటీ చేసినా, కూటమికి లభించిన సీట్లు 35 మాత్రమే కావడం చూస్తే అధికార ఎన్డీయే కూటమి ప్రభావం జనంపై ఎంత అధికంగాఉన్నదో అర్థమవుతుంది. ఎన్నికల ప్రచారంలో రాహుల్ అనుసరించిన తీరు మొదట్లో ఆశాజనకంగాకనిపించినా, రాను రాను సన్నగిల్లింది. చివరికి సొంత పార్టీ నేతలే ఆయనను విమర్శించే పరిస్థితిఏర్పడింది. రాహుల్ ప్రచారాంశంగా ఉన్న 'సర్' వ్యతిరేకత ఎటువంటి ప్రభావం చూపకపోవడం కూడా ఆలోచించవలసిన విషయం. సర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) పేరుతో ఎన్నికల సంఘం జరిపిన ఓటర్ల జాబితా ప్రత్యేక పరిశీలనలో దాదాపు 60లక్షల ఓట్లు తొలగించారనీ, దాని వల్లమొత్తం ప్రజాస్వామ్యమే తలకిందులయ్యే పరిస్థితి ఏర్పడిందనీ విమర్శిస్తూ రాహుల్ తన ప్రచారాన్ని ఉధృతంగానే సాగించారు. అయితే ఫలితాలు మాత్రం పూర్తిగా నిరాశనేమిగిల్చాయి. ఓటు అధికార యాత్ర, దానికి ముందు పాద యాత్ర చేసి 25నియోజక వర్గాలలోని 110 అసెంబ్లీ నియోజకవర్గాలను చుట్టి వచ్చినా చివరికి ఫలితం లేకపోయింది. రాహుల్ పాదయాత్ర సాగినమార్గంలోని ఏఒక్క నియోజక వర్గంకాంగ్రెస్‌కు విజయాన్ని చేకూర్చకపోవడం గమనించవలసిన అంశం. బిజెపి, ఎన్నికల కమిషన్‌పై రాహుల్ చేసిన 'ఓటు చోరీ' ఆరో పణఓటర్లపై ఎలాంటి ప్రభావం చూపలేదంటే దానిలో పసలేదనే అనుకోవాలి. రాహుల్ ఓటుచోరీ ఆరోపణ చేస్తే, ఆర్జేడీ నేత, ముఖ్యమంత్రి అభ్యర్థి అయిన తేజస్వియాదవ్ నితీశ్‌పై సీటు చోరీ ఆరోపణలు చేశారు. కానీ వాటివల్ల కూటమికి గానీ, ఆయా నేతలకు కానీ ఎలాంటి ప్రయోజనంచేకూరలేదనే తెలుస్తుంది. రాహుల్ పాదయాత్రలో కనిపించిన జనస్పందనతో ఈసారి కనీసం 100సీట్లు పైగా పోటీ చేయాలనీ, వాటిలో కనీసం 75సీట్లు సాధించాలనీ ప్రణాళిక వేసుకొన్నారు. అయితే ముఖ్యమంత్రి లేదా డిప్యూటీ సీఎం కుర్చీ అయినా ఎక్కాలని కలలు కన్నారు. కానీ ఆర్జేడీ చాలా సందర్భాల్లో అడ్డుపడుతూ వచ్చింది. కాంగ్రెస్‌ను కూటమిలో 'అనవసర భారం'గానే ఆర్జేడీ భావించినట్లు కనిపించింది. కూటమిలోని అనైక్యత వల్ల కాంగ్రెస్‌తో పాటు ఆర్జేడీకి కూడా తీవ్ర నష్టం వాటిల్లింది. చాలా నియోజకవర్గాల్లో స్నేహపూర్వక పోటీలు జరగడంతో ఆర్జేడీ, కాంగ్రెస్‌కు భారీ నష్టమే కలిగిందని చెప్పాలి. అటువంటి పోటీలు జరగడానికి తేజస్వి, రాహుల్ వైఖరులే ప్రధాన కారణం. రాహుల్ చేసిన 'ఓట్ చోర్'నినాదం కంటె, ప్రధాని మోడీ ఎన్డీయే తరఫున చేసిన 'జంగిల్ రాజ్' నినాదం ప్రభావమే ఓటర్లపై ఎక్కువ పని చేసినట్లు కనిపిస్తుంది. ఆర్జేడీ, కాంగ్రెస్ కూటమి అధికారంలోకి వస్తే ఒకప్పటి జంగిల్ రాజ్ మొదలవుతుందని బిజెపి నేతలు చేసిన ప్రచారం కూడా మహాకూటమి వైఫల్యాలపై ఎక్కువ ప్రభావం చూపింది. దేశవ్యాప్తంగా చర్చనీ యాంశంగా మారినా, బీహార్‌లోనే ఓటుచోరీ నినాదం ప్రభావం లేకపోవడాన్ని చూస్తేకాంగ్రెస్ బాణం ఎక్కడ గురి తప్పిందో అర్థమవుతుంది. కాంగ్రెస్‌కు గతంనుంచి సీమాంచల్, మిథిల, మగథ, తదితర ప్రాంతాల్లో నిజానికి ఆధిక్యత ఉంది. కానీ ఈ ఎన్నికల్లో అదికూడా కోల్పోవడం గమనించవలసిన మరో అంశం. సీట్ల ఎంపికలో కూడా కాంగ్రెస్ సరైన విధానం అనుసరించలేదనే అనిపిస్తుంది. తనకు బలం లేని నియోజక వర్గాలలో ఆర్జేడీ ఒత్తిడితో అభ్యర్థులను నిలపవలసి వచ్చిందనీ, అందువల్లే చాలా తక్కువ సీట్లు వచ్చాయనీ కాంగ్రెస్‌నేతలు తాజాగాచేస్తున్నమరో ఆరోపణలో కూడా పసలేదనే చెప్పాలి. కేవలం ముస్లిం, యాదవ ఓట్లనే కాంగ్రెస్‌కూడా నమ్ముకోవడం వ్యతిరేక ఫలితాలు రావడానికి మరో కారణం. ప్రభుత్వ వ్యతిరేకత కొంతఉన్నా, దానిని తమకు అనుకూలంగా మలచుకోవడంలో ఆర్జేడీ, కాంగ్రెస్ రెండూ విఫలమయ్యాయి. ఈఎన్నికలు ముఖ్యంగా కాంగ్రెస్‌కు మరోగుణపాఠమనే చెప్పాలి. దాదాపు రెండు దశాబ్దాలు బీహార్‌ను తన గుప్పెట్లో ఉంచుకున్న కాంగ్రెస్‌క్రమంగా పూర్తిగా జారవిడుస్తోంది. తిరిగి అధికారంలోకి రాకపోయినా, కనీసం అధికారపక్షానికి గట్టిపోటీ ఇచ్చే స్థితి నుంచి కూడా కాంగ్రెస్ జారిపోయింది. ఆత్మ పరిశీలన చేసుకొనకపోతే తదుపరి ఎన్నికలకు ఆ ఆరుసీట్లు కూడామిగలక పోవచ్చు. ఇప్పటికే అధికశాతం రాష్ట్రాలు 'హస్తం' బయటకు వచ్చాయి. ఈ ఫలితాలతోనైనా పార్టీ నేతలకు కనువిప్పు కలుగుతుందా? చూడాలి. ●



రాహుల్ గాంధీ

# ఇక సర్వశక్తిమంతుడు మునీర్

దేశం

పాకిస్థాన్

**గన్ని మోహన్**

ఓ పక్క ఆర్థికసంక్షోభం, మరోపక్క సరిహద్దుల నుంచి టిటిపి దాడులు సమస్యలు ముప్పేటదాడిచేస్తున్న దాయాది పాకిస్థాన్‌లో ఇప్పుడుమరో సమస్య వచ్చిపడింది. అదేంటంటే ఇక ఆదేశంలో ప్రజాస్వామ్యం దాదాపుగా కనుమరుగయినట్లే. ఇన్నాళ్లు కొంతవరకైనా ప్రజాస్వామ్యం ఉన్నట్లు కనిపించినా ఆర్మీయే మొత్తం తెరవెనుక నడిపించేంది. కొంతమంది ఆర్మీచీఫ్‌లు సైనిక తిరుగుబాటుతో పాలన కొనసాగించిన తర్వాత షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఆప్రభుత్వంపైనా సైనిక ఆధిపత్యం పెరిగేందుకు ఈ రాజ్యాంగ సవరణ దోహదం చేసింది. పాకిస్థాన్ చేపట్టిన 27వ రాజ్యాంగసవరణ చట్టంతో సైన్యం సర్వశక్తివంతమైనదిగా మారింది. సైన్యాధ్యక్షుడు ప్రభుత్వంపైనా పట్టుసాధించగలుగుతాడు. సర్వశక్తిమంతుడు. ఆయనే సర్వాధికారి, ప్రభుత్వం ఇక అన్నీ ఆయనే అని చెప్పుకోవచ్చు. నిజానికి 1947లో స్వాతంత్ర్యం వచ్చినప్పటినుంచి కూడా ఆదేశంలో సైన్యం ప్రభుత్వంపై పట్టుతోనే ఉందని చెప్పాలి. చివరిసారిగా పర్వేజ్‌ముషారఫ్ సైనిక తిరుగుబాటుతో ప్రభుత్వం పాలించాడు. ఆ తర్వాత మళ్లీ చీఫ్‌ఆఫ్ ఆర్మీస్టాఫ్‌గా ఉన్నఆసిమ్ మునీర్‌కుఇప్పుడు సర్వాధికారాలు లభించాయి. త్రివిధ దళాధిపతిగా మారాడు. మొత్తం పాక్ సైన్యం ఆయన పరిధిలో ఉంటుంది. జాతీయ వ్యూహాత్మక కమాండ్ కమాండర్ అనే కొత్తపోస్టు సృష్టించారు. ఈ పోస్టులో ఆర్మీచీఫ్ సిఫారసులతోనే ప్రధానినియమిస్తారు. ఈ కమాండర్ కూడా సైన్యం నుంచే ఉంటారు. అణుఅధికారం, ఇతర సైనిక నిర్ణయాలు ప్రజాప్రభుత్వం చేతిలో ఉండేవి. అధ్యక్షుడు సర్వసైన్యాధ్యక్షుడి హోదాతో ఉండేవారు. ఇకపై పాకిస్థాన్‌లో ఆ అధికారాలన్నీ కూడా ఆసిమ్ మునీర్‌కు బదలీ అవుతాయి. ఈ కొత్త చట్టంతో మునీర్ చట్టానికి అతీతుడుగా మారాడు. ఫైవ్ స్టార్ జనరల్స్ అధికారులు ఎలాంటి చట్టపరమైన చర్యలకు కూడా అతీతులుగా వ్యవహరిస్తారు. ఏకోర్టు కూడా ఆయన్ను విచారించి శిక్షించలేవు. పాక్ చరిత్రలో జనరల్ ఆయూబ్‌ఖాన్ తర్వాత రెండో ఫైవ్‌స్టార్ ర్యాంక్‌అధికారి ఆసిమ్‌మునీర్. జీవితాంతం యూనిఫామ్‌లోనే ఉంటారు. పార్లమెంటులో మూడింట రెండొంతుల మెజార్టీఉంటే తప్ప ఆయన్ను తొలగించే వీలుండదు. తమ ర్యాంక్ అధికారాలు జీవితాంతం కొనసాగించాలనుకున్నా కొనసాగించుకునే వెసులుబాటు కొత్త చట్టం ఆసిమ్‌మునీర్‌కు ఇచ్చింది. ఇకపై సాధారణ మెజార్టీతోకూడా మునీర్‌ను తొలగించేవీలులేని విధంగా రాజ్యాంగ సవరణ జరిగింది. రిటైర్‌మెంట్ తర్వాత కూడా అవసరమైతే ఆయన్ను ప్రధాని సలహాతో అధ్యక్షుడు కొనసాగించవచ్చు. అంటే సమీపభవిష్యత్తులో సైనిక పాలనకు అడుగులు వేసిన ఆశ్చర్యపోనవసరం లేదు. జియావుల్ హక్, పర్వేజ్ ముషారఫ్ ఇలా సైనికాధిపతులే పాక్‌లో పాలన సాగించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు తీసుకువచ్చిన ఈ చట్టసవరణ మెజార్టీ మద్దతుతో సాగిందా లేక మునీర్ నిర్బంధ ఒత్తిడితో జరిగిందా అన్నది తెలియాల్సి ఉంది. దేశాధ్యక్షుడు ఆసిఫ్ ఆలీజర్దారీ సంతకం చేసిన తర్వాత చట్టరూపంలోకివస్తే ఇక చీఫ్‌ఆఫ్ డిఫెన్స్‌స్టాఫ్‌గా మునీర్‌కు తిరుగుండదు. పాలన వ్యవహారాల్లో ఆయన జోక్యం మరింత మితిమీరుతుంది. ఆధునిక యుద్ధ తంత్రం అలవరుచుకునే దిశగాను, రక్షణరంగాన్ని మరింత బలోపేతం చేసేదిగాను ఈసవరణ ఉందనిపాక్‌ప్రధాని షెహబాజ్‌షరీఫ్ చెపుతున్నా గత్యంతరం లేకనే ఈ చట్టసవరణ చేయాల్సి వచ్చిందని ఆయన అంగీకరించలేని పరిస్థితిలో ఉన్నారన్నది నిజం. అంతేకాకుండా ఈ కొత్తసవరణతో సుప్రీం అధికారాలకు కత్తెరపడింది. కొత్తగా జాతీయ ఫెడరల్ రాజ్యాంగ కోర్టు (ఎఫ్‌సిసి) ఏర్పాటు చేస్తారు. ఎఫ్‌సిసి మొదటి చీఫ్‌జస్టిస్, ఇతర న్యాయమూర్తులు అధ్యక్షుడు నియమిస్తారు. అంతేకాకుండా ఇకపై సుప్రీంకోర్టు స్వతంత్ర ప్రతిపత్తిని కూడా కోల్పోతుంది. కేవలం సివిల్ క్రిమినల్ కేసులు విచారణకు మాత్రమే పరిమితం అవుతుంది. కొన్ని పరిధులకు లోబడి పనిచేసే విధానం అమలులోకి రానున్నదన్నది విమర్శకుల వాదన. 27వ రాజ్యాంగ సవరణ జరిగిన వెనువెంటనే సుప్రీం కోర్టులోని ఇద్దరు న్యాయమూర్తులు అథర్ మినల్లాహ్, మన్సూర్ ఆలీషాలు రాజీనామాచేసారు. 27వ రాజ్యాంగసవరణ పాక్ సుప్రీం కోర్టును ముక్కలుచేసిందని వారుఆందోళన వ్యక్తంచేసారు. మొత్తం 24మంది న్యాయమూర్తులున్న సుప్రీంలో ఇద్దరు రాజీనామాచేసినా మెజార్టీ న్యాయమూర్తులు ఈచట్టసవరణనుఅడ్డు కునే వీలుంది. అయితే అటు ప్రభుత్వం, ఇటు సైనిక ఒత్తిడితో అదికూడా పక్కకుపోయినా ఆశ్చర్యపోనవసరం లేదు. రాజ్యాంగపరమైన ప్రశ్నలున్న కేసులుఇకపై సుప్రీం విచారణసాధ్యంకాదని, ఆర్మీచీఫ్ అధికారాలను, పదవీకాలాన్ని పొడిగిస్తున్నదని న్యాయ వ్యవస్థలో విమర్శలు వెల్లువెత్తాయి. అంతేకాకుండా హైకోర్టుల్లోని న్యాయమూర్తులను బదలీ నిరాకరిస్తే నిర్బంధ రాజీనామా కోరే వెసులుబాటు కూడా ఈ చట్టం ఇస్తోంది. విపక్షంలో ప్రధానిగా ఇమ్రాన్‌ఖాన్ పార్టీపిటిఐ తీవ్రంగా వ్యతిరేకించింది. ఉభయసభల్లోకూడా వీరు ఈబిల్లును వ్యతిరేకించారు. మునీర్ వైఖరిని ముందునుంచే ఇమ్రాన్ దుయ్యబట్టిన సంగతి తెలిసిందే. ఆఒక్కపార్టీతప్ప ఇతర పార్టీలన్నీ కూడా బిల్లుకు మద్దతిచ్చాయి. చీఫ్‌ఆఫ్ డిఫెన్స్ ఫోర్సెస్‌గా వస్తున్న మునీర్‌కు ఇక సర్వసైన్యాధి కారాలు ఉంటాయి. ఎలాంటి న్యాయమైరమైన విచారణలను కూడా ఆయనపై ఉండవు. పాక్‌లో అంతర్గతంగా ఇప్పుడు కల్లోలం కొనసాగుతోంది. తమను స్వతంత్ర దేశంగా గుర్తించాలని బలూచి స్తాన్‌లో మిలిటెంట్ పోరాటం పాక్ ప్రభుత్వాన్ని సవాల్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఖైబర్‌ఫక్తూన్‌ఖ్వా, బలూచిస్తాన్‌లలో అంతఃయుద్ధం, ఆఫ్ఘనిస్థాన్‌తో కయ్యానికి కాలుదువ్వుతుండటంతో కొత్తపదవిలోకి వస్తున్న ఆసిమ్‌మునీర్ వైఖరిమరింత కఠినంగా మారనున్నది. అసలే కఠినాత్ముడని పేరున్న ఆసిమ్‌మునీర్ ఇకపైసర్వశక్తివంతుడుగా మారుతుండటంతో ఇక పాకిస్థాన్‌లోని ప్రజాస్వామ్య యుతంగా ఎన్నికైనప్రభుత్వాలకు నూకలు చెల్లినట్లేనని చెప్పకతప్పదు. ●



ఆసిమ్‌మునీర్

# యాంత్రికంగా మారుతున్న విద్యాబోధన

**శ్రీ శ్రీ కుమార్**

'విద్యా దదాతి వినయం. లెత: సుఖం' అంటూ నారాయణ పండితుడు చెప్పిన హితోపదేశం నేడు అరణ్యరోధన అయింది. విద్య వలన వినయం, దాని నుండి అర్హత, దాని ద్వారా ధర్మం, ధర్మం ద్వారా సుఖం కలుగుతాయి అన్నది ఆ శ్లోకం అర్థం. బడిలో మొదటి వినయానికి ఎక్కువ ప్రాధాన్యతనిస్తారు. వినయశీలుడే విద్యనార్జిస్తాడనేది ఉపాధ్యాయుల నమ్మకం. మొత్తం మీద విద్య నుండి చిట్టచివరకు సుఖం కలుగుతుంది. అంటే మనిషి సంతృప్తిగా జీవిస్తాడు. పాతకాలపు గురువులు నేర్పిన విద్యకు నేటి విద్యకు చాలా తేడాఉంది. నాడు వేదాలు సకల శాస్త్రసాంకేతిక యుగంలో వాటి వాడకాన్ని ప్రయోజనాన్నికాదనలేం. కానీ విచక్షణతో కూడిన వినియోగం అవసరమనేది నిర్వివాదాంశం. కరోనా కాలం నేర్పిన పాఠం మనం అప్పుడే మర్చిపోలేం. స్మార్ట్‌ఫోన్లు ఆన్లైన్ భోజనాలు విద్యార్థులను బడికి దూరం చేశాయి. అవి కలిగించిన చేటు చెప్పనలవి కాదు. అభ్యసన ప్రక్రియ వినడం మాట్లాడడం చదవడం ఇంకా రాయడం ద్వారా జరుగుతుంది. భాషేతర విషయాలలో నేర్చుకున్న దానిని ఉపయోగించడం ద్వారా బలపడుతుంది. ఈ నైపుణ్యాలు నేర్పడానికి మొదట మెట్టు గురువే. అతడి సాన్నిధ్యంలోనే విద్య నేర్పడం ఆరంభం అవుతుంది. అతడి మాటలు చేష్టలు హావభావాలు నడకనడత ప్రవర్తన అన్ని విద్యార్థి మనసుపై ముద్రవేస్తాయి. అందుకే విద్యార్థి బాల్యంలో తన గురువులని ఇంటి వద్ద అనుకరిస్తాడు. వారి మాట ఇతడికి వేదవాక్కు, శిరోధార్యం. తల్లిదండ్రుల మాటకు కూడా అతడు అంత విలువ గౌరవం ఇవ్వడు. అందుకే ప్రాథమిక సెకండరీ స్థాయి ఉపాధ్యాయుల ప్రభావం విద్యార్థులపై మెండుగా ఉంటుంది. వారు ఆదర్శంగా క్రమశిక్షణతో సమయపాలనతో నీతి నిజాయితీలతో వ్యవహరిస్తే అది విద్యార్థుల మనోఫలకంపై చిరస్థాయిగా నిలిచిపోతుంది. ఇలాంటి పనులేవి మనం చెప్పుకునే యంత్రాలు చేయలేవు. వాటిని నడిపించడానికి మరొక మనిషి కావాలి. వాటిలో పాఠాలు, ప్రయోగాలు అన్నీ శాస్త్రం తెలిసినవాడు, బోధించేవాడు, ఆ బోధన మెళకువలు తెలిసినవాడు, సాంకేతిక పరిజ్ఞానం ఉన్నవారు అవసరం. వీటన్నింటికంటే ముఖ్యంగా విద్యుత్ సరఫరా విద్యార్థులు అందరూ కూర్చొని చూసి విశాలమైన గదులు కూడా అంతే ముఖ్యం. ఇలాంటివన్నీ మనం ప్రభుత్వ బడులలో ప్రస్తుత భవనాలలో ఊహించగలమా? అయినా ప్రభుత్వం మాత్రం పొద్దున లేస్తే కంప్యూటర్, డిజిటల్ విద్య, స్మార్ట్ తరగతులు లాంటి పడిగట్టు పదాలతో సమాజాన్ని మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నది. క్షేత్రస్థాయి వాస్తవాలు తల్లిదండ్రులకు విద్యార్థులకు ఉపాధ్యాయులకు తెలుసు. సెకండరీ విద్యలో కనీసం ప్రయోగశాల లేని పాఠశాలలు వాటిలో విద్యార్థులు చూసి ఆ తర్వాత చేసి నేర్చుకుంటారు. గతంలో ఏనాడో సరఫరా చేసిన పరికరాలు తుప్పు పట్టి, లేక చెడిపోయి ఉంటాయి. రసాయనాలు వాటి కాలవ్యవధి దాటిపోయి ఉంటుంది. అసలు ప్రయోగశాల అవసరం లేదు. తరగతి గదిలో ఒక రాయి, చెట్టు, ఆకు, చెక్క ముక్క ఏదైనా ఉపయోగించి భాషలు నేర్పవచ్చు. లెక్కలు సైన్స్ సామాజిక శాస్త్రాలు అన్ని బోధించవచ్చు. అది ఉపాధ్యాయుడి స్థాయి అతడు చెప్పి పాఠాన్ని బట్టి ఆధారపడి ఉంటుంది. మన చుట్టూ ఉన్న వనరులను ఉపయోగించుకోకుండా అందని దానికై అర్రులు చాచడం మన పాలకులకు బాగా తెలుసు. ఎందుకంటే మనం పాశ్చాత్య దేశాలతో పోటీపడే జ్ఞానాన్ని అందిస్తున్నట్లు చూపించుకోవచ్చు. అందుకేనేమో విదేశస్తులు పెద్ద పెద్ద కంపెనీల సీఈఓలు సందర్శించినప్పుడు బాగా మౌలిక వసతులు అట్టహాసంగా ఉన్న పాఠశాలలకి మన అధికారులు తీసుకెళ్తారు. వాతావరణం మొత్తం యాంత్రికం లేదా కృత్రిమం చేస్తారు. యాంత్రిక బోధనపై ఎందుకింత మోజు? కంప్యూటర్ పాఠాలపై ఎందుకు ఇంత వల్లమాలిన ప్రేమ? గతంలో తెలుగు మీడియంలో చదువుకొని పెద్ద ఉద్యోగాలలో స్థిరపడినవారు జ్ఞానం సంపాదించలేదా? సాంకేతికత వినియోగంలో వారు ఎవరికీ తీసిపోని పరి



స్థితుల్లోనే ఉన్నారు. మరి వారు తమ చదువుకున్న కాలంలో ఈ పరికరాల గురించి కనీసం విన్నవారు కూడా కాదు. కొద్ది కాలపు శిక్షణ, నిరంతర వినియోగం వారిని నిష్ణాతులుగా చేస్తుంది. కానీ వారే చిన్నారులకు కృత్రిమ మేధస్సు లాంటి కోర్సులు మొదలు పెట్టడానికి ఉరకలు వేస్తున్నారు. మొదట ప్రాథమిక బోధనను బలోపేతం చేయడంముఖ్యం. తెలంగాణ రాష్ట్రంలో దాదాపు 20వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాటిని అర్హులైన విద్య ఉపాధ్యాయులతో నింపి బోధన సక్రమంగా జరిగేలా చూడాలి. బడులలో బయోమెట్రిక్ హాజరువల్ల ఒరిగేఫలితం శూన్యం. బోధన సజావుగా ప్రభావంతంగా జరగాలి. యంత్రాల బోధనకు విద్యార్థులు ఆసక్తిగా చూస్తుంటారు. చూసి నేర్చుకుంటారు కానీ చేసి నేర్చుకునేది. లేదు యంత్రాలకు మనసు ఉండదు. అది ఒక మూసలో పోసినట్లుగా నడిచే బోధనా ప్రక్రియ. తరగతి గదిని నియంత్రించలేవు. అజమాయిషీ చేయలేవు. విద్యార్థుల పాత్రచాలా కనిష్టంగా ఉంటుంది. నేర్చుకున్నది లేనిది యంత్రాలు ప్రశ్నించలేవు అందుకు మళ్లీ ఉపాధ్యాయుడే అవసరం అవుతాడు. ఈ యాంత్రిక బోధన వల్ల కొంతకాలానికి విద్యార్థికి అభ్యసన ప్రక్రియపై ఆసక్తి తగ్గిపోతుంది. అది ఒక రోటీన్ ప్రక్రియ లాగానే సాగుతుంది. కానీ అందులో భిన్నత్వం లేదా నూతనత్వం అంటే వెరైటీ ఉండదు. కొంతమందికి ఉపాధ్యాయుడుపాత్ర అవసరం పైన అనుమానం కలిగే పరిస్థితి ఏర్పడుతుంది, కంప్యూటర్ సాయంతో ఉపాధ్యాయుడు బోధిస్తే అది మిక్కిలి ప్రభావంతంగా ఉంటుంది. పరిమితి స్థాయిలో కంప్యూటర్లనైన స్మార్ట్‌పోన్లైన ఉపయోగించాలి. వాటిలోని, సమాచారానికి పరిమితం కాకూడదు. సందేహాలకు ప్రశ్నలకు అవి సమాధానం చెప్పలేవు. వినడం కన్నా చూసింది గొప్పదే. కానీ ప్రత్యక్షంగా చూసింది చేసింది ఎక్కువ ప్రభావాన్ని చూపుతాయి. అందుకే ఉపాధ్యాయులు కూడా తరగతి గదిలో వల్లే వేయించడం, రోల్ ప్లే, చిన్ననాటికల లాంటివి చేస్తే అవి విద్యార్థులకు శాశ్వతంగా గుర్తుండిపోతాయి. మనసుకు హత్తుకుంటాయి. తరగతి గదిలో జీవంఉండాలి. కనిపించే ప్రతి వస్తువును ఒక బోధనోపకరణంగాఉపయోగించగలగాలి. వాటి ద్వారా చిన్నచిన్న భావనలు విద్యార్థుల మెదడులో ఏర్పరచవచ్చు. పై తరగతులకు పోతుంటే వారే ఆ చిన్న భావనల నుండి పెద్ద భావనలను సూత్రాలను అన్వయించుకోగలుగుతారు. బోధన యాంత్రికమైనప్పుడు అభ్యసనం కూడా యాంత్రికమే అవుతుంది. ఆలోచన అవసరం లేని చోట తార్కికతకు తావు లేకుండా పోతుంది. పిల్లలకు స్వీయ అభ్యసనం కరోనా సమయంలో అలవాటయింది. దీనివల్ల వినడం చూడడమే తప్ప చదవడం రాయడం అలవాటు తప్పింది. టెక్స్ట్ పుస్తకాలు ఉపయోగించడం లేదు. జ్ఞాపకశక్తి క్రమంగా క్షీణించింది. ల్యాండ్ లైన్ ఫోన్లున్నప్పుడు ప్రతి మనిషికి కొన్ని ముఖ్యమైన ఫోన్ నెంబర్లు గుర్తుండేవి. తర్వాత కాలంలో ఫోన్లలో మెమరీ ఉండటంతో మనకు మెదడుతో పని తగ్గిపోయిన చందాన విద్యార్థుల అభ్యసనం కూడాతయారైంది. యూట్యూబ్‌లో డౌన్లోడ్ చేసుకొని అవసరమైనప్పుడు చూసుకుంటున్నారు. వాటిని మెదడులలోనికి డౌన్లోడ్ చేసుకోవడం లేదు. ఆరవ తరగతి నుండి ఐఐటి ఫౌండేషన్ క్లాసుల పేరిట స్పెషల్ కోచింగ్ ఆన్లైన్లో ఇస్తున్నారు. ఆ రకమైన అభ్యసనం విద్యార్థి ఉన్నత విద్య లేదా వృత్తివిద్య పూర్తయ్యేవరకు సాగుతూనే ఉంటుంది. ఇది ఎంతమాత్రమూ మంచిది కాదు. జ్ఞానసముపార్జన జరుగుతున్నది కానీ బౌద్ధిక వికాసం జరగడం లేదు. విద్యార్థికి మానసిక ఉల్లాసం కలిగే అవకాశాలు క్రమంగా క్షీణించాయి. మీ పాఠశాలలో ఐఐటి కోచింగ్ ఇస్తారా మెడిసిన్ కోసం స్పెషల్ తరగతులు నిర్వహిస్తారా అని తల్లిదండ్రులను చూస్తున్నామే కానీ మీ బడిలో సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలు ఉన్నాయా సంగీతం నృత్యం లాంటివి నేర్పుతారా అనే పేరెంట్స్ దురదృష్టవశాత్తు మృగ్యమైపోయారు. క్రీడలకు అవకాశం లేదు. అందుకే దేశంకూడా క్రీడల్లోచాలా వెనుకబడిపోయింది. ఇవన్నీ మనోవికాసానికి మార్గాలు. రెండు రోజులు పోతే వీటిని కూడా ఆన్లైన్లో లేదా డిజిటల్‌గాను నేర్చుకోవాలంటారేమో. అభ్యసనం పూర్తిగా కంప్యూటర్ల మీద లేక స్మార్ట్ ఫోన్ల మీదను ఆధారపడి జరగడం మంచిది కాదు. అవి నేర్చుకున్న వాటిని పునఃశ్చరణకు లేక మరింత దృఢపరచుకోవడానికి మాత్రమే ఉపయోగించుకోవడం శ్రేయస్కరం. విద్య లేదా అభ్యసనం యాంత్రికమైతే జీవితం కూడా యాంత్రికం అవుతుంది. శ్రమ, కష్టం విలువ తెలవకుండా పోతుంది. ●

# పోక్సో కేసులో నిందితుల అరెస్ట్

గుంటూరు క్రైమ్ ప్రభాతవార్త నవంబర్15: పోక్సో కేసులో నిందితుడికి సహకరించిన అమ్మ, అమ్మమ్మను అదుపులోకి తీసుకుని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు సౌత్ డీఎస్పీ భానోదయ తెలిపారు//డి.ఎస్పీ తెలిపిన వివరాలు ప్రకారం.... మైనర్ బాలికను మాయ మాటలు చెప్పి, నమ్మించి మోసం చేసి, ఆమెను తన వెంట నెల్లూరు కు తీసుకుని వెళ్లి ఆమెను వివాహం చేసుకుని తిరిగి ఆ బాలికను గుంటూరు లో వదిలి వెళ్లాడు.అంతకుముందు ఆ బాలిక స్కూల్ లో చదువుకుంటు



సాయంత్రం సమయానికి ఇంటికి చేరుకోలేదు.దీంతో వెంగలయపాలెంలో నివాసం ఉంటున్న బాలిక తల్లిదం డ్రులు తమ కూతురు కనిపించడంలేదని నల్లపాడు పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేశారు.డి.ఎస్పీ భానోదయ ఆధ్వర్యంలో నల్లపాడు సి.ఐ వంశీధర్ తన సిబ్బందితో దర్యాప్తు కొనసాగించారు.దర్యాప్తులో భాగంగా సి.సి కెమెరా ఫుటేజీని పరిశీలించగా ఆ బాలికను ఇరువురు వ్యక్తులు ఒక ద్విచక్రవాహనంపై బాలికను ఎక్కించుకుని వెళ్లినట్లు తెలిసింది. తీసుకుని వెళ్లిన వ్యక్తులు నెల్లూరు జిల్లా, విడవలూరు మండలం అన్నారెడ్డి పాలెం గ్రామానికి చెందిన గంగపతి అని తేలింది.దీంతో గంగపతి ని,వాళ్ళ అమ్మ,అమ్మమ్మని అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారని డి.ఎస్పీ తెలియజేశారు.

# రెక్టార్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన అతిథి అధ్యాపకులు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,నవంబరు15, ప్రభాతవార్త: ఏఎన్‌యులో వివిధ కళాశాలలో పనిచేస్తున్న అతిథి అధ్యాపకులు శనివారం ఇన్‌చార్జ్ రెక్టార్ ఆచార్య రామినేని శివరాం ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. రెక్టర్‌గా వర్సిటీ అభివృద్ధిలో తనవంతైలో పనిచేస్తున్నారని కొనియాడారు. స్థానిక విద్యార్థి స్థాయి నుంచి ఉన్నత పదవులు ఒకటిగా ఉన్న రెక్టార్ హోదాను



అధిరోహించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో అత్యున్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అలాగే తమకు వేతనాలు పెంచేందుకు సహకరించాలని కోరారు. అనంతరం రెక్టార్ శివరాం ప్రసాద్ మాట్లాడుతూ విభాగాల వారీగా అతిథి అధ్యాపకుల వివరాలు అడిగితెలుసుకున్నారు. విభాగాల్లో విద్యార్థుల సంఖ్యను పెంచుకునేందుకు ప్రతి ఒక్కరు కృషిచేయాలన్నారు. అలాగే బోధనలో నైపుణ్యాలు పెంచుకోవాలని అకడమిక్ పరంగా ఎప్పటికప్పుడు అప్‌డేట్ కావాలని సూచించారు.

# సామాజిక అంశాలపై నిరంతరం అధ్యయనం

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,నవంబరు15, ప్రభాతవార్త: సామాజిక అంశాలపై నిరంతరం అధ్యయనాలు చేయాల్సిన ఆవశ్యకత సోషియాలజీ అండ్ సోషల్‌వర్క్ విభాగం విద్యార్థులపై ఉందని ఆ విభాగాధిపతి ఆచార్య యం.త్రిమూర్తి రావు అన్నారు. విభాగం విద్యార్థులు



అబ్జర్వేషనల్ విజిట్‌లో భాగంగా విజయవాడలోని వాసవ్య మహిళా మండలి కార్యాలయాన్ని సందర్శించారు. సంస్థ అధ్యక్షులు డాక్టర్ బి.కీర్తివర్ధనులకు సంస్థ ఆవిర్భావాన్ని, సంస్థ అందిస్తున్న వివిధ సేవలను తెలియజేశారు. సోషల్‌వర్క్ అండ్ సోషియాలజీ విభాగం విద్యార్థుల కెరీర్ నైపుణ్యాలు కీలకం అన్నారు. కమ్యూనికేషన్, సాఫ్ట్ స్కిల్స్ నేర్చుకుని సమాజానికి అవసరమైన సేవలను అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విభాగం అధ్యాపకులు ఆచార్య సరస్వతి రాజు అయ్యర్, అతిథి అధ్యాపకులు డాక్టర్ పి.రాజకుమార్, డాక్టర్ ఎస్.రాజశేఖర్, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# తన ఎదుగుదలకు ఏఎన్‌యు గ్రంథాలయం ఒక కారణం

## - రెక్టార్ రామినేని శివరాం ప్రసాద్

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,నవంబరు15, ప్రభాతవార్త: వర్సిటీలో ఉన్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ మెమోరియల్ లైబ్రరీ తన ఎదుగుదలకు ఒక కారణమని ఏఎన్‌యు ఇన్‌చార్జ్



రెక్టార్ ఆచార్య రామినేని శివరాం ప్రసాద్ అన్నారు. వర్సిటీలోని గ్రంథాలయంలో 60వజాతీయ గ్రంథాలయ వారోత్సవాలు జరుగుతున్నాయి. గ్రంథాలయంపై అవగాహన కార్యక్రమాలు శనివారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఇన్‌చార్జ్ లైబ్రేరియన్‌తో కలిసి పోటీ పరీక్షల సెక్షన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇదే యూనివర్సిటీలో విద్యార్థిగా ఉన్న నేను గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలను, జర్నల్‌ను వినియోగించుకుని ఇప్పుడు ప్రొఫెసర్ స్థాయికి ఎదిగానని గుర్తు చేశారు. ఆరోజుల్లో దాదాపుగా 24మంది ఎస్ఐలు, 400మంది ఎస్ఎస్‌సి ఉద్యోగాలు, గ్రూప్ 2 అధికారులుగా సెలక్ట్ అయ్యారని పేర్కొన్నారు. ప్రస్తుతం డిజిటల్ గ్రంథాలయంలో ఉన్న రీసోర్సెస్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లైబ్రేరియన్ ఆచార్య కె.వెంకటరావు మాట్లాడుతూ విద్యార్థులకు, పరిశోధకులకు గ్రంథాలయం ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. విద్యార్థులకు ఏదైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం జాతీయ గ్రంథాలయం వారోత్సవాల సందర్భంగా పుస్తకాల ప్రదర్శనను రెక్టార్ శివరాం ప్రసాద్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయం సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# కనులపండువగా శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి 18మెట్ల పూజ

గుంటూరు కల్చరల్,నవంబర్ 15,ప్రభాతవార్త : స్థానిక మల్లారెడ్డి నగర్ శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవాలయ చైర్మన్ మెట్టు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కళ్ళం శ్రీకాంత్‌రెడ్డి,పోలూరి ప్రవీణ్‌కుమార్ రెడ్డిల సౌజన్యంతో ఆలయ అర్చకులు చంద్రశేఖర్ శర్మ,శివకుమార్ శర్మ,విజయవాడ జె.రాముల వేదమంత్రాల నడుమ శబరిమల పూజా విధానంగా శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి





18మెట్ల పూజ,అయ్యప్ప స్వామికి పుష్పాభిషేకం, హరివరాసనం అనంతరం స్వాములకు భిక్షా కార్యక్రమం నిర్వహించనున్నట్లు చైర్మన్ మెట్టు కృష్ణారెడ్డి తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 17-11-2025నుంచి 27-12-2025 వరకు ప్రతిరోజూ మధ్యాహ్నం 12నుంచి 3గంటల వరకు ఆలయ ప్రాంగణంలో పంచదశ అన్నప్రసాదం (సద్ది) కార్యక్రమం నిర్వహిస్తున్నామని అయ్యప్పలు, భవానీలు,శివస్వాములు,వెంకటేశ్వర స్వాములు అయ్యప్ప సద్ది స్వీకరించి స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు.సమావేశంలో అన్నదాన కమిటీ చైర్మన్ గుంటూరు వేమారెడ్డి పాల్గొన్నారు.

# డెడికేటెడ్ కమిషన్ వేసి బీసీల సమగ్ర కులగణన జరిపించాలి

గుంటూరు విద్య ప్రభాతవార్త: స్థానిక సంస్థల ఎన్నికలకు బీసీల జనాభా దామాషా మేరకు చట్టబద్ధ రిజర్వేషన్లు అమలయ్యేలా, రాష్ట్ర ప్రభుత్వం ముందుగా డెడికేటెడ్ కమిషన్ ద్వారా సమగ్ర కుల గణన జరిపించాలని,ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుమ్మర క్రాంతి కుమార్ గారు తెలియజేశారు. ఈరోజు స్థానిక గుంటూరు చుట్టగుంట బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆ మేరకు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఇదే అంశంపై సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు గారు "బీసీ జనగణన వర్గీకరణలు జరపకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లడం సామాజిక న్యాయానికి తూట్లు పొడిచి రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరించడమేనంటూ" హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం వేయడం అందరికీ తెలిసిందే అన్నారు. అందులో భాగంగా హైకోర్టు,ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి,పంచాయతీరాజ్ పురపాలక శాఖల ముఖ్య కార్యదర్శులకు, రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కు నోటీసులు జారీ చేసిందన్నారు. ఆ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్‌జస్టిస్ చల్లా గుణరంజన్ లతో కూడిన ధర్మాసనం"పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని, తదుపరి విచారణను ఆరు వారాలకు వాయిదా"వేసిందన్నారు. తమ తరపు సీనియర్ న్యాయవాది సత్యప్రసాద్"ప్రతిసారి ఎన్నికల సమయం వచ్చేవరకు జనగణనలో బీసీల కుల గణనను చేయకపోవడంతో,వేలాది పదవులను బీసీలు కోల్పోయేలా తీవ్ర అన్యాయం జరుగుతుందని వాదించారన్నారు. డెడికేటెడ్ కమిషన్ వేసి బీసీ కుల గణన చేపట్టాలని నవంబర్ 24 సోమవారం గుంటూరు కలెక్టర్ కార్యలయం వరకు భారీ స్థాయి లో నిరసన ర్యాలీ చేపట్టు తామని క్రాంతికుమార్ తెలియజేశారు... ఇంకా ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, రాష్ట్ర నాయకులు బాదినేడి వంశీకృష్ణ, రాష్ట్ర యూత్ ప్రెసిడెంట్ పారేపల్లి మహేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కోలా అశోక్, బీసీ నాయకులు వెంకటేష్,కాశీ ,వరప్రసాద్.. పలువురు బీసీ నాయకులు పాల్గొని ప్రసంగించారు.

గుంటూరు వార్త

# వాహనదారులకు ఇబ్బంది లేకుండా ఆర్ఓబి నిర్మాణ పనులు నిర్వహించాలి: కలెక్టర్

గుంటూరు వెస్ట్, నవంబరు 15,ప్రభాతవార్త: ప్రజలకు, వాహనదారులకు శంకర్ విలాస్ ఆర్ఓబి వద్ద నిర్దేశించిన ప్రాంతాల్లో ప్రయాణించటానికి ఇబ్బంది లేకుండా నిర్మాణ పనులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. శనివారం ఉదయం జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు తో కలిసి అరండాలపేట వైపు శంకర్ విలాస్ ఆర్ఓబి నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్



అధికారులకు సూచనలు అందిస్తూ సర్వీస్ రోడ్లలో వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా గుత్తేదారులు నిర్మాణ పనులు నిర్వహించేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. నిర్మాణ పనుల సామాగ్రిని, పిల్లర్స్ త్రవ్వకాలలో వచ్చిన మట్టిని నిర్దేశిత ప్రాంతాల్లోనే నిల్వ చేసుకోవాలని సూచించారు. తాత్కాలిక మురుగు కాలవ నీరు రహదారిపై ప్రవహించకుండా సమీప కాలవలోకి మరలించేలా నగరపాలక సంస్థ అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఎస్ఈ శ్రీనివాస మూర్తి, ఆర్డీవో శ్రీనివాసులు, తహసిల్దార్ వెంకటేశ్వర్లు, పనులు నిర్వహిస్తున్న కంపెనీ ప్రతినిధులు, మున్సిపల్, ఆర్ అండ్ బి ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

# వ్యక్తిగత, సమాజ పరిశుభ్రత వలనే వ్యాధుల నుంచి రక్షణ

గుంటూరు వెస్ట్, నవంబరు 15, ప్రభాతవార్త: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రత, సమాజ పరిశుభ్రత పాటించడం ద్వారానే వ్యాధుల నుంచి రక్షణ పొందుతారని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా తెలిపారు. శనివారం లాలుపురం గ్రామంలో జరిగిన స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర, కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మొక్కలు నాటి, చేతులు శుభ్రపరచుకోవాల్సిన ప్రాముఖ్యతను వివరిస్తూ విద్యార్థులతో



కలిసి చేతులు శుభ్రపరుచుకున్నారు. పరిశుభ్రత పై అవగాహన కోసం గ్రామంలో నిర్వహించిన ర్యాలీలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. పొడి వ్యర్థాలకు నిత్యావసర సరుకులు అందిస్తున్న స్వచ్ఛ రథం పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో, గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో స్వయం సహాయక సంఘాల సభ్యులతో నిర్వహించిన స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ రాష్ట్రంలో పరిశుభ్రమైన నగరాలు, గ్రామాలు సాధన దిశగా ప్రభుత్వం 2025 జనవరి నుంచి ప్రతినెల మూడవ శనివారం ఒక థీమ్ తో స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు అన్నారు. ఈ శనివారం వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రత అనే అంశంతో నగర, గ్రామీణ ప్రాంతాల్లోని విద్యాసంస్థలు, అంగన్వాడి కేంద్రాలు, ఆసుపత్రులు, ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ ప్రాంతాల్లో కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 2047 విజన్ యాక్షన్ ప్లాన్ లో ఆనంద, ఆరోగ్య, ఐశ్వర్యమైన స్వర్ణాంధ్రం సాధించాలని లక్ష్యాలను నిర్దేశించారన్నారు. దీనికి వ్యక్తిగత శుభ్రత , సమాజ పరిశుభ్రత చాలా కీలకమని స్పష్టం చేశారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పై అవగాహన కలిగి ఉండాలని , ప్రతిరోజు రెండుసార్లు స్నానం చేయాలని, భోజనానికి ముందు, మరుగుదొడ్డికి వెళ్లి వచ్చిన తర్వాత సక్రమంగా చేతులు శుభ్రపరచుకోవాలని సూచించారు. శుభ్రత పాటించకపోతే అనారోగ్యానికి గురి అవుతారని చెప్పారు పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా కుటుంబ సభ్యులకు పరిసర ప్రాంతల వాళ్లకు తెలియచేయాలన్నారు. పాఠశాలల్లో పరిశుభ్రత లేకపోతే సంబంధిత ఉపాధ్యాయులకు ఫిర్యాదు చేయాలని, అవసరమైతే జిల్లా అధికారులకు విద్యార్థులు ఫిర్యాదు చేయవచ్చు అన్నారు. పిల్లలు తెలిపే సమస్యలను అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సమాజ పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించడానికి స్వయం సహాయక సంఘాలు కీలకమైన బాధ్యతలు నిర్వహించాలన్నారు. జిల్లా పరిషత్ సీఈవో వి జ్యోతి బసు, జిల్లా పంచాయతీ అధికారి సాయికుమార్, డి ఆర్ డి ఎ పీడీ విజయలక్ష్మి , ఆర్ డబ్ల్యు ఎస్ ఎస్ఈ కళ్యాణ చక్రవర్తి, ఆర్డీవో శ్రీనివాసులు, ఎంపీడీవో బండి శ్రీనివాసరావు, ప్రత్యేక అధికారి కర్నాటి శ్రీనివాసరావు, ఎంపీపీ తోట లక్ష్మి , గ్రామ పెద్దలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, సచివాలయ ఉద్యోగులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

# ప్రాంగణ నియామకంలో ఆర్.వి.ఆర్ జె.సి. ఇంజనీరింగ్ కళాశాల 77 మంది విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు

గుంటూరు విద్య, ప్రభాతవార్త: ఇటీవల తమ కళాశాలలో బెంగళూరుకు చెందిన ప్రముఖ సంస్థ అక్మెగ్రేడ్ నిర్వహించిన ప్రాంగణ నియామకంలో 77 మంది విద్యార్థులు ఎంపిక కావడం కళాశాలకు గర్వకారణమని కళాశాల అధ్యక్షులు డా. రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు శ్రీ జాగర్లమూడి మురళీమోహన్, డా. జగదీష్ కె. మద్దినేని ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన విద్యార్థులు బిజినెస్ డెవలప్మెంట్ అసోసియేట్ హోదాలో వార్షికంగా 6 నుండి 8 లక్షల రూపాయల



ప్యాకేజీతో నియమించబడి, ఇంటర్న్‌షిప్ సమయంలో నెలకు రూ. 18,000 స్టైపెండ్ అందుకోనున్నారని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను శనివారం నాడు కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ శ్రీ రాయపాటి గోపాల కృష్ణ మరియు కళాశాల సిబ్బంది అభినందించారు. వచ్చిన ప్రతి ఉద్యోగ అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొంటూ, మారుతున్న సాంకేతికతను అలవర్చుకోవాలని కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ శ్రీ రాయపాటి గోపాల కృష్ణ, ట్రెజరర్ డా. కొండబోలు కృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. కొల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ సి ఎస్ బి ఎస్ విభాగం నుండి 10 మంది, డేటా సైన్స్ విభాగం నుండి 13 మంది, ఏ ఐ ఎమ్ ఎల్ విభాగం నుండి 19 మంది, ఐ ఓ టి విభాగం నుండి 7 మంది, సి ఎస్ ఈ విభాగం నుండి 8 మంది, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ విభాగం నుండి 6 మంది, ఎలక్ట్రికల్ ఎలక్ట్రానిక్స్ విభాగం నుండి 3 మంది, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం నుండి 8 మంది, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం నుండి ఒకరు, ఎమ్ సి ఏ విభాగం నుండి ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారని, తమ కళాశాలలో విద్యనభ్యసించే కంప్యూటర్ కోర్స్ విద్యార్థులతో పాటుగా కోర్ ఇంజనీరింగ్ విభాగాల విద్యార్థులు కూడ భారీ ప్యాకేజీలతో అవకాశాలు సాధించడం కళాశాల అందిస్తున్న నాణ్యమైన విద్యకు నిదర్శనమని పేర్కొన్నారు. అకడమిక్ ఆర్ డి డైరెక్టర్ డా. కె. రవీంద్ర, ట్రైనింగ్ ప్లేస్‌మెంట్ అధికారులు శ్రీ సి.హెచ్. శ్రీనివాసరావు, డా.కె. సురేష్ బాబు, వివిధ శాఖల విభాగాధిపతులు, ప్లేస్‌మెంట్ ఇన్‌చార్జ్‌లు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

# పరిశ్రమలకు ఏపీ స్వర్గధామం

## లక్షల కోట్ల పెట్టుబడులతో రాష్ట్ర భవిత బంగారుమయం
## సీఎం చంద్రబాబు విజనరీకి నిదర్శనం
## 20 లక్షల ఉద్యోగాల కల్పన దిశగా అడుగులు
## ఐసీసీ సమ్మిట్ కు హాజరైన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నశీర్

గుంటూరు వెస్ట్, నవంబర్ 15, ప్రభాతవార్త: ఆంధ్ర ప్రదేశ్ పరిశ్రమల ఏర్పాటుకు స్వర్గధామంగా మారిందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. విశాఖపట్నంలో జరుగుతున్న సీఐఐ 30వ భాగస్వామ్య సదస్సుకు హాజరైన ఎమ్మెల్యే శనివారం ఓ పత్రికా ప్రకటనలో ఈ మేరకు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ను ఆర్థిక అగ్రామి రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు సీఐఐ సమ్మిట్ వేదికగా



మారిందని చెప్పారు. రెండు రోజుల్లో పలు ప్రముఖ అంతర్జాతీయ-జాతీయ సంస్థలతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక ఒప్పందాలను కుర్చుకుని రాష్ట్రానికి బంగారు భవిష్యత్తు అందించేందుకు చర్యలు తీసుకుందని అన్నారు. ఇప్పటి వరకు ..5,22,471 కోట్ల పెట్టుబడులతో జరిగిన ఒప్పందాల ద్వారా 2,67,239 ఉద్యోగ అవకాశాలు కల్పించబోతున్నామని వెల్లడించారు. విండ్-సోలార్ హైబ్రిడ్, గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమోనియా, బయోఫ్యూయల్స్, పంప్డ్ హైడ్రా స్టోరేజ్, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్, అగ్రివోల్టాయిక్స్, పునరుత్పాదక ఇంధన తయారీ వంటి ఆధునిక రంగాల వైపు ప్రపంచ దిగ్గజ సంస్థల ఆసక్తి రాష్ట్ర సామర్థ్యాన్ని మరోసారి నిరూపించాయని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రానికి వచ్చిన పరిశ్రమలనే తరిమికొట్టారని, దీంతో యువత భవిత అగమ్యగోచరంగా మారిందని చెప్పారు. ఐదేళ్లపాటు ఒక్క పరిశ్రమ కూడా ఏపీకి తీసుకురాలేకపోయిన జగన్ .. క్రెడిట్ చోరీ అని చౌకబారు విమర్శలు చేయడం చూస్తుంటే ప్రజలు నవ్వుకుంటున్నారని తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చాక రాష్ట్రానికి 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందన్నారు.

# 6న యునైటెడ్ క్రిస్టియన్ ఫోరం కమ్యూనిటీ క్రిస్మస్ వేడుకలు

గుంటూరు విద్య, ప్రభాతవార్త : యునైటెడ్ క్రిస్టియన్ ఫోరమ్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మద్దిరాల జోసెఫ్ ఇమ్మానియేల్ అధ్యక్షతన డిసెంబర్ 6వ తేదీ సాయంత్రం ఐదు గంటలకు ఆంధ్ర క్రైస్తవ కళాశాల ప్రాంగణంలో కమ్యూనిటీ క్రిస్మస్ వేడుకలు జరగనున్నట్లు మద్దిరాల ఇమ్మానియేల్ జోసఫ్ తెలిపారు . ఏసి కళాశాలలోని సెమినార్ హాల్లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో మద్దిరాల జోసెఫ్ ఇమ్మానియేల్ పలు అంశాలను




వివరించారు. కమ్యూనిటీ క్రిస్మస్ వేడుకలు గతంలో కొన్ని అనివార్య కారణాలవల్ల నిలిచిపోయాయనీ,అయితే అందరి సమైక్యత సహకారంతో ఈ ఏడాది వేడుకలను జరపనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ వేడుకలకు ముఖ్య ప్రసంగీకులుగా ప్రపంచ సువార్తికులు పాల్ దినకరన్ విచ్చేయనున్నట్లు పేర్కొన్నారు. అడవి తక్కెళ్ళపాడు లోని క్రిస్టియన్ భవనం త్వరిత గతిన పూర్తవుతుందని వెల్లడించారు. గతంలో రష్యా, చైనా, పాకిస్తాన్ లాంటి ప్రదేశాల్లో క్రిస్మస్ వేడుకలు జరిగేవి కావని ప్రస్తుతం ఆయా దేశాల్లో భక్తి శ్రద్ధ ల మధ్య జరుగుతున్నాయని మద్దిరాల గుర్తు చేశారు. 140 సంవత్సరాల చరిత్ర కలిగిన ఏసీ కళాశాలలో జరిగే ఈ వేడుకలకు దళిత నాయకులు క్రైస్తవ విద్యాసంస్థల అధినేతలు తదితరులు పెద్ద ఎత్తున హాజరుకావాలని పేర్కొన్నారు. ఆంధ్ర క్రైస్తవ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొమ్మలపాటి మోజేష్ మాట్లాడుతూ కమ్యూనిటీ క్రిస్మస్ వేడుకలకు క్రైస్తవులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఈ వేడుకలలో అభిషిక్తులు, క్రైస్తవ మత పెద్దలు, తదితర ప్రముఖులు హాజరు కానున్నారని, ఈ నేపథ్యంలో అన్ని క్రైస్తవ సంఘాల నాయకులు క్రైస్తవులు పెద్ద ఎత్తున హాజరై వేడుకలను విజయవంతం చేయాలని మోజేష్ పేర్కొన్నారు. మాజీ మంత్రివర్యులు వేమూరు శాసనసభ్యులు నక్కా ఆనందబాబు కమ్యూనిటీ క్రిస్మస్ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారని ఆయన తెలిపారు. ఆంధ్ర క్రైస్తవ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ గురవయ్య మాట్లాడుతూ క్రైస్తవులందరూ ఐక్యతతో ఉండాలని అలాంటి ఐక్యత భావాలతోనే ఇలాంటి కమ్యూనిటీ క్రిస్మస్ వేడుకలు రానున్న రోజులలో మరిన్ని జరుపుకో గలమని ఆయన తెలిపారు. విలేకరుల సమావేశంలో పలు డినామినేషన్ల క్రైస్తవ సంఘాల దైవజనులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేడుకలకు సంబంధించిన గోడప్రతులను ఆవిష్కరించారు

# కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

పెదనందిపాడు నవంబర్ 15 (ప్రభాతవార్త) యజమాని సంతకంతో నిమిత్తం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి, పంట రుణాలు మంజూరు చేయాలని, లేనిచో ఆందోళనకు పూనుకుంటామని కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పాశం రామారావు



అన్నారు.శనివారం పెదనందిపాడు మండలం పాలపర్రు లో జరిగిన కౌలు రైతుల సమావేశంలో వారు మాట్లాడారు . ఈ సమావేశానికి గోలి సుబ్బారావు అధ్యక్షత వహించారు . 70 సాగు భూమిని కౌలు రైతులే సాగు చేస్తున్నా ,బ్యాంకులో కౌలు రైతులకు రుణాలు ఇవ్వటం లేదన్నారు. అనేక వ్యయ ప్రయాసలకు వర్చి పంటలు పండిస్తే, పంటలకు గిట్టుబాటు ధర రావడం లేదన్నారు .అన్నదాత సుఖీభవ కౌలు రైతులకు కూడా వర్తింపజేయాలని ,ఈక్రాప్ నమోదు ఆధారంగా కౌలు రైతులను గుర్తించి పంట రుణాలు ,నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. రైతు సేవ కేంద్రాలు ద్వారాఎరువులు .యూరియా,డి.ఎ.పి. ,విత్తనాలుపురుగు మందులు సప్లై చేయాలని కోరారు .సి.ఐ.టి.యు .మండల నాయకులు దొప్పలపూడి రమేష్ బాబు , మండల నాయకులు నల్లమోతు రాజేంద్ర ,జంపని రామారావు ,ముద్దన వెంకటేశ్వర్లు మాట్లాడారు. అనంతరం ఏడుగురితో కౌలు రైతు సంఘం గ్రామ కమిటీని ఏర్పాటు చేశారు.అధ్యక్షులుగాఎన్ .శ్రీను ,కార్యదర్శిగా ఇనగంటి మొగులయ్య లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సమావేశంలో ఇనగంటి సిద్దయ్య,మూకిరి కోటేశ్వరరావు, ఇనగంటి శ్రీనివాసరావు,తదితరులు పాల్గొన్నారు.

R.V.R. & J.C. COLLEGE OF ENGINEERING (Autonomous)
Chandramoulipuram, Chowdavaram, Guntur Dt-522019, Approved by AICTE, Permitted by Govt. of A.P
Affiliated to ANU :: Non-minority institution :: Website: rvrjcce.ac.in Ph:0863-2288201
Estd: 1985

FIRST YEAR BBA SPOT ADMISSIONS

Applications are invited from eligible candidates for admission into I-Year BBA course. Applications directly obtained from the College Office from 17.11.2025 to 20.11.2025. Filled in applications along with copies of relevant certificates and non-refundable Registration fees of Rs.500/- in cash or by DD drawn in favour of the College can be submitted in the College Office in person between 10.00 am to 4.00 pm, on or before 20.11.2025. Applications can be submitted through online also.

Chowdavaram, 15.11.2025 — Sd/- PRINCIPAL

R.V.R. & J.C. COLLEGE OF ENGINEERING (Autonomous)
Chandramoulipuram, Chowdavaram, Guntur-522019, Approved by AICTE, Permitted by Govt. of AP
Affiliated to ANU - Non-minority institution :: NAAC 'A+' Grade
B.Tech. Courses Accredited by NBA - CSE, INF, EEE, MEC & CHE from 2024-25 to 2026-27; CIV & ECE from 2025-26 to 2027-28; Website: rvrjcce.ac.in, Ph:0863-2288201

ADMISSION NOTIFICATION FOR FIRST YEAR BBA CATEGORY-B SEATS

Applications are invited from eligible candidates for admission into I-Year BBA under 30% 'B' Category seats (which includes 15% Management Quota + 15% NRI Quota) for the academic year 2025-26 for the following course.

| Course | BBA |
| --- | --- |
| Sanctioned intake | 60 |
| Category 'B' Seats (30%) | 18 |

Applications can be directly obtained from the College Office from 17.11.2025 to 20.11.2025. Filled in applications along with copies of relevant certificates and non-refundable Registration fees of Rs.500/- in cash or DD drawn on any nationalized bank in favour of the College, shall be submitted in the College Office in person between 10.00 am to 4.00 pm or by post, so as to reach on or before 20.11.2025. Applications can be submitted through online also. The eligibility and admission will be as per Government rules. Tuition Fee etc. shall be paid as per the Govt. Orders. Merit / selected list will be displayed on the College website and Notice Board. For more details, visit college website.

Chowdavaram, 15.11.2025 — Sd/- SECRETARY & CORRESPONDENT

## హత్యలతో చేసిన పాపాలు కప్పిపుచ్చాలనే నేరస్తులు

## చంద్రబాబు దృష్టి నుంచి ఎప్పటికీ తప్పించుకోలేరు : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, నవంబర్ 15, ప్రభాతవార్త: పర్యావరణ పరిరక్షణ, ప్రజారోగ్యం నిమిత్తం ప్రజలు మొక్కలు నాటాలని, వాటిని తమ సొంతపిల్లల్ని పోషించినట్టుగా పెంచి పెద్దవాటిని చేసి భావితరాలకు కాలుష్యరహిత రాష్ట్రాన్ని కానుకగా అందించాలని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు. శనివారం స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్రలో పాల్గొన్న ఆయన పట్టణంలోని 22వ వార్డు గాంధీనగర్లోని చైతన్య స్కూల్లో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటిన అనంతరం పచ్చదన పరిరక్షణపై వారితో స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు.హత్యలు..



హత్యా రాజకీయాల్లో వైసీపీది అందెవేసిన చెయ్యి.. విశాఖ భాగస్వామ్య సదస్సు ఖ్యాతి రాష్ట్రానికి, చంద్రబాబుకు, దక్కకూడదు.. ప్రజల్లో పెట్టుబడులపై చర్చ జరగకూడదన్న దుగ్ధతోనే హత్యానేరాల్లో ఆరితేరిన అవినీతిపరులు టీటీడీ మాజీ ఏవీఎస్వో సతీష్ ను చంపేశారని ప్రత్తిపాటి పేర్కొన్నారు. హత్యలు.. హత్యా రాజకీయాల చరిత్ర ఎప్పటికప్పుడు కొత్తగా తిరగరాయడంలో వైసీపీది అందెవేసిన చెయ్యిఅని, గతంలో జరిగిన పరిటాల రవీంద్ర హత్య. వై.ఎస్.వివేకానందరెడ్డి హత్యలు.. ఆయా ఘటనల్లో సాక్షుల మరణాలే అందుకు నిదర్శనమన్నారు. వారెన్ని కుట్రలు, హత్యలు చేసినా ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టి నుంచి తప్పించుకోలేరని, చేసిన తప్పులు వారిని వెంటాడుతూనే ఉంటాయన్నారు.. కూటమిప్రభుత్వంలో దోషులు ఎప్పటికీ తప్పించుకోలేరని, సతీష్ ను చంపినవారు చట్టప్రకారం శిక్షింపబడతారని, చంద్రబాబు దృష్టి నుంచి తప్పించుకోలేరని ప్రత్తిపాటి తేల్చిచెప్పారు. రాష్ట్రానికి పెట్టుబడులు వరదలా రప్పిస్తున్న చంద్రబాబు నాయకత్వ పటిమను చూసి వైసీపీనేతలు ఓర్వలేకపోతున్నారని, ఆ క్రమంలోనే అలజడులు, అశాంతి సృష్టించే కుట్రలకు పాల్పడుతున్నారని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి తెలిపారు. జనసేన ఇంచార్జి తోట రాజారమేష్, టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ టీడీపీ కరీముల్లా, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, పట్టణ ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, మున్సిపల్ కమిషనర్ పతి శ్రీహరి బాబు, పట్టణ సిఐ రమేష్, పాఠశాల డైరెక్టర్ గిరి, మున్సిపల్ కౌన్సిలర్లు, టీడీపీ ముఖ్య నాయకులు, కూటమి నాయకులు తదితరులున్నారు.

## మృతురాలి కుటుంబానికి ప్రత్తిపాటి పరామర్శ



చిలకలూరిపేట, నవంబర్ 15, ప్రభాతవార్త: చిలకలూరిపేట పట్టణానికి చెందిన తెలుగుదేశం పార్టీ మైనారిటీ నాయకులు షేక్ మోలాలి భార్య షేక్ బాజిబి మృతి చెందగా, మద్దినగర్ లోని వారి నివాసం వద్ద ఉంచిన వారి పార్థివ దేహాన్ని సందర్శించి, నివాళులర్పించి, వారి కుటుంబసభ్యులను పరామర్శించిన మాజీ మంత్రివర్యులు, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు.


## అయ్యప్ప పడిపూజ



చిలకలూరిపేట, నవంబర్ 15, ప్రభాతవార్త: చిలకలూరిపేట పట్టణము లోని గడియార స్తంభం, మార్కెట్ సెంటర్ నందు జై భవాని భక్త బృందం నిర్వాహకుల ఆధ్వర్యంలో గురుస్వామి జొన్న శ్రీను చేతులమీదుగా 18 మెట్ల పడిపూజ, కలశ, అభిషేక కార్యక్రమాలు మరియు పడిపూజ కార్యక్రమాలు ఎంతో కనులపండుగగా జరిగిన శ్రీ అయ్యప్ప స్వామి పడిపూజ మహోత్సవ కార్యక్రమానికి భవాని భక్త బృందం వారి ప్రత్యేక ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ మంత్రివర్యులు, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు గారిచే అయ్యప్పస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామి వారికి పంచామృతాలతో ప్రత్యేక అభిషేకాలు జరిపించారు, అనంతరం భక్త బృందం వారు స్వామివారి తీర్థప్రసాదాలను మాజీ మంత్రివర్యులు, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు గారికి అందచేశారు...

## ఘనంగా అయ్యప్ప పూజలు

చిలకలూరిపేట, నవంబర్ 15, ప్రభాతవార్త: చిలకలూరిపేట పట్టణం లోని గడియార స్తంభం సెంటర్లో శ్రీ అయ్యప్ప స్వామి పడిపూజ మహోత్సవ కార్యక్రమం శుక్రవారం రాత్రి జై భవాని భక్త బృందం నిర్వాహకుల ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా జరిగింది. ఈకార్యక్రమంలో నిర్వాహకుల ప్రత్యేక ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా శాసనమండలి సభ్యులు మర్రి రాజశేఖర్ పాల్గొని జొన్న శ్రీను గురుస్వామి ఆధ్వర్యంలో శ్రీ అయ్యప్పస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి,స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. గురుస్వామి జొన్న శ్రీను ఆధ్వర్యంలో 18 మెట్ల పడిపూజ, కలశ,



అభిషేక కార్యక్రమాలు ఎంతో వైభవంగా జరిగాయి. తెనాలి సతీష్ స్వామి వారిచే అయ్యప్ప నామ కీర్తనలు పాడారు అలాగే, తెనాలి భానుస్వామిచే మండపాల అలంకరణ అత్యంత సుందరంగా నిర్మాణం చేశారు. జై భవాని భక్త బృందం కమిటీ సభ్యులు కీర్తి చెంచు గారు, మూకిరి సుగుణ రావు , దాసరి శ్రీకాంత్ , పసుమర్తి రామ్మూర్తి , బోడపాటి ప్రభాకర్ (షూ మార్ట్), స్వర్ణ గిరి , ప్రభాకర్ (టి స్టాల్) , వంకాయల శ్రీహరి , కొలిశెట్టి శ్రీనివాస్‌ను శాసన మండలి సభ్యుడు మర్రి రాజశేఖర్ అభినందించి ఎంతో వ్యయ ప్రయాసలకు ఓర్చి స్వాములకు ఇంత పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహించినందుకు మీకు అభినందనలు అంటూ గత కొన్ని సంవత్సరాలుగా నవరాత్రి దుర్గామాత ఉత్సవాలను కూడా ఎంతో ఘనంగా నిర్వహిస్తూ ప్రజలందరికీ భక్తి భావాలను పెంపొందిస్తున్న మీ కమిటీ ని అభినందనదిస్తూ మరిన్ని మంచి కార్యక్రమాలు చేయుటకు మీకు మరింత శక్తిని ప్రసాదించాలని భగవంతుని కోరుకుంటున్నానని అన్నారు.ఈ కార్యక్రమంలో వారి వెంట నాయుడు వాసు గారు, ఇమ్మడి జానకిపతి , వేజర్ల కోటేశ్వరరావు , జల్లెడ గణేష్ , జంజనం వెంకట రావు, చెన్నూరి శివబాబు, అనపర్తి శ్రీనివాస్, లింగాల విజయ్ యాదవ్ తదితరు లున్నారు

## ఘనంగా నూతన ప్రారంభం

చిలకలూరిపేట, నవంబర్ 15, ప్రభాతవార్త: పురుషోత్తపట్నం వాస్తవ్యులు ,గౌరవ శాసన మండలిసభ్యులు మర్రి రాజశేఖర్ ఆప్తులు ఇమ్మడి జానకీపతి గత 30 సంవత్సరాల నుండి శ్రీ




ధనలక్ష్మి లారీ సప్లై ఆఫీసును గడియార స్తంభం సెంటర్ నందు నిర్వహించుచున్నారు గత ఐదు సంవత్సరాలుగా చిలకలూరిపేట లారీ యూనియన్ అసోసియేషన్ అధ్యక్షులుగా పని చేస్తున్నారు. ఈరోజు శ్రీ ధనలక్ష్మి లారీ సప్లైఆఫీస్ యొక్క బ్రాంచ్ ఆఫీస్ ను చిలకలూరిపేట కొత్త మార్కెట్ యార్డ్ ఎదురు బైపాస్ రోడ్డు నందు నూతనంగా నిర్మించిన కార్యాలయాన్ని ముఖ్యఅతిథులు గా పాల్గొన్న మర్రి రాజశేఖర్, సోమేపల్లి వెంకటసుబ్బయ్య చేతుల మీదగా స్వామివార్లకు పూజ చేసి, ప్రారంభోత్సవం చేశారు.ఈ సందర్భంగా ఇమ్మడి జానకిపతి కి అభినందనలు తెలియజేసి వారి వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లాలని భగవంతుని కోరుకున్నట్టు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సోమేపల్లి వాసు , గరికపాటి అవినాష్, సాతులూరి కోటి , కొండ్రగుంట రామకృష్ణ , నార్నె హనుమంతరావు ,రావూరి దాసు ,సయ్యద్ వాహబ్, షేక్ రసూల్ , జంజనం వెంకటరావు,మోలాలి , సుభాని , కొప్పుల రత్నకుమార్ , కొప్పుల దినకర్ , లింగాల విజయ్ యాదవ్ తదితరులున్నారు

## ఘనంగా ప్రారంభమైన గ్రంథాలయ వారోత్సవాలు

చిలకలూరిపేట, నవంబర్ 15, ప్రభాతవార్త: శాఖా గ్రంథాలయం మురికిపూడి నందు 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో రెండో రోజులో భాగంగా పుస్తక ప్రదర్శన మరియు పద్యాల పోటీలు ఈ నిర్వహించడమైనది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రిటైర్డ్ ప్రధాన అధ్యాపకులు మరియు గ్రామ పెద్దలు కొమ్మనబోయిన రామారావు మరియు గ్రామ రెవెన్యూ అధికారి మద్దూరి కోటేశ్వరరావు పాల్గొన్నారు.ముందుగా అతిథులు కొమ్మనబోయిన రామారావు మరియు మద్దూరి కోటేశ్వరరావు కలిసి రిబ్బన్ కట్ చేసి పుస్తక ప్రదర్శన కార్యక్రమాన్ని ప్రారంభించారు. తదుపరి 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ప్రతిజ్ఞా విద్యార్థుల చేత చేపించారు

## 25వ వార్డు జాగుపాలెంలో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

చిలకలూరిపేట, నవంబర్ 15, ప్రభాతవార్త: శాసనసభ్యులు పత్తిపాటి పుల్లారావు ఆదేశాల మేరకుచిలకలూరిపేట పట్నంలోని 25వ వార్డులో జాగుపాలెంలో ఐదు లక్షలతో సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వచ్చిన మున్సిపల్ చైర్మన్ రఫాని, జనసేన పార్టీ సమన్వయకర్త తోటరాజ రమేష్, జనసేన పార్టీ యువ నాయకులు మండలనేని చరణ్ తేజ, వార్డు



కౌన్సిలర్ తోట నాగలక్ష్మి, సిపిఐ పార్టీ నాయకురాలు చెరుకుపల్లి నిర్మల,తోట వెంకట సురేష్,టీడీపీ పార్టీ సీనియర్ నాయకులు బోనం శ్రీను,గాత్రం రవి కుమార్, శానం శేఖర్,రామిశెట్టి తేజ, అయ్యప్ప స్వామి, కస్టర్ ఇంచార్జి మస్తాన్, ప్రెసిడెంట్ మిద్దెల పూర్ణ సింగ్, జనసేన పార్టీ వీర మహిళా పునుగుపాటి పరమేశ్వరి, ముత్తంశెట్టి ప్రసాద్బ్జి శ్రీను,చల్లా వెంకయ్య, సుభాని భారీ గా హాజరై నా జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు మహిళలు కూటమి నాయకులు పాల్గొని శంకుస్థాపన కార్యక్రమంలో కొబ్బరికాయలు కొట్టి ప్రారంభించారు

## పోలీసు విధుల గురించి అవగాహన



చిలకలూరిపేట, నవంబర్ 15, ప్రభాతవార్త: చిలకలూరిపేట, నవంబర్ 15, ప్రభాతవార్త: రావు శ్రీకృష్ణ దేవరాయలు (డౌన్ సిండ్రోమ్ బాయ్)కి చిలకలూరిపేట పట్టణ పోలీస్ స్టేషన్లో సీఐ పి రమేష్ బాబు పోలీస్ విధులు గురించి వివరించారు. యూనిఫామ్ ధరించి శ్రీకృష్ణదేవరాయలు పోలీస్ స్టేషన్ లో విధులు గురించి తెలుసు కున్నాడు. పట్టణ ఎస్ఐలు రహమతుల్లా, చెన్నకేశవులు, డి శ్రీనివాసరావు, విద్యార్థి తండ్రి రావు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

# పల్నాడు జిల్లా వార్త



## స్వర్ణాంధ, స్వచ్ఛఆంధ్ర ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్, ఎమ్మెల్యే



నరసరావుపేట, నవంబరు 15ప్రభాతవార్త : స్వర్ణాంధ, స్వచ్ఛఆంధ్ర కార్యక్రమాలలో శనివారం జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు, ఆర్డీవో మధులత పాల్గొన్నారు. కమిషనర్ జశ్వంత్‌రావు అధ్యక్షతన పట్టణ ప్రధాన వీధుల్లో జరిగిన ర్యాలీని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కృతికాశుక్లా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా స్వచ్ఛఆంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలన్నారు. ప్రతి నెలలో మూడవ శనివారం ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఆహారం తీసుకునే ముందు చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇంటి వద్దనే తడి, పొడి చెత్తలను వేరు చేసి అందించాలన్నారు. తహశీల్దార్ వేణుగోపాల్, మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది, పలు కళాశాలల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు డాక్టర్ గోపిరెడ్డి పరామర్శ



నరసరావుపేట, నవంబరు 15ప్రభాతవార్త : వైకాపా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి శనివారం నియోజకవర్గంలో పర్యటించారు. పట్టణంలోని 4వ వార్డులో పార్టీ కార్యకర్త బెజ్జంకి శివకుమారి కనుమూసిన విషయం తెలుసుకొని ఆమె భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. భగవంతుడు కుటుంబసభ్యులకు మనోధైర్యాన్ని కల్పించాలని కోరుకున్నారు. డాక్టర్ గోపిరెడ్డి వెంట మైనార్టీ నాయకులు ఖాదర్‌బాషా తదితరులు ఉన్నారు.

## ఉప్పలపాడు శాఖా గ్రంథాలయంలో వారోత్సవాలు





నరసరావుపేట, నవంబరు 15ప్రభాతవార్త : మండలంలోని ఉప్పలపాడు శాఖా గ్రంథాలయంలో శనివారం 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను గ్రంథాలయ అధికారి కె.వెంకట్రావు అధ్యక్షతన నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం సి.హెచ్.కోటేశ్వరరావు, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు యన్నం బాలరెడ్డి, సాంబిరెడ్డి, నంద్యాల కోటిరెడ్డి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు అని తెలిపారు. ప్రతి ఒక్కరూ రోజూ పుస్తక పఠనం అలవర్చుకోవాలన్నారు. విద్యార్థులకు గ్రంథాలయాల వలన కలిగే ఉపయోగాలను తెలియజేశారు.

## ఎస్ఎస్ఎన్ కళాశాలలో విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు

నరసరావుపేట, నవంబరు 15ప్రభాతవార్త : ఎస్ఎస్ఎన్ కళాశాల గ్రంథాలయంలో శనివారం 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను లైబ్రేరియన్ పి.రామాంజనేయరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సుధీర్ మాట్లాడుతూ వంద మంది విద్యార్థినీ విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్ పోటీలను నిర్వహించామని తెలిపారు. విద్యార్థులు సృజనాత్మకత వ్యాసాలను రాశారన్నారు. పోటీలలో గెలుపొందిన వారికి సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేస్తామని లైబ్రేరియన్ పి.రామాంజనేయరెడ్డి తెలియజేశారు. వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాససాయి మాట్లాడుతూ డిజిటల్ యుగంలోనూ గ్రంథాలయాల పట్ల విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని సూచించారు.



## అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ళ పట్టాలు : ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

నరసరావుపేట, నవంబరు 15 ప్రభాతవార్త : అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ళ పట్టాలు అందిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు అన్నారు. మండలంలోని రంగారెడ్డిపాలెం గ్రామంలో పార్టీ



రాష్ట్ర కార్యదర్శి నల్లపాటి రాము, అధికారులతో కలిసి ఎమ్మెల్యే అరవింద్‌బాబు పర్యటించారు. గత ప్రభుత్వ హయాంలో ఆరు ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని పేదలకు ఇంటి స్థలాల కోసం ఇచ్చేందుకు కేటాయించడం జరిగిందన్నారు. తక్షణమే సర్వే నిర్వహించి అర్హులైన వారికి ఇళ్ళ స్థలాలు ఇవ్వాలని తహశీల్దార్ వేణుగోపాల్‌ను ఎమ్మెల్యే అరవింద్‌బాబు ఆదేశించారు.

**అన్న క్యాంటీన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ...**

పట్టణంలోని అన్న క్యాంటీన్‌ను శనివారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు పార్టీ నాయకులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సత్తెనపల్లిరోడ్డులో పర్యటించి అన్న క్యాంటీన్‌లో పేదలకు అందిస్తున్న భోజన నాణ్యతను పరిశీలించారు. అలాగే అల్పాహారం రుచిగా ఉండాలని సూచించారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలన్నారు. అదే విధంగా సమయపాలనపై ఖచ్చితమైన దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే అరవింద్‌బాబు ఆదేశాలిచ్చారు.

## ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపిన మైనార్టీ నాయకులు



నకరికల్లు, నవంబరు 15 ప్రభాతవార్త : ముఖ్యమంత్రి చంద్రబాబుకు టిడిపి పార్టీకి చెందదిన మైనార్టీ నాయకులు శనివారం కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక 7,8 వార్డులకు చెందిన కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గత ఏడాది కాలానికి గాను ముస్లిం మతపెద్దలుగా ఉన్న మౌజాన్‌లు, ఇమామ్‌లకు రావాల్సిన గౌరవ వేతనాన్ని ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. నవంబర్ 11న మౌలాని అబుల్‌కలాం జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మైనార్టీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని, మాట ఇచ్చిన ప్రకారం ఇమామ్‌లు, మౌజాన్‌లకు నిధులు విడుదల చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుయువత అధికార ప్రతినిధి షేక్.రఫీ, కార్యదర్శి బుడే, నాయకులు కరిముల్లా, బడేబాబు, సైదావలి, మహబూబ్ బాషా, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

## .గ్రంథాయాలు విజ్ఞానాన్ని పంచే భాండాగారాలు



యడ్లపాడు, నవంబర్ 15, ప్రభాతవార్త : గ్రంథాలయాలు విజ్ఞానాన్ని పంచే భాండాగారాలు అని స్థానిక యూనియన్ బ్యాంక్ మేనేజర్ సిహెచ్ విజయ గవాస్కర్ అన్నారు. జాతీయ గ్రంథాలయ 58వ వారోత్సవాలను శుక్రవారం యడ్లపాడు గ్రామంలోని శాఖా గ్రంథాలయంలో పుస్తక పఠనాన్ని అయన ప్రారంభించారు. తదుపరి బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ పి పెరుమాళ్ళు మాట్లాడుతూ చిన్నారులు విధిగా చిన్ననాటినుండే గ్రంథాలయాలకు వచ్చే అలవాటు ఏర్పరచుకొని పుస్తక పఠనంపై ఆశక్తి పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి సిహెచ్ అంజమ్మ, పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం: చీఫ్‌విప్ జీ.వీ

వినుకొండ,నవంబర్15,ప్రభాతవార్త: పురపాలక సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని కారంపూడి రోడ్డు నందు గల శ్రీ చైతన్య స్కూల్ నందు స్వచ్ఛాంధ్ర–సర్ణాంధ్ర కార్యక్రమం శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా చీఫ్‌విప్,ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు పాల్గొన్నారు. విద్యార్థులతో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించి పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు





తప్పనిసరిగా మొక క్కలు నాటాలన్నారు. ఏపీని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబునాయుడు పని చేస్తున్నారని ప్రజలు భాగసా వ్యములు కావాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ కమీషనర్ సుభాష్‌చంద్రబోస్,కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆడుదాం ఆంధ్ర ... పేరిట వేలకోట్లు దోపిడి చేసిన జగన్: జీ.వీ

వినుకొండ,నవంబర్15,ప్రభాతవార్త: క్రీడల వల్ల శారీరక,మానసిక ఉల్లాసం పెరుగుతుందని విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్,ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు అన్నారు. ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర యంలో పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజి క్రీడా మైదానం నందు ఏర్పాటు చేసిన 69వ అంతర్ జిల్లాల కబడ్డీ పోటీలను చీఫ్‌విప్ జీ.వీ ముఖ్య అతిథిగా పాల్గొని శనివారం ప్రారంభించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులతో కరచాలనం చేసి ఉత్సాహపరిచారు. జయాపజయాలతో నిమిత్తం లేకుండా క్రీడా



స్ఫూర్తితో మెలగాలన్నారు. కూటమి ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహించేందుకు అనేక చర్యలు చేపడుతుందని పేర్కొన్నారు. గత వైకాపా పాలనలో ఆడుదాం ఆంధ్ర పేరిటి వేల కోట్లు జగన్ దోపిడి చేశారన్నారు. ఒక్క పీఈటీ పోస్టు కూడా భర్తీ చేయకుండా విద్యార్థులను క్రీడలకు దూరం చేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తరువాత మెగా డిఎస్సీ ద్వారా 16వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశామన్నారు. 1000 పైగా పీఈటీ పోస్టులు భర్తీ చేయడం జరిగిందని చెప్పారు. విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ విదా వ్యరంగంలో సంస్కరణలతోపాటు క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం 3శాతం వరకు సో ర్ట్స్ కోటా రిజర్వేషన్‌ను పె ంచడం జరిగందని సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయి చేరుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు షకీలా,పత్తి పూర్ణ,పి.వి సురేష్,పల్నాడు జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ ఎన్.సురేష్ కుమార్,టోర్నమెంట్ అబ్జర్వర్,జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల అధ్యక్ష,కార్యదర్శులు స్వర్ణ రాజు,ఖాదర్ మస్తాన్,ఎన్నార్టీ డివిజనల్ ఎస్‌జిఎఫ్ కో ఆర్డినేటర్ వై.వి చిరంజీవిరావు,వినుకొండ వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షులు అంగటి బాజు,కార్యదర్శి గణప వీరాంజనేయులు,పీఈటి రాగుల రాధాకృష్ణమూర్తి,పాపచాని చిన్నామయ్య,కాకుమాను రాజేష్,మద్దం వెంకటేశ్వర్లు, ఎన్.వెంకటరత్నం,జి.చిన్న అంకారావు,మహేష్, తెదేపా నాయకులు రోశయ్య, ఆయూబ్‌ఖాన్,తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా 72వ జాతీయ సహకార వారోత్సవాలు

నూజెండ్ల,నవంబర్15,ప్రభాతవార్త: 72వ జాతీయ సహకార వారోత్సవాలు పురస్కరించుకొని మండలకేంద్రమైన నూజెండ్ల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నందు సీఈవో



గంగినేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు శనివారం నిర వ్వహించారు. ముఖ్య అతిథిగా సొసైటీ చైర్మన్ బచ్చు అంజిరెడ్డి పాల్గొని సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. సొసైటీ ద్వారా రైతులకు తక్కువ వడ్డీతో రుణాలు అందించడం జరుగుతుందని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. సొసైటీ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేయడం జరుగుతుందని పేర్కొని సభ్యులతో సహకార ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ గంగినేని బ్రహ్మయ్య,గ్రామ సర్పంచ్ వీర్ల వెంకటస్వామి,రవ్వారం యూనిట్ ఇంచార్జి మరిడి సురేష్,రైతులు తదితరులు పాల్గొన్నారు.

## హోరాహోరీగా అంతర్ జిల్లాల కబడ్డీ పోటీలు

వినుకొండ,నవంబర్15,ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర యంలో పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజి క్రీడా మైదానం నందు ఏర్పాటు చేసిన 69వ అంతర్ జిల్లాల అండర్–19 బాలబాలికల కబడ్డీ పోటీలు శనివారం మొదటి రోజు హోరాహోరీగా ప్రారంభమయ్యాయి. ప్రజలు తిలకించేందుకు వీలుగా ప్రత్యేక గ్యాలరీ,ఫ్లడ్‌లైట్‌లు ఏర్పాటు చేశారు.



వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన క్రీడాకారులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఉచిత భోజనం వసతి టోర్నమెంట్ నిర్వాహకులు గంగినేని రాఘవరావు ప్రతే వ్యకంగా పర్యవేస్తున్నారు. బాలికల విభాగంలో గుంటూరు జట్టు చిత్తూరు జట్టుపై 16పాయింట్ల తేడాతో గెలుపొందింది. బాలుర విభాగంలో పశ్చిమగోదావరి జట్టు విజయనగరం జట్టుపై 24 పాయింట్ల తేడాతో విజయం సాధించింది.

## కష్టాలతో ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజల్ని వేధించొద్దు: జీ.వీ

వినుకొండ,నవంబర్15,ప్రభాతవార్త: కష్టాలు,సమస్యలతో ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలను అధికారులు పదే పదే తిప్పుకోవద్దని త్వరితగతిన పరిష్కరించి ప్రజాభిమానాన్ని పొందాలని ఏపీ



ప్రభుత్వ చీఫ్‌విప్,ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు అన్నారు. శనివారం పురపాలక సంఘ కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో జీ.వీ సమీక్ష సమావేశం నిర్వహించారు. గత వైకాపా పాలనలో వినుకొండలో అధికారులు అవినీతికి పాల్పడి ప్రజల పట్ల దురుసుగా వ్యవహరించారని చెప్పారు. కూటమి ప్రభుత్వం ప్రజల పక్షపాతి అని ప్రభుత్వ,పౌర సేవలు కోసం కారా వ్యలయాలకు వచ్చే ప్రజలను గౌరవించి సకాలంలో సర్వీసులు అందించాలన్నారు. సచివాలయాల ఇంచార్జులు పూర్తి బాధ్యతతో వ్యవహరించి ప్రతి వార్డు పరిధిలోని ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని చెప్పారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించేవారిపై అవినీతికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజాప్రతినిధులు,అధికారులు సమన్వయంతో పనిచేసి పట్టణ,నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని చెప్పారు.

## వ్యక్తిగత, సమాజ పరిశుభ్రతపై అవగాహన



కారంపూడి, నవంబరు 15 ప్రభాతవార్త: మండల పరిధిలో మూడో శనివారం సందర్భంగా స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమం జరిగింది. వ్యక్తిగత పరిశుభ్రత, సమాజ పరిశుభ్రత, పరిసరాల పరశుభ్రత, చేతులు శుభ్రంగా ఉంచుకోవడంపై గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు. స్థానిక వీరుల దేవాలయం వద్ద నాగులేరు మెట్లను, పారిశుధ్య కార్మికులతో కలిసి స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ సుబ్బారావు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ మల్లయ్య, మలేరియా సూపర్‌వైజర్ లాలునాయక్ తదితరులు పాల్గొని శుభ్రపరిచారు. పీహెచ్‌సీ వద్ద జరిగిన స్వచ్ఛ ప్రతిజ్ఞలో వైద్యాధికారులు రమ్య, మౌనిక, ఏఎన్ఎంలు ఆశవర్కర్లు, పాల్గొన్నారు. అదేవిధంగా గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, పాఠశాలల విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

# బాపట్ల జిల్లా వార్త



## పరిశుభ్రమైన జిల్లాగా బాపట్లను తీర్చిదిద్దుదాం: జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్

రేపల్లె, నవంబరు 15, ప్రభాతవార్త:ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటిస్తే ఆరోగ్యకరమైన వాతావరణంతో సమాజం అభివృద్ధి చెందుతుందని బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ స్పష్టం చేశారు. రేపల్లె నియోజకవర్గంలోని నగరంలో శనివారం శ్రీ వెలగపూడి రామకృష్ణ స్మారక కళాశాలలో స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కు ఎన్ సి సి విద్యార్థులు గౌరవ వందనం చేశారు. కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. మండల కేంద్రమైన నగరంలో చేపట్టిన విద్యార్థుల ర్యాలీని కలెక్టర్ వినోద్ కుమార్ పచ్చజెండా ఊపి ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో కలెక్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ పరిశుభ్రమైన జిల్లాగా బాపట్ల జిల్లాను తీర్చిదిద్దాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గుర్తు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని సిఎం నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించటం



విశేషమన్నారు. ప్రతి నెల 3వ శనివారం స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ప్రతి నెలలో ఒక అంశాన్ని పరిగణనలోకి తీసుకుంటున్నామని చెప్పారు. నవంబరు నెలలో వ్యక్తిగత, సమాజ పరిశుభ్రత అనే అంశంపై కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రపంచాన్ని సంస్కరించే ముందు ఎవరికి వారు తమను సంస్కరించుకుంటే అనూహ్యమైన ఉత్తమ ఫలితాలు పొందవచ్చుననే మహాత్మా గాంధీ ఆశయ సాధనకు అనుగుణంగా సిఎం చంద్రబాబు నాయుడు ప్రణాళికా బద్ధంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని కలెక్టర్ వినోద్ కుమార్ పేర్కొన్నారు. ప్రతిరోజూ అందరూ శుభ్రంగా స్నానం చేయాలని, అలాగే ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఫలితంగా ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. బాపట్ల జిల్లాలో నీటి సమస్య లేదని ఆయన తెలిపారు. విధిగా ప్రతి ఇంట్లో మరుగుదొడ్డి సౌకర్యం ఏర్పాటు చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. బహిరంగ ప్రదేశాలలో మలవిసర్జన చేస్తే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఇంటి నిర్మాణ సమయంలోనే మరుగుదొడ్డి నిర్మించుకోవాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు మొక్కలు నాటే విధంగా ఉపాధ్యాయులు తప్పనిసరిగా విద్యార్థులను, ప్రజలను చైతన్య పరచాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి గ్రామంలో కాల్వలు ఉండాలని, రాష్ట్ర ప్రభుత్వం ఎన్ఆర్ఈజీఎస్ క్రింద సోప్ ఫీట్లు, పశువులకు కంపోస్ట్ ఫీట్లు ఏర్పాటుచేసి సమాజ వ్యక్తిగత పరిశుభ్రతను కాపాడుతున్నట్లు జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ వివరించారు.

## మరుగుదొడ్లు వినియోగించాల్సిందే

నిజాంపట్నం, నవంబరు 15,ప్రభాతవార్త: బాపట్ల జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ ఆదేశాల మేరకు శనివారం నిజాంపట్నం మండలంలో స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంపిడిఓ నాగలక్ష్మి మాట్లాడుతూ గ్రామాలలో ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లను మాత్రమే వినియోగించుకోవాలని అన్నారు. బహిరంగ ప్రదేశాలలో మలవిసర్జనకు వెళ్ళటం నిషేధమని ఆమె చెప్పారు. ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగటం ఆరోగ్యరీత్యా మంచిదన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని భోజనానికి ముందు తరువాత చేతులను శుభ్రంగా నీటితో కడుక్కోవాలని, పర్యావరణాన్ని కలుషితం చేయరాదని విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థుల చేత ఎంపిడిఓ నాగలక్ష్మి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, హౌసింగ్ ఏఈ లక్ష్మీనారాయణ, ఎపిఎం డి మస్తాన్, సి.సి శేషగిరిరావు , తాసిల్దార్ కార్యాలయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## భీమశంకర్ మాస్టర్ సేవలు చిరస్మరణీయం

రేపల్లె, నవంబరు 15,ప్రభాతవార్త: తెలుగు దేశం పార్టీ అభివృద్ధికి తుదిశ్వాస విడిచే వరకూ కృషి చేసిన అడుసుమల్లి భీమా శంకర్ మాస్టర్ చిరస్మరణీయులని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. శనివారం పురపాలక సంఘంలోని 10వ వార్డులో భీమశంకర్ మాస్టర్ కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి అనగాని సత్యప్రసాద్ సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. రేపల్లె టిడిపి ఉపాధ్యక్షుడుగా భీమశంకర్ మాస్టర్ అందించిన సేవలు ప్రశంసనీయమన్నారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు.



## ప్రజా సంక్షేమానికి పాటుపడాలి

రేపల్లె, నవంబరు 15, ప్రభాతవార్త:ప్రజల సంక్షేమానికి పాటుపడాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. శనివారం కమ్మ సామాజిక వర్గంలో ప్రభుత్వ పదవులు అనుభవిస్తున్న కార్పొరేషన్ చైర్మన్లు, సొసైటీ చైర్మన్లు, పాలకేంద్రం చైర్మన్లు, గ్రామ సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీపీలు తదితర పదవుల్లో కొనసాగుతున్న నాయకులను మంత్రి అనగాని సత్యప్రసాద్ ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో వేమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే నక్కా ఆనంద్ బాబు, మాజీ ఎమ్మెల్యేలు ముమ్మనేని వెంకట సుబ్బయ్య, దేవినేని మల్లికార్జున రావు, దండమూడి ధరణి కుమార్ తదితరులు పాల్గొన్నారు. రేపల్లె పట్టణంలో కాకతీయ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రేపల్లె, వేమూరు నియోజకవర్గాల కమ్మవారి ఆత్మీయ సమావేశం, కార్తీక వన సమారాధన మహోత్సవంలో మంత్రి అనగాని సత్యప్రసాద్ పాల్గొని అభినందనలు తెలిపారు.



## చట్టాల అమలుపై చర్చ

రేపల్లె, నవంబరు 15, ప్రభాతవార్త:పట్టణంలోని రేపల్లె రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో శనివారం ఆర్డీవో రామలక్ష్మి అధ్యక్షతన జరుగు వర్గ అత్యాచార నిరోధక చట్టం, మాన్యువల్ స్కావెంజర్స్ నిరోధక చట్టం అమలుకు సంబంధించిన డివిజనల్ స్థాయి కమిటీ సమావేశం జరిగింది. కమిటీ సభ్యులుగా డిఎస్పీ, తహసీల్దారులు, ఎంపీడీవోలు, డి ఎల్ పి ఓ కార్యాలయ అధికారులు, ఎస్సీవోలు హాజరయ్యారు. సమావేశంలో ఈ చట్టాల పరిధి, వాటి అమలు, ప్రజల సహకారం అధికారుల బాధ్యతలు వంటి అంశాలపై చర్చించారు.



## ఘనంగా ధర్మరక్షా దినోత్సవం

రేపల్లె, నవంబరు 15,ప్రభాతవార్త:నగరం వేంకటేశ్వర స్వామి దేవాలయం, పూడివాడ, బెల్లంవారిపాలెం గ్రామాలలో శనివారం సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ధర్మ రక్షా దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా బాలవికాస్ జిల్లా కన్వీనర్ యల్లాప్రగడ సీతాపతి మాట్లాడుతూ ధర్మరక్షణ కోసం అహర్నిశలు కృషిచేసిన స్వామి లక్ష్మణానంద సరస్వతి కొంతమంది మతఛాందసుల చేతులలో 2008లో హత్యకు గురికావడం వారిని స్మరించుకుంటూ మనందరం హిందూ ధర్మ రక్షణకు పాటుపడాలని అన్నారు. వారు మాట్లాడుతూ 12 సంవత్సరాలు హిమాలయాల్లో తపస్సు చేసి ఆధ్యాత్మిక సాధన చేసి ముముక్షువై చేరుకుని వేదాంత శాస్త్రాలు అధ్యయనం చేశారని చెప్పారు. 1965లో తిరిగి స్వస్థలం కందమాల జిల్లా అడవి ప్రాంతం చేరుకొని గిరిజన ప్రజల సామాజిక ధార్మిక అభివృద్ధి చేస్తూ గురుకుల పాఠశాలలు సంస్కృత కళాశాలలు ఏర్పాటు చేశారని ఆయన వివరించారు. ధర్మరక్షణ కోసం కృషి చేశారని సీతాపతి చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు, చింతల మురళీకృష్ణ, పరిశె శివ రాంబాబు, యల్లాపుల అంకమ్మరావు తదితరులు పాల్గొన్నారు.



## 30 లక్షలతో గ్రంధాలయ భవనం అభివృద్ధి

రేపల్లె, నవంబరు 15 (ప్రభాతవార్త): పట్టణంలోని గ్రంథాలయ భవనం అభివృద్ధికి రూ.30 లక్షలు ఖర్చు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కె.సాంబశివరావు చెప్పారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించిన పుస్తక ప్రదర్శన కార్యక్రమంలో పాల్గొన్నారు. కమిషనర్ సాంబశివరావు మాట్లాడుతూ గ్రంథాలయం భవన మరమ్మతులు పూర్తి చేయిస్తామన్నారు. ఎమ్మార్వో శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రంథాలయం అభివృద్ధికి కమిటీ సభ్యులు సహకారం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి స్వాతికుమార్, వి.జగన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## నేడు గవర్నర్ బాపట్ల కు రాక

బాపట్ల, నవంబర్15, ప్రభాతవార్త:ఒక రోజు పర్యటన నిమిత్తం రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆదివారం బాపట్ల కు రావడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ తెలిపారు. శనివారం స్థానిక జిల్లా కలెక్టరేట్ లోని న్యూ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు ఆదివారం జిల్లాలో రాష్ట్ర గవర్నర్ పర్యటన కు సంబంధించి ముందస్తు ఏర్పాట్లు పై సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశము నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర గవర్నర్ ఉదయం 10 గంటలకు రాజ్ భవన్ నుండి బయలుదేరి ఉదయం 11.45 గంటలకు గోల్డెన్ సాండ్ సూర్యలంక బీచ్ చేరుకొని విశ్రాంతి తీసుకుంటారు. అనంతరం రాత్రి 7 .55 గంటలకు శ్రీ భ్రామర అజంతా సూర్యలంక బీచ్ నుండి బయలుదేరి రాత్రి 10 రాజ్ భవన్ చేరుకుంటారన్నారు. రాష్ట్ర గవర్నర్ పర్యటనకు సంబంధించి జాయింట్ కలెక్టర్ భావన ఇంచార్జి గా ఉంటారని, గవర్నర్ ఏ డీఎస్ లకు అవసరమైన రూమ్స్ ఏర్పాటు చేయాలని ఆర్ డి ఓ, తహశీల్దార్ లకుసూచించారు. సెక్యూరిటి ,బందోబస్తు ఏర్పాట్లు పోలీసు శాఖ చూడాలని డి ఎస్ పిని ఆదేశించారు. గవర్నర్ పర్యటనకు కాన్వాయి అవసరమైన వాహనాలు ఏర్పాటు చేయాలని డి టి సి ని ఆదేశించారు. అంబులెన్స్, డాక్టర్లు ను అందుబాటులో ఉండేలా చూడాలని డి యం హెచ్ ఓ, మరియు డి సి హెచ్ ఎస్ ను ఆదేశించారు. మున్సిపాలిటీ మరియు సూర్యలంక బీచ్ పరిధిలో శానిటేషన్ చేయాలని మున్సిపల్ కమిషనర్, డి పి ఓ ను ఆదేశించారు. విద్యుత్ సరఫరా నిరంతరం ఉండేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. గవర్నర్ గారికి ఇంగ్లీష్, హిందీ న్యూస్ పేపర్స్ ను అందజేయాలని, ఐ పి ఆర్, ఏ డి కి తెలిపారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ భావన, డి ఆర్ ఓ.జి.గంగాధర్ గౌడ్, డి పి ఓ.ప్రభాకర్ రావ్, డి యం హెచ్ ఓ.డాక్టర్ విజయమ్మ, మున్సిపల్ కమిషనర్ రాఘనాధ్ రెడ్డి, డి టి సి, జిల్లా అగ్నిమాపక శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.




## రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి

కర్లపాలెం, నవంబర్15, ప్రభాతవార్త: కర్లపాలెం మండలంలో రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసు వారు అనేక చర్యలు తీసుకుంటున్నారు. ..రోడ్డు ప్రమాదం అంటే ఏదో ఆ వ్యక్తికి జరిగే నష్టమే కాదు ఒక కుటుంబం రోడ్డున పడటం... జాతీయ రహదారి నూతనంగా వేసిన తర్వాత అత్యధిక శాతం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటిలో ప్రధానంగా అతివేగం, నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం, మన ఊర్లో నడిచినట్లు జాతీయ రహదారి మీద కూడా లెక్కలేని తనంతో నడవడం, హెల్మెట్ ధరించకపోవడం వలన అనేక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. గడిచిన నెల రోజుల వ్యవధిలో దాదాపుగా పదిమంది వరకు కేవలం రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. ఇన్ని ప్రమాదాలు జరుగుతున్నా కూడా వాహనదారులు జాగ్రత్త పడకపోవటం కొసమెరుపు. పోలీసు వారు బళ్ళు ఆపితే రాజకీయ నాయకులకు, పత్రిక విలేకరులకు, తెలిసిన పోలీసులు ద్వారా రికమండేషన్ చేయించుకుని బళ్ళు వదిలించుకోవడం మంచిదే కానీ, ఫోన్ చేయమని చెప్పేవాళ్ళు కనీసం హెల్మెట్ పెట్టుకోండి జాగ్రత్తగా ఉండండి అని చెప్పకపోవడం మరింతగా వారిని ఎంతో నిర్లక్ష్యంగా ప్రమాదాలు జరగటానికి ప్రోత్సహించినట్లు అవుతుంది. రహదారి మీదకి వాహనాలతో వచ్చేవారు కనీస బాధ్యత లేకుండా వాహనాలు నడపటం, ఎంతో నిర్లక్ష్యంగా పాము మెలికలు తిరిగేటట్లు బైకులు నడపటం చూస్తుంటే అలాంటి వారికి కొన్ని కొన్ని సార్లు ప్రమాదాలు జరిగిన తప్పులేదు అనిపిస్తుంది. కానీ అలాంటి వారి వల్ల అమాయకులు కూడా ప్రాణాలు కోల్పోతున్నారు. వారి కుటుంబాలు ఎంతో దుఃఖిస్తున్నాయి. ఇటీవల సత్యవతి పేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం ప్రదేశంలో పోలీసు వారు ఒక బ్యానర్ ఏర్పాటు చేశారు. అంతేకాకుండా ప్రతిరోజు కర్లపాలెం ఎస్సై రవీంద్ర రోడ్డు ప్రమాదాల నివారణకు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా కర్లపాలెం మండల ప్రజలు జాగ్రత్తపడి ప్రాణాలు కాపాడుకోవాలని ఎస్సై రవీంద్ర తెలియజేస్తున్నారు.



## బాపట్ల జిల్లా విద్యాధికారి ఆకస్మిక తనిఖీ

కర్లపాలెం, నవంబర్15, ప్రభాతవార్త: శనివారం స్థానిక కర్లపాలెం ఉన్నత పాఠశాలను బాపట్ల జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్ పురుషోత్తం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడి స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించారు, విద్యార్థుల యొక్క స్థాయిని పరిశీలించారు అనంతరం మధ్యాహ్న భోజనాన్ని, పప్పు చెక్కలను, పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల పరిధిలో ఉన్న కే పి స్కూల్ ని, ఎంపీ రాజుపాలెం ఉన్నత పాఠశాలను కూడా ఆయన దర్శించారు పాఠశాలను ఉన్నతగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకి సూచనలు ఇచ్చారు. మరియు విద్యార్థులను సాంకేతిక విద్యను, నైతిక విద్యను కూడా విద్యార్థులకి బోధించాలని సూచించారు ఆయన వెంట మండల విద్యాశాఖ అధికారి టి యు మనోరంజని , ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి విజయశ్రీ , ఉపాధ్యాయుని ,ఉపాధ్యాయులు పాల్గొన్నారు



## కేసుల దర్యాప్తు వేగవంతంగా నిర్వహించడానికి డ్రగ్స్ డిటెక్షన్ కిట్ ఎంతో ఉపయోగం

బాపట్ల, నవంబర్15, ప్రభాతవార్త: జిల్లాలో గంజాయి రవాణా, విక్రయాలకు పాల్పడినా, కలిగి ఉన్నా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ హెచ్చరించారు. గంజాయి, హెరాయిన్ వంటి ఇతర మాదకద్రవ్యాలను సులభంగా గుర్తించేందుకు ఉపయుక్తంగా ఉండే డ్రగ్స్ డిటెక్షన్ కిట్‌ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఈగిల్ సెల్ విభాగం బాపట్ల జిల్లాకు కేటాయించారు. ఎస్పీ డ్రగ్స్ డిటెక్షన్ కిట్‌ను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో శనివారం ఓపెన్ చేసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కిట్‌ను ఏ విధంగా వినియోగించుకోవాలి, గంజాయి, హెరాయిన్ వంటి ఇతర మాదకద్రవ్యాలను ఏ విధంగా గుర్తిస్తుంది తదితర విషయాల గురించి ఆరా తీసి, క్లూస్ టీమ్ బృందానికి తగిన సూచనలు తెలిపారు. యువత ఉజ్వల భవిష్యత్తును అంధకారంగా మారుస్తున్న మాదకద్రవ్యాలను జిల్లాలో పూర్తిస్థాయిలో అరికట్టేందుకు కార్యాచరణను రూపొందించామన్నారు. క్లూస్ టీమ్ కు చెందిన సిబ్బందికి గంజాయి, హెరాయిన్ వంటి ఇతర మాదకద్రవ్యాలను కిట్ ద్వారా పరీక్షించడానికి తగిన శిక్షణ పొందడం జరిగిందన్నారు. స్థానికంగా ఉన్న క్లూస్ టీమ్ వాటిని పరీక్షించి ఇచ్చే నివేదిక ద్వారా మాదకద్రవ్యాలకు సంబంధించిన కేసుల దర్యాప్తును వేగవంతంగా నిర్వహించడానికి ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బి2 ఇన్‌స్పెక్టర్ ఎం. రాంబాబు, క్లూస్ టీమ్ ఎస్‌ఐ కె. వెంకటేష్, ఈగిల్ సెల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## సీఐఐ భాగస్వామ్య సదస్సులో పాల్గొన్న ఎంపి

బాపట్ల, నవంబర్15, ప్రభాతవార్త: విశాఖపట్నంలో జరిగిన 30వ సీఐఐ భాగస్వామ్య సదస్సులో లోక్ సభ ప్యానల్ స్పీకర్ మరియు బాపట్ల పార్లమెంట్ సభ్యులు తెన్నేటి కృష్ణప్రసాద్, రాష్ట్ర ఐటి ,విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌తో కలిసి యూఎస్ ఇండియా స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్ ఫోరం చైర్మన్ జాన్ ఛాంబర్స్‌తో సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అమెరికన్ కంపెనీలు పెట్టుబడులు పెట్టే అవకాశాలపై చర్చించారు. టెక్నాలజీ, తయారీ రంగాలలో ఏపీలో పెట్టుబడులు పెట్టడానికి ఉన్న అనుకూలతను ఎంపీ వివరించారు.



## విద్యార్థులలో సృజనాత్మకత పెంపొందించడానికి వ్యాసరచన పోటీలు దోహదం

బాపట్ల, నవంబర్15, ప్రభాతవార్త: విద్యార్థులో సృజనాత్మకతను పెంపొందించడానికి వ్యాసరచన పోటీలు దోహదపడతాయని బాపట్ల మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ డాక్టర్ బి. శరత్ బోస్ అన్నారు. మానవతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఈకో హౌస్ నందు బాలల దినోత్సవం సందర్భంగా వ్యాసరచన పోటీలులో గెలుపొందిన విజేతలకు బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు, ఈ కార్యక్రమం సంస్థ అధ్యక్షులు పంగులూరి. హరిప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో సంస్థ చైర్మన్ శరత్ బోస్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను పెంపొందించుటకు, వివిధ రకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తున్నామన్నారు. తద్వారా విద్యార్థులలో పోటీ తత్వాన్ని పెంచిన వారమోతామని అన్నారు. సంస్థ అధ్యక్షులు పంగులూరి. హరిప్రసాద్ . విజేతలకు సంస్థ చైర్మన్ డాక్టర్ బి సరిత బోస్, అధ్యక్షులు పంగులూరి. హరి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి గురజాల శ్రీనివాసరావు సంస్థ డైరెక్టర్స్ వంకాయల. హరిబాబు, కోల. సుబ్బారావు, ట్రెజరర్ సిహెచ్ కేశవులు, సంస్థ మహిళా ప్రతినిధులు జోష్న శ్రీదేవి, ప్రధానోపాధ్యాయులు వై .సత్యవతి, అమిరిశెట్టి రమాదేవి పురం. సాంబశివరావు, షేక్ హసీనా, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.




## నేడు కాపు కార్తీకవన సమారాధన

తెనాలి టౌన్ నవంబర్ 15 (ప్రభాతవార్త): 25వ సంవత్సర రజితోత్సవ కాపు కార్తీక వనసమారాధన సందర్భంగా, సంఘీయు లందరూ వేలాదిగా విచ్చేసి కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా నిర్వాహకులు తెలిపారు. నవంబర్ 16వ తేదీ, ఆదివారం ఉదయం 10 గంటలకు తెనాలి వ్యవసాయ మార్కెట్ యార్డ్ ప్రాంగణం నందు ప్రారంభమవుతుందని, అనంతరం సాంస్కృతిక కార్యాక్రమాల్లో భాగంగా, ఒంగోలు వాస్తవ్యులు, నవరసనాయికిఎస్ వేదవతి భగవతారిణి చే హరికథా కార్యక్రమం జరుగుతుందని, తదుపరి చెరుకుపల్లి వాస్తవ్యులు నంది అవార్డు గ్రహీత మొగిలిపువ్వు వెంకటసుబ్బయ్య నాయుడు బృందంచే, భూకైలాస్ నాటక ప్రదర్శన జరుగుతుందని, అనంతరం అమ్మ డాన్స్ ఇనిస్ట్యూట్ డాన్స్ మాస్టర్ బృందం వారిచే క్లాసికల్ మరియు వెస్టన్ డాన్స్ మరియు కూచిపూడి భరతనాట్యములు జరుగునని నిర్వాహకులు తెలిపారు. మధ్యాహ్నం నుంచి సభా కార్యక్రమము మరియు సమారాధన విందు ప్రారంభమవుతుందని, కాపు వన సమారాధన కమిటీ సభ్యులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో, విజయవాడ శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వారి దేవస్థానం పాలకమండలి సభ్యులు, తోటకూర వెంకటరమణ రావు, న్యాయవాదులు హరిదాసు గౌరీ శంకర్, నన్నపనేని రాంబాబు, వేణు, యర్రు వెంకయ్య నాయుడు, మెట్రో శ్రీనివాస్, శిల్పాల శ్రీనివాస్, కోట అక్కేశ్వరరావు, మామిడి బత్తుల సుబ్రహ్మణ్యం, బెల్లపు యశ్వంత్, పోలిశెట్టి సాయి, కర్ణాటక మహేష్, కోట ప్రసాద్, కొండారు వాసు, కొసనా రాంబాబు, సూరిబాబు మరియు కాపు సంఘ నాయకులు పాల్గొన్నారు.



## వ్యక్తిగత పరిశుభ్రత తోనే ఆరోగ్యాంధ్ర సాధ్యం: మున్సిపల్ కమీషనర్.

తెనాలి మున్సిపాలిటీ నవంబర్ 15 (ప్రభాతవార్త): పురపాలక సంఘం ఆధ్వర్యంలో, స్వచ్ఛఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా, ప్రతినెలా మూడవ శనివారం నిర్వహించే, స్వచ్ఛతా కార్యక్రమాన్ని, పట్టణంలోని జెఎంజె కాలేజీ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ తాడిబోయిన రాధిక మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ వ్యక్తిగత మరియు సామాజిక పరిశుభ్రత పాటించాలని, వ్యక్తిగత పరిశుభ్రత తోనే ఆరోగ్యకరమైన జీవితం పొందగలుగుతామని కావున ప్రతి ఒక్కరూ పరిశుభ్రత విషయంలో ఒక సామాజిక బాధ్యతగా తోటి వారికి ఆదర్శంగా నిలిచి స్వచ్ఛభారత్ కి సహకరించాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు, జేఎంజె కాలేజీ ప్రిన్సిపాల్, మరియు అధ్యాపకులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.




## ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిన సూపర్ స్టార్ కృష్ణ

తెనాలి టౌన్ నవంబర్ 15 (ప్రభాతవార్త): తెలుగు చలనచిత్ర సీమలో సూపర్ స్టార్ గా గుర్తింపు తెచ్చుకొని, ప్రజల అభిమానాన్ని చూరగొన్న, దివంగత సూపర్ స్టార్ కృష్ణ, మరణించి మూడు సంవత్సరములు అయినా, ఇంకా అభిమానుల మనసుల్లోనే నిలిచారని సూపర్ స్టార్ కృష్ణ అభిమాన సంఘం నాయకులు తాడిబోయిన హరిప్రసాద్ పేర్కొన్నారు. శనివారం సూపర్ స్టార్ కృష్ణ మూడవ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని విఎస్ఆర్ కాలేజీ వద్ద ఉన్న తెనాలి బండ్ పై కృష్ణ కాంస్య విగ్రహానికి పట్టణంలోని ఆయన అభిమానులు, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కృష్ణ అభిమానులైన తాడిబోయిన హరిప్రసాద్ సినీ మాటల రచయిత బుర్రా సాయి మాధవ్, కాళిదాసు సత్యం, సాయి, జాకీర్, శ్రీనివాస్, కడియాల నందకిషోర్, హరి, కటారి వాసుదేవ నాయుడు, ప్రతాప్, సంపత్, మైకు మురళి, కోటి, చుక్కపల్లి హరిబాబు, మహాత్మా గాంధీ సేవాశాంతి ఆశ్రమ నిర్వాహకులు వజ్రాల రామలింగాచారి, పెద్దఎత్తున సూపర్ స్టార్ కృష్ణ అభిమానులు పాల్గొన్నారు.



## తెలుగుజాతి గుండెచప్పుడు ఎన్టీఆర్: విగ్రహావిష్కరణలో ఎమ్మెల్సీ ఆలపాటి

తెనాలి టౌన్ నవంబర్ 15 (ప్రభాతవార్త): సూర్యచంద్రులు ఉన్నంతవరకు స్వర్గీయ నందమూరి తారక రామారావు పేరు చరిత్రలో చిరస్థాయిగా నిలిచి ఉంటుందని, ఆయన తెలుగుజాతి గుండె చప్పుడు అని, శాసనమండలి సభ్యులు, తెనాలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని చినరావూరు రావిచెట్టు సెంటర్ వద్ద ఏర్పాటుచేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎన్టిఆర్ విగ్రహ ఏర్పాటుకు కృషి చేసిన నిర్వాహకులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మహమ్మద్ కుద్దూస్ ప్రధాన కార్యదర్శి వసంతం అశోక్ రాష్ట్ర పద్మశాలి వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ జొన్నాదుల మహేష్ అలాగే పార్టీ సీనియర్ నాయకులు కేసన కోటేశ్వరరావు, వాసిరెడ్డి సులోచన, పలువురు తెలుగు మహిళలు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు.



## సిఐటియు జిల్లా మహాసభలను జయప్రదం చేయండి: నేతల పిలుపు

తెనాలి మున్సిపాలిటీ నవంబర్ 15 (ప్రభాతవార్త): సీఐటీయూ గుంటూరు జిల్లా 11వ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ, సిఐటియు జిల్లా కార్యదర్శి కే.బాబు ప్రసాద్ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలో నిర్వహించిన ఏపీ బేవరేజస్ ముఠా కార్మికసంఘం జనరల్ బాడీ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. నవంబర్ 23,24 తేదీల్లో తాడేపల్లి లో జిల్లా మహాసభలు జరుగుతాయని, ప్రతికార్మిక లేదా యేదో ఒక కార్మిక సమస్యలపై నిరంతరము పోరాడే సంఘం సీఐటీయూ అని చెప్పారు. జిల్లాలో 20 మంది సిఐటియు నేతలు పూర్తికాలం కార్మికుల సమస్యలపై పోరాటాలు చేసే నాయకులు వున్నారనిజిల్లా వ్యాప్తంగా అనేక కార్మిక సమస్యలపై దృష్టిపెట్టి, వారు చిత్తశుద్ధి తో పనిచేస్తున్నట్లు తెలిపారు. సమస్యల పరిష్కారానికి కార్యాచరణను రూపొందించు కొనుటకు జిల్లా వ్యాప్తంగా 250 మంది ప్రతినిధులు మహా సభలలో పాల్గొంటారని చెప్పారు. 23 సాయంత్రం 4 గంటలకు తాడేపల్లిలో కార్మిక ప్రదర్శన వుంటుందని చెప్పారు. ఈ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ తెనాలి డివిజన్ కార్యదర్శి షేక్.హుస్సేన్ వలి, ముఠా కార్మికసంఘం నాయకులు కే.మల్లికార్జునరావు ఎన్.చిన్న గోపాలరావు, వి.వెంకట రావు, పెరుమాక మురళి, మాథాల శ్రీను, అరిగి డానియల్, ఎన్.మోహనరావు, ఏ.రాంబాబు, పి.శివనాగ రాజు, షేక్.మస్తాన్, షేక్.ఖాశిం, జె.కొండయ్య, జి. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


## గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా పుస్తకప్రదర్శన:

తెనాలి మున్సిపాలిటీ నవంబర్ 15 (ప్రభాతవార్త): 58వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా, శనివారం పట్టణంలోని కొత్తపేటలో గల బాలల మహిళా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీడీవో అత్తోట దీప్తి మాట్లాడుతూ, గ్రంథాలయాలు ఆధునిక విజ్ఞాన భాండాగారాలని, ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం నేర్చుకోవాలని, దీని ద్వారా వ్యక్తిత్వ వికాసం, సమాజంలో అసమానతలు తెలుసుకోవడానికి, మరియు మహనీయుల చరిత్రలు, మానసిక వికాసానికి ఉపయోగపడే పుస్తకాలు చదవటం వలన ప్రతి ఒక్కరూ విజ్ఞానాన్ని సమకూర్చుకోవటానికి అవకాశం ఏర్పడుతుందని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ పుస్తక ప్రదర్శనలో ఉన్న పుస్తకాలను ఆసక్తిగా తిలకించారు.



## శ్రీ సీతారాముల దీపారాధన ధ్వజ పున: ప్రతిష్ఠాపన

తెనాలి టౌన్ నవంబర్ 15 (ప్రభాతవార్త): రూరల్ మండల గ్రామం ఎరుకలపూడి లోని రామాలయంలో, శనివారం శ్రీ సీతారామచంద్రస్వామి వారి అఖండ దీపారాధనధ్వజ పునఃప్రతిష్ట కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. శుక్రవారం స్వామివారి ఊరేగింపుతో మొదలైన ఈ ఉత్సవాల్లో గ్రామస్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. అనంతరం రెండోరోజు శనివారం హోమాలు, అభిషేకాలు మరియు పూజా కార్యక్రమాలతో, వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య పూజాకార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, పెద్దఎత్తున గ్రామస్తులు పాల్గొన్నారు.



## చిల్డ్రన్ పార్కును ప్రారంభించిన ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి, నవంబర్ 15 ప్రభాతవార్త : పట్టణంలోని మెయిన్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన చిల్డ్రన్ పార్కును శనివారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ప్రారంభించారు. అయ్యప్పస్వామి



దేవాలయంలో స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ స్వామివారి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఆయన వెంట పార్టీ జిల్లా, నియోజకవర్గ, పట్టణ నాయకులు ఉన్నారు.

## నేడు బ్రాహ్మణ కార్తీక వన సమారాధన



సత్తెనపల్లి, నవంబర్ 15 ప్రభాతవార్త : సత్తెనపల్లి బ్రాహ్మణ సేవా సంఘం గౌరవ వాధ్యక్షులు బి.వి.ఎల్.ఎన్.రావు ఆధ్వర్యంలో ఆదివారం బ్రాహ్మణ వన కార్తీక సమారాధన ఘనంగా నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు గోవరాజు విజయ్‌కుమార్ తెలియజేశారు. సత్యధ్యాన మందిరం కమిటీ ఈ కార్యక్రమానికి సహకారం అందిస్తుందన్నారు. బ్రాహ్మణ సేవా సంఘం, సత్యధ్యాన మందిరం సంయుక్తంగా రజితోత్సవ వేడుకలను ఏర్పాటు చేసిందన్నారు. సామూహిక గోపూజ కార్యక్రమం, రుద్రాభిషేకం, సభ జరుగుతాయన్నారు. సత్తెనపల్లి పట్టణ, పరిసర ప్రాంతాల్లో ఉన్న బ్రాహ్మణ సంఘీయులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## స్వర్ణాంధ్ర, స్వచ్ఛఆంధ్ర కార్యక్రమం



సత్తెనపల్లి, నవంబర్ 15 ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ, స్వచ్ఛఆంధ్ర కార్యక్రమాన్ని శనివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. కమిషనర్ ఆనంద్‌కుమార్ ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. వ్యక్తిగత పరిశుభ్రత ముఖ్యమన్నారు. బహిరంగ మలమూత్ర విసర్జనను నివారించాలన్నారు. తరచుగా చేతులు శుభ్రం చేసుకోవడం వలన అంటువ్యాధులు తగ్గుతాయన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.విజయసారధి, మెప్మా, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## దాతల సహకారంతో నిత్యావసర సరుకుల పంపిణీ

సత్తెనపల్లి, నవంబర్ 15 ప్రభాతవార్త : దాతల సహకారంతో పట్టణంలో శనివారం రూ.30 వేల విలువ చేసే నిత్యావసర సరుకులను 40 కుటుంబాలకు అందజేశారు. గంజి వీరాస్వామి చేస్తున్న సేవా కార్యక్రమాలను పలువురు అభినందించారు. ప్రముఖ న్యాయవాది పిన్నమనేని పాములయ్య మాట్లాడుతూ ఫణిదం సొసైటీ వద్ద ఈ కార్యక్రమాలను నిర్వహించారు. జి.వెంకట్రావు జ్ఞాపకార్థం జి.అనీల్‌కుమార్ ఈ కార్యక్రమానికి ఆర్ధిక సహకారం అందజేశారు.

## ఘనంగా టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు గంగినేని చిన్న జన్మదిన వేడుక


పెదకూరపాడు (నవంబర్ 15 ప్రభాతవార్త ) : పెదకూరపాడు నియోజకవర్గ తెలుగునాడు స్టూడెంట్ ఫెడరేషన్ అధ్యక్షులు, పెదకూరపాడు మండల తెలుగు యువత క్రియాశీలక నాయకులు లింగంగుంట్ల గ్రామానికి చెందిన గంగినేని వెంకటేశ్వర్లు(చిన్న) జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు... ఈ సందర్భంగా చిన్న పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు... పెదకూరపాడు



సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఆసుపత్రిలో రోగులకు వైద్య సేవలు, మందులు పంపిణికి వీలుగా ఓపి చీటీలు, స్టేషనరీ ని సమకూర్చారు. వైద్య సేవలు పొందెందుకు వచ్చిన రోగులు, ఇన్ పేషెంట్లకు పండ్లు, రొట్టె పంపిణీ చేశారు. లింగంగుంట్ల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు విద్యా సామగ్రి ని పంపిణీ చేశారు. ఆసుపత్రిలో స్టేషనరీ అందించిన గంగినేని చిన్నాకు వైద్య సిబ్బంది, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ అంద్ర ప్రసాద్ శాలువాతో సత్కరించారు... కేకును ఏర్పాటు చేసి చిన్నా చేత కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు... కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు వడ్లమూడి చిన్న, తెలుగు యువత నాయకులు మేదరమెట్ల సామిత్ చౌదరి, పెదకూరపాడు మండల తెలుగు యువత నాయకులు గల్లా శివ, ఏటుకూరి అరవింద్, బోడపాటి నాని తదితరులు ఉన్నారు...

## పద్మభూషణ్ నటశేఖర కృష్ణకు ఘనంగా నివాళులర్పించిన అచ్యుత్ ఫౌండేషన్ ట్రస్ట్ ఫౌండర్ కాండ్రు సాంబయ్య.

క్రోసూరు(నవంబర్ 15 ప్రభాతవార్త): పద్మభూషణ్ నటశేఖర కృష్ణ మూడో వర్ధంతి సందర్భంగా శనివారం క్రోసూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదురుగా ఉన్న ఘటమనేని శివరామకృష్ణ విగ్రహమునకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించిన కృష్ణ ఫ్యాన్స్ సభ్యులు గార్లపాటి దాసు. కాండ్రు సాంబయ్య. చిలక ప్రభాకరరావు. చిలక బాబురావు పూలమాలలు వేసి ఘనంగా



నివాళులు అర్పించినారు. అనంతరం గార్లపాటి దాసు మాట్లాడుతూ కృష్ణ తెలుగు చిత్ర పరిశ్రమను అభివృద్ధి చేయాలని దృఢ సంకల్పంతో ఆనాడు తెలుపు నలుపు రంగు సినిమాను కలర్లో నిర్మించటం. మరియు ప్లాట్ గా ఉన్న సినిమాను స్కోప్ గా తీయటంలోను. మరియు స్టీరియో ఫోనిక్స్ సౌండ్ సిస్టం తీసుకురావడమే కాకుండా 1970 నుండి 1980 మధ్యకాలంలో ఆయన నటించిన సినిమాలకు గాను చలనచిత్ర పరిశ్రమ సూపర్ స్టార్ బిరుదును ప్రధానం చేసినారు. ఒకే సంవత్సరంలో కృష్ణ నటించిన 18 సినిమాలు విడుదల కూడా ప్రపంచ రికార్డు చెక్కింది. అంతేకాకుండా మోసగాళ్లకు మోసగాడు ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ అయిన తెలుగు చిత్రముగా రికార్డు కెక్కింది. కృష్ణ నటుడే కాకుండా నిర్మాతగాను దర్శకుడుగాను శని పరిశ్రమకు సేవలు అందించినందుకు గాను కేంద్ర ప్రభుత్వం కృష్ణకు పద్మభూషణ్ అవార్డు ఇవ్వడం తెలుగు చిత్ర పరిశ్రమలు కూడా సంచలనమే. కృష్ణ అంటే సాహసానికి మారుపేరు. ఆయన చిత్ర పరిశ్రమకు ఎనలేని సేవలందించి చిత్ర పరిశ్రమను సరికొత్త పొంతలు తొక్కించిన ఘటమనేని కృష్ణకు ఘనంగా నివాళులు అర్పించినారు.

## క్రోసూరు మార్కెట్ యార్డులో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రవీణ్

క్రోసూరు, నవంబర్ 15 (ప్రభాతవార్త): క్రోసూరు మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ప్రత్తి కొనుగోలు కేంద్రాన్ని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ గారు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు, వ్యవసాయ శాఖ సిబ్బందితో కలిసి ప్రత్తి తేమశాతం, నాణ్యతను పరిశీలించి కొనుగోలు ప్రక్రియను ప్రారంభించారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ..వ్యవసాయాన్ని లాభదాయకంగా



మార్చేందుకు కూటమి ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. రైతుల ప్రయోజనార్థం ప్రత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, మద్దతు ధరకే కొనుగోలు చేస్తూ రైతులకు భరోసా కల్పిస్తున్నా మని చెప్పారు.గత ప్రభుత్వ పాలనలో ప్రత్తి రైతులు కనీస మద్దతు ధర అందక తీవ్ర నష్టాలు చవిచూశారని గుర్తుచేశారు. ప్రస్తుతం ప్రభుత్వం నిర్ణయించిన ..8110 మద్దతు ధరతో ప్రత్తి కొనుగోలు జరుగుతుండటంపై రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని అన్నారు.కార్యక్రమంలో మార్కెట్ యార్డు అధికారులు, వ్యవసాయ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు

## ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

వేమూరు నవంబరు 15 (ప్రభాతవార్త) : ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎక్సైజ్ సిఐ రవి తెలియజేశారు. స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివీస్ కార్యక్రమంలో భాగంగా శనివారం వేమూరు బాపట్ల జిల్లా ఎక్సైజ్ అధికారి



ఆదేశాల మేరకు వేమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివీస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో టాయిలెట్లను శుభ్రపరిచి కళాశాల పరిసరాలను శుభ్రపరిచారు. ఈ సందర్భంగా పరిశుభ్రతపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై శ్రీరామ్ శ్రీకాంత్, కళాశాల ప్రిన్సిపల్ గాయత్రి, అధ్యాపకులు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

## అనంతవరం గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన



కొల్లూరు, నవంబరు 15 (ప్రభాతవార్త) : 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా గ్రంథాలయ శాఖ అధికారిని జి.కనకదుర్గ నిర్వహించారు. ఈ సందర్భంగా అనంతవరం ఎల్ఈ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.పద్మజ విద్యార్థినీ, విద్యార్థులకు పుస్తక పఠనంపై అవగాహన కల్పించి విద్యార్థినీ, విద్యార్థులు ప్రతిరోజు గ్రంథాలయంను సందర్శించి తమ జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని, విద్యార్థులకు గ్రంథాలయాలు విజ్ఞాన సముపార్జక కేంద్రాల వంటివి అన్నారు. అనంతరం సబ్ జూనియర్స్‌కు గ్రంథాలయాలు విజ్ఞాన సముపార్జన కేంద్రాల వంటివి అన్నారు. అనంతరం సబ్ జూనియర్స్‌కు గ్రంథాలయాలు వాటి ఉపయోగాలు, జూనియర్స్‌కు గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు, సీనియర్స్‌కు డిజిటల్ గ్రంథాలయాలు అనే అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను పి.పద్మజ, గ్రంథాలయ అధికారి జి.కనకదుర్గ పర్యవేక్షించారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ పాఠకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కొల్లూరు గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన

కొల్లూరు, నవంబరు 15 (ప్రభాతవార్త) : 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం కొల్లూరు శాఖ గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనను కె.సంధ్యా, పి.హెచ్.సి. వైద్యురాలు ప్రారంభించారు. తదనంతరం సంధ్యా



విద్యార్థిని, విద్యార్థులకు పుస్తక పఠనంపై అవగాహన కల్పించి విద్యార్థినీ, విద్యార్థులు ప్రతిరోజు గ్రంథాలయంను సందర్శించి తమ జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని, విద్యార్థులకు గ్రంథాలయాలు విజ్ఞాన సముపార్జక కేంద్రాల వంటివని అన్నారు. అనంతరం సబ్ జూనియర్స్‌కు గ్రంథాలయాలు వాటి ఉపయోగాలు, జూనియర్స్‌కు గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు మరియు సీనియర్స్‌కు డిజిటల్ గ్రంథాలయాలు అనే అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను సిహెచ్‌ఓ కె.విజయలక్ష్మీ, హెల్త్ సూపర్‌వైజర్ పి.రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులు పి.అనిల్‌కుమార్, మరియు గ్రంథాలయ అధికారి వై.రాంబాబు పర్యవేక్షించారు. కార్యక్రమానికి అధిక సంఖ్యలో విద్యార్థిని, విద్యార్థులు మరియు గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

## సంస్కృతి,సంప్రదాయాలు మరచిపోకుండా భద్రపరిచే బాండాగారం గ్రంథాలయం

కొల్లిపర,నవంబరు 16 ప్రభాతవార్త: మన సంస్కృతి,సంప్రదాయాలు మరచిపోకుండా భద్రపరిచే బాండాగారం గ్రంథాలయం అని గ్రంథాయాధికారి బి.సాంబశివనాయక్ పేర్కొన్నారు.మండలంలోని





తూములూరు,మున్నంగి,వల్లభాపురం శాఖా గ్రంథాలయాలలో గ్రంథాలయాధికారులు సత్యమ్మ,జ్యోతి,బి.నాగసాంబశివనాయక్ పర్యవేక్షణలో జరుగుతున్న 58 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా శనివారం వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు పుస్తక ప్రదర్శన నిర్వహించారు.వల్లభాపురం గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో సాంబశివనాయక్ మాట్లాడుతూ చిత్రలేఖనం పోటీలు నిర్వహించటం ద్వారా విద్యార్థులలో దాగిఉన్న సృజనాత్మకశక్తిని వెలికితీయవచ్చున్నారు.ఆయా కార్యక్రమాలలో గ్రామస్తులు.పాఠకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## వైసిపి విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ

తెనాలి మున్సిపాలిటీ, నవంబర్ 15 (ప్రభాతవార్త): మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం పర్యవేక్షణలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు.శనివారం పట్టణంలోని,రైల్వే స్టేషన్ సెంటర్ కృష్ణుని గుడి వద్ద వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణలో భాగంగా విద్యార్థి విభాగం వారు



కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా నియోజకవర్గ సమన్వయకర్త అన్నాబత్తిని శివకుమార్ పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ విద్యార్థి విభాగం అధ్యక్షులు నిట్ట బాలు,రూరల్ అధ్యక్షులు నూకతోటి అభిషేక్, కొల్లిపర అధ్యక్షులు దర్శి రవితేజ,విద్యార్థి నాయకులు నలుకుర్తి ఉదయ్ కాంత్, ఉడుముల శ్రీనివాస్ రెడ్డి,దూల మణికంఠ వాగోలు అభి,పాముల అనుదీప్, సాయికిరణ్,విజయ్,రాఘవ నాగమల్లేశ్వరరావు లతోపాటుగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పేరం సంజీవరెడ్డి, శ్రీనివాసరావు,కుర్ర జస్వంత్ యాదవ్,కామాదుల స్వామి, పినపాటి రవి కిరణ్,షేక్ దుబాయ్ బాబు,సయ్యద్ గౌస్, అక్కిదాసు కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

## అచ్చంపేట సాయి తేజ నగర్‌లో 9వ కార్తీక కోటి దీపోత్సవం

అచ్చంపేట, నవంబర్ 15 (ప్రభాతవార్త):భగవాన్ శ్రీ సత్య సాయి బాబా వారి దివ్య అనుగ్రహ ఆశీస్సులతో, స్వామివారి శతజయంతి ఉత్సవాల భాగంగా నవమ (9వ) కార్తీక కోటి దీపోత్సవము అచ్చంపేట, సాయి తేజ నగర్‌లో శనివారం సాయంత్రం ఘనంగా జరిగినది. కాశి క్షేత్రం నుండి తీసుకొచ్చిన తేనుకొండపట్టణం దివ్య శివలింగారాధనకు 108 పత్రికల ద్రవ్యములతో అభిషేకాలు భక్తుల స్వస్త్యవాలతో జరిగయి ఈ మహోత్సవం భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి ఆశీస్సులతో, భక్తుల సమక్షంలో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.స్వామివారి కరుణకటాక్షంతో కార్యక్రమానికి విచ్చేసిన



భక్తులందరికీ శాంతి, శ్రేయస్సు ప్రసాదమగును. గ్రామ శ్రేయోభివృద్ధి, సామూహిక శాంతి కోసమే ఈ మహోత్సవం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమం శ్రీ సత్యసాయి సమాజ సేవా సమితి, యువ విభాగం యూత్ కమిటీ,సమితి అధ్యక్షులు, సాయి తేజ నగర్ తిరుపతి రాంబాబు సుధా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు

## రొంపిచర్లలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

రొంపిచర్ల, నవంబరు 15 ప్రభాతవార్త : రొంపిచర్ల గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను రెండవ రోజు శనివారం నిర్వహించారు. గ్రంథాలయ అధికారి కేసరి రమణారెడ్డి పుస్తక పఠనంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే మాతృభాషపై ప్రతి ఒక్కరూ పట్టు సాధించాలన్నారు. ఇతిహాసాలు, నీతికథలు చదవాలన్నారు. ప్రపంచంలో 81 మిలియన్ల మంది తెలుగు మాట్లాడుతున్నారని తెలిపారు.

## జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

నకరికల్లు నవంబరు 15 ప్రభాతవార్త : స్థానిక శాఖా గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను రెండవ రోజు శనివారం నిర్వహించారు. గ్రంథాలయ అధికారి పాశం నారాయణరెడ్డి పుస్తక పఠనంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ వారోత్సవాలు ఈ నెల 14 నుండి 20వ తేదీ వరకు జరుగుతాయన్నారు. ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలకు వచ్చి పుస్తకాలు చదివి విజ్ఞానాన్ని పెంచుకోవాలని తెలియజేశారు.

## శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన

పెదకూరపాడు, నవంబర్ 15 ప్రభాతవార్త : పెదకూరపాడు శాఖా గ్రంథాలయంలో శనివారం పుస్తక ప్రదర్శనను గ్రంథాలయ అధికారి షేక్.మహ్మద్ ఆలీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జెడ్పీ స్కూల్ హెచ్‌ఎం కె.వెంకటరమణ హాజరై పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు. విద్యార్థులు



గ్రంథాలయాలలో పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని సూచించారు. అన్ని రంగాలకు సంబంధించిన విజ్ఞానం గ్రంథాలయాలలో లభిస్తుందన్నారు. అబ్దుల్ కలాం వంటి వారు తమ జీవితంలో పుస్తకాలకే ఎక్కువ విలువను ఇచ్చారని, అందుకే వారు గొప్ప స్థాయికి వెళ్ళారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది తిరుమలేశ్వరి, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎన్‌సిసి క్యాడెట్స్‌ను అభినందించిన కలెక్టర్

నకరికల్లు, నవంబరు 15ప్రభాతవార్త : నరసరావుపేట ఇంజనీరింగ్ కాలేజ్‌కు చెందిన ఎన్‌సిసి క్యాడెట్స్ మణికుమార్, లిఖిత నందినిలను కలెక్టర్ కృతికాశుక్లా శనివారం అభినందించారు. వివిధ విభాగాలలో



ప్రతిభ చూపడం ద్వారా జాతీయస్థాయి పోటీలలో వీరు పాల్గొనడం జరిగిందని పేర్కొన్నారు. ఎన్‌సిసి అధికారి మేడికొండ రాజేష్ మాట్లాడుతూ గుంటూరు గ్రూప్ పరిధిలోని ఆరు జిల్లాల ఎన్‌సిసి క్యాడెట్స్ పోటీ పడినా అద్భుతంగా తమ విద్యార్థులు రాణించారని, ఏఐటిఎస్‌సి-2025కు ఎంపికయ్యారని తెలిపారు. కళాశాల ఛైర్మన్ మిట్టపల్లి కోటేశ్వరరావు, వైస్ ఛైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి, కార్యదర్శి మిట్టపల్లి రమేష్‌లు విద్యార్థులను అభినందించారు.

## పల్నాడు జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛదివాస్

నరసరావుపేట క్రైం, నవంబరు 15ప్రభాతవార్త : పల్నాడు జిల్లా వ్యాప్తంగా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛదివాస్ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశాల మేరకు అధికారులు, సిబ్బంది నిర్వహించారు. పోలీస్‌స్టేషన్‌లలో, జిల్లా ఎస్పీ ప్రధాన కార్యాలయంలోనూ ఈ కార్యక్రమాలు జరిగాయి. స్వర్ణాంధ్ర - స్వచ్ఛఆంధ్ర ప్రాధాన్యతను అధికారులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ ఆర్.ఐ. గోపినాథ్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

**వ్యభిచార కేంద్రంపై పోలీసుల దాడి...**

వ్యభిచార కేంద్రంపై వన్‌టౌన్ ఎస్.ఐ. అరుణారెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. వ్యభిచారం చేసే ముఠాను అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఎస్ఎన్ కళాశాల సమీపంలో ఓ ఇంట్లో పి.పవన్‌కుమార్, ఇజ్రాయేలు వేరే ప్రాంతం నుండి మహిళలను తీసుకువచ్చి వ్యభిచారం చేస్తున్నట్లు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. నిందితులను అదుపులోకి అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు.

## దేవాలయ నిర్మాణానికి భక్తుల విరాళం

రొంపిచర్ల, నవంబరు 15ప్రభాతవార్త : నరసరావుపేట పట్టణంలోని కోట సెంటర్ పులుపులవారి వీధిలో వేంచేసియున్న శ్రీ వీరాంజనేయ సహిత యోగానంద లక్ష్మీనరసింహస్వామి దేవాలయ రాతి నిర్మాణానికి భక్తులు విరాళం అందజేశారు. వివరాలను ఆలయ కమిటీ సభ్యులు వనమా సాంబశివరావు, వనమా కృష్ణ, ఎస్.వి.రమణారావు, కొవ్వూరు శివశ్రీనుబాబు, బత్తుల విష్ణు తెలియజేశారు. హైదరాబాద్‌కు చెందిన తిరుమలశెట్టి అమర్నాధ్, జి.విజయ్‌కుమార్ - రాజ్యలక్ష్మి, కార్తీవిఘ్నేష్, చరితశ్రీలు రూ.1,01,116లను అందజేసినట్లు తెలియజేశారు. అదే విధంగా చిత్తూరు జిల్లా పుంగునూరుకు చెందిన జి.ఆర్.దత్తాత్రేయ రూ.11,116లను విరాళంగా అందజేసినట్లు తెలిపారు. భక్తులకు స్వామివారి దర్శనంతో పాటు శేషవస్త్రం, తీర్థ ప్రసాదాలను అందజేశారు.

## శాఖా గ్రంథాలయంలో పుస్తక పఠనంపై అవగాహన సదస్సు

నరసరావుపేట టౌన్, నవంబరు 15 ప్రభాతవార్త : నరసరావుపేట శాఖా గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను రెండవ రోజు శనివారం నిర్వహించారు. గ్రంథాలయ అధికారి యడ్లపాటి రాధ పుస్తక పఠనంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మాతృభాషపై ప్రతి ఒక్కరూ పట్టు సాధించాలన్నారు. ఇతిహాసాలు, నీతికథలు చదవాలన్నారు. ప్రపంచంలో 81 మిలియన్ల మంది తెలుగు మాట్లాడుతున్నారని తెలిపారు. ఈ నెల 16న విద్యార్థులకు వ్యాసరచన పోటీలు జరుగుతాయని గ్రంథాలయ అధికారి యడ్లపాటి రాధ తెలియజేశారు.

## గ్రంథాలయాలు విజ్ఞాన బాండాగారాలు

వేమూరు నవంబరు 15 (ప్రభాతవార్త) : రేపటి కోసం గ్రంథాలయాలను సద్వినియోగపర్చుకుని విద్యార్థులు తమ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఎంపీడీవో రవికుమార్ తెలియజేశారు. 58వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం వేమూరు శాఖ గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనలను ఆయన తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన అనేక రకమైన పుస్తకాలు గ్రంథాలలో లభిస్తున్నాయన్నారు. విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని గుర్తు చేశారు. ఆయనతో పాటు గ్రంథాలయ అధికారి కంచర్ల శ్రీనివాసరావు, మండల విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, డిప్యూటీ ఎంపీడీవో కోటేశ్వరరావు, ఏపిఎం శోభన్, పంచాయితీ ఇన్‌చార్జి కార్యదర్శి నవరాణి, తదితరులు పాల్గొన్నారు.




# డీఎంకెతోనే కాంగ్రెస్ జట్టు

## తమిళనాట పాతపొత్తులతోనే కొనసాగించాలని నిర్ణయం



**చెన్నై,నవంబరు 15:** బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఎదురైన ఘోర పరాభవం, తమిళనాడు రాజకీయ సమీకరణాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ ఫలితాల నేపథ్యంలో డీఎంకే కూటమి నుంచి బయటకు వచ్చి కొత్త ప్రయోగాలు చేసే ఆలోచనను కాంగ్రెస్ అధిష్ఠానం దాదాపుగా విరమించుకున్నట్లు తెలుస్తోంది. దీంతో 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల నాటికి కాంగ్రెస్‌ను తమ కూటమిలోకి తీసుకురావాలని ఆశించిన నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళ వెట్రి కళగం (టివికె) పార్టీకి పెద్ద నిరాశే ఎదురైంది. బీహార్‌లో పుంజుకోవాలని భావించిన కాంగ్రెస్ పార్టీకి అనూహ్యమైన దెబ్బ తగలడంతో ఇప్పటికే బలంగా ఉన్న పొత్తులను కొనసాగించడమే మేలని పార్టీ కేంద్ర నాయకత్వం భావిస్తోంది. తమిళనాడులో 2019 నుంచి డీఎంకేకాంగ్రెస్ కూటమి వరుస విజయాలు సాధిస్తోంది. పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో ఈ కూటమి మెరుగైన ఫలితాలు రాబట్టింది. జాతీయ స్థాయిలో పార్టీ వ్యూహాలను పునఃసమీక్షించుకుంటున్న తరుణంలో తమిళనాడులో విజయవంతమైన కూటమిని వదులుకోవడానికి అధిష్ఠానం సిద్ధంగా లేదని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. మరోవైపు కాంగ్రెస్‌ను కలుపుకొని డీఎంకే, అన్నాడీఎంకేలకు ప్రత్యామ్నాయంగా బలమైన కూటమిని నిర్మించాలని టీవీకే ఆశించింది. నటుడు విజయ్ ఇటీవల స్థిరమైన సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేయాలని పిలుపునివ్వడంతో కాంగ్రెస్ తమతో కలుస్తుందని టీవీకే నేతలు గట్టిగా నమ్మారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వంపై అసంతృప్తిగా ఉన్న కొందరు ఎమ్మెల్యేలు, ఎంపీలు, జిల్లా స్థాయి నేతలు టీవీకే వైపు చూస్తున్నారనే ప్రచారం కూడా జరిగింది. తమ కూటమిలో చేరితే ఎక్కువ సీట్లు, మంత్రి పదవులు దక్కుతాయని వారు భావించారు. రాష్ట్రవ్యాప్తంగా తమకు 26 శాతం ప్రజాదరణ ఉందని టీవీకే అంతర్గత సర్వేలు చెబుతున్నాయని, కాంగ్రెస్ తోడైతే త్రిముఖ పోరులో గట్టి పోటీ ఇవ్వొచ్చని ఆ పార్టీ నేతలు అంచనా వేశారు. విజయ్, రాహుల్ గాంధీ మధ్య 2012 నుంచి ఉన్న స్నేహం కూడా పొత్తు చర్చలకు దోహదపడుతుందని భావించారు. అయితే, బీహార్ ఫలితాలతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. కొత్త ప్రయోగాలతో రిస్క్ తీసుకునే బదులు, స్థిరమైన, విజయవంతమైన డీఎంకే కూటమిలోనే కొనసాగడం ఉత్తమమని కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం.



## 100లోపు మెజార్టీతో గెలిచిన అభ్యర్థులు

**పాట్నా,నవంబరు 15:** బీహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో పలు నియోజకవర్గాల్లో పోరు చివరి వరకు ఉత్కంఠగా సాగింది. చివరి రౌండ్ వరకు హోరాహోరీగా సాగి అతి తక్కువ మెజార్టీతో గెలుపొందిన అభ్యర్థులు ఉన్నారు. మూడు స్థానాల్లో అభ్యర్థులు 100 లోపు మెజార్టీతో విజయం సాధించడం విశేషం. రాష్ట్రంలో బీఎస్పీ గెలుచుకున్న ఏకైక సీటు కూడా కేవలం 30 ఓట్లతో గెలవడం గమనార్హం. 243 స్థానాలున్న బీహార్‌లో బీఎస్పీ 192 స్థానాల్లో అభ్యర్థులను నిలబెట్టింది. రామ్‌గఢ్ నియోజకవర్గం నుంచి బరిలోకి దిగిన సతీశ్ కుమార్ యాదవ్ తన సమీప బీజేపీ అభ్యర్థి అశోక్ కుమార్ సింగ్‌పై 30ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. కౌంటింగ్ ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగింది. అర్ధరాత్రి తర్వాత ఫలితాలు వెలువడ్డాయి. సతీశ్ కుమార్ యాదవ్‌కు 72,689 ఓట్లు రాగా, బీజేపీ అభ్యర్థికి 72,659 ఓట్లు వచ్చాయి. భోజ్‌పురి జిల్లాలోని సందేశ్ నియోజకవర్గంలో జేడీయూ అభ్యర్థి రాధాచరణ్ షా సమీప ఆర్జేడీ అభ్యర్థి దీపుసింగ్‌పై 27 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. అగియాన్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి మహేశ్ పాశ్వాన్ సమీప సీపీఐ(ఎంఎల్) అభ్యర్థి శివప్రకాశ్ రంజన్‌పై 95 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. నబీనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో జేడీయూ అభ్యర్థి చేతన్ ఆనంద్ 112 ఓట్ల మెజార్టీతో ఆర్జేడీ అభ్యర్థి ఆమోద్ కుమార్ సింగ్‌పై గెలుపొందారు. ధాకా నియోజకవర్గం స్థానాన్ని ఆర్జేడీ అభ్యర్థి ఫైసల్ రెహమాన్ గెలుచుకున్నారు. ఇక్కడి బీజేపీ అభ్యర్థి పవన్ కుమార్ జైస్వాల్ 178ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఫోర్బ్స్‌గంజ్ అసెంబ్లీ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి మనోజ్ బిస్వాన్ 221 ఓట్ల ఆధిక్యంతో బీజేపీ అభ్యర్థి విద్యాసాగర్‌పై విజయం సాధించారు.



## ఐదు బిలియన్ డాలర్ల దావా వేస్తా

### బిబిసికి ట్రంప్ మరో షాక్

**వాషింగ్టన్, నవంబరు 15:** అమెరికాలోని క్యాపిటల్ హిల్‌పై దాడి సందర్భంగా 2021లో ప్రస్తుత అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రసంగాన్ని తప్పుడు అర్థం వచ్చేలా మార్చడంతో బిసిసి చిక్కుల్లో పడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తన ప్రసంగాన్ని మార్చినందుకుగాను ఆ సంస్థపై 5 బిలియన్ డాలర్ల దావా వేస్తానని ట్రంప్ ఆ మీడియా సంస్థను హెచ్చరించారు. కాగా బిబిసి తన చర్యలతో ట్రంప్ పరువుకు భంగం కలిగించినందుకు పరిహారంగా బిలియన్ డాలర్లు చెల్లించాలని ఆయన న్యాయబృందం ఇప్పటికే మీడియా సంస్థకు లేఖ రాసింది. దీనిపై క్షమాపణలు చెప్పిన మీడియా సంస్థ ట్రంప్ డిమాండ్ చేసిన బిలియన్ డాలర్ల పరిహారాన్ని ఇచ్చేందుకు నిరాకరించింది. దీంతో ఆసంస్థపై దావా తప్పదంటూ అమెరికా అధ్యక్షుడు మరోసారి హెచ్చరించారు. వచ్చే వారంలో బిబిసిపై 1 బిలియన్ డాలర్ల నుంచి 5 బిలియన్ డాలర్ల వరకు కోర్టులో దావా వేయనున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. ఈ సమస్య గురించి బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్‌తో చర్చించనున్నట్లు తెలిపారు. 2021 జనవరి 6వ తేదీన వాషింగ్టన్‌లోని క్యాపిటల్ హిల్‌పై తన మద్దతుదారులు దాడులు చేసిన సందర్భంగా ట్రంప్ సుమారు గంటపాటు ప్రసంగించారు. దీనిని తన పనోరమ డాక్యుమెంటరీలో బిబిసి తప్పుగా ఎడిట్ తెచ్చారు. ప్రభుత్వ నిధులతో నడిచే బిబిసికి ఆ సంస్థ డైరెక్టర్ జనరల్ టిమ్ డేవీ, న్యూస్ చీఫ్ టర్నెస్ డెబోరా రాజీనామా చేయాల్సి వచ్చింది. దీనిపై మీడియా సంస్థ క్షమాపణలు చెప్పినా బిలియన్ డాలర్ల పరిహారాన్ని ఇవ్వాల్సిందిగా ట్రంప్ లేఖ రాశారు. అమెరికా అధ్యక్షుడి ప్రసంగాన్ని సవరించినందుకు తాను, బిబిసి సంస్థ చింతిస్తున్నట్లు ఛైర్మన్ సమీర్ షా శ్వేతసౌధానికి తిరిగి వ్యక్తిగత లేఖ పంపారు.

## నితీశ్‌తో చిరాగ్ భేటీ: కొత్త ప్రభుత్వం ఏర్పాటుపై చర్చలు



**పాట్నా, నవంబరు 15:** బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే అద్భుత విజయం సాధించిన నేపథ్యంలో కూటమిలోని లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్ పాశ్వాన్) అధినేత చిరాగ్ పాశ్వాన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నిన్న ఫలితాలు వెలువడిన నేపథ్యంలో ఈ రోజు ఆయన ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌తో సమావేశమయ్యారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, 2020 నాటి అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను చూసిన తర్వాత తన పని అయిపోయిందని చాలామంది అనుకున్నారని పేర్కొన్నారు. ఈ విజయం తనకు ఎంతో విలువైనదని ఆయన అన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో తదుపరి చర్యలపై నితీశ్ కుమార్‌తో చర్చించినట్లు వెల్లడించారు. బీహార్‌లో చారిత్రాత్మక విజయం సాధించిన నేపథ్యంలో ఎమ్మెల్యేలతో కలిసి వెళ్లి ముఖ్యమంత్రిని అభినందించామని అన్నారు. ప్రభుత్వం ఏర్పాటు, అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించినట్లు వెల్లడించారు. 2005లో తమ పార్టీ ఒంటరిగా పోటీ చేసి 29 స్థానాల్లో విజయం సాధించిందని, ఆ తర్వాత ఇవే తమకు అత్యుత్తమ ఫలితాలు అని అన్నారు. తమ కూటమిలో ఎల్‌జేపీ, జేడీయూ పాత్రపై ఎన్నికల సమయంలో ఎన్నో అసత్య ప్రచారాలు చేశారని గుర్తు చేశారు. అయినప్పటికీ తాము కలిసికట్టుగా ముందుకు సాగామని అన్నారు. 2025లో మాపై నమ్మకం ఉంచి ఎన్డీయే మాకు ఐదు ఎంపీ స్థానాలు కేటాయిస్తే విజయం సాధించామని, ఒక్క ఎమ్మెల్యే లేని మాకు 29 స్థానాలు కేటాయిస్తే 19 గెలుచుకున్నామని అన్నారు. గెలవలేని స్థానాలను తమకు కావాలనే ఇచ్చారని జేడీయూపై విమర్శలు చేశారని, తద్వారా తమ మధ్య విబేధాలు సృష్టించే ప్రయత్నం చేశారని అన్నారు. కానీ ఈ ఫలితాలు ఆ ఆరోపణలను తిప్పికొట్టాయని అన్నారు. ఆర్జేడీ క్రమంగా తన ప్రాబల్యాన్ని కోల్పోతోందని చిరాగ్ పాశ్వాన్ అన్నారు. 90లలో నడిచిన జంగిల్ రాజ్‌ను ప్రజలు మరోసారి తిప్పికొట్టారని అన్నారు.

## 96 లక్షలమంది ఫాలోవర్లున్నా ఎన్నికల్లో ఓటమి..



**పాట్నా,నవంబరు 15:** బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రముఖ యూట్యూబర్ మనీశ్ కశ్యప్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. జన్‌సురాజ్ పార్టీ అభ్యర్థిగా చన్‌పటియా నియోజకవర్గం నుంచి పోటీ చేసిన ఆయన ఫలితాల్లో ఘోర పరాజయం చవిచూశారు. సోషల్ మీడియాలో 96 లక్షల మంది ఫాలోవర్లు ఉన్నప్పటికీ, రాజకీయాల్లో అనుభవజ్ఞులైన ప్రత్యర్థుల ముందు ఆయన నిలవలేకపోయారు. చన్‌పటియా నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి అభిషేక్ రంజన్ బీజేపీ అభ్యర్థి ఉమాకాంత్ సింగ్‌పై 37,000 ఓట్ల తేడాతో విజయం సాధించారు. అయితే, ఇదే స్థానం నుంచి పోటీ చేసిన 34 ఏళ్ల మనీశ్ కశ్యప్ ఏకంగా 50 వేలకు పైగా ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. సోషల్ మీడియాలో ఉన్న ప్రజాదరణ ఎన్నికల్లో ఓట్లుగా మారలేదు. యూట్యూబర్‌గా బీహార్‌లో మంచి గుర్తింపు పొందిన మనీశ్ కశ్యప్, 2023లో తీవ్ర వివాదాల్లో చిక్కుకున్నారు. తమిళనాడులో బీహార్‌కు చెందిన వలస కార్మికులపై దాడులు జరుగుతున్నాయంటూ ఆయన రూపొందించిన కొన్ని వీడియోలు తీవ్ర కలకలం సృష్టించాయి. ఈ ఘటనపై తమిళనాడు, బీహార్ పోలీసులు విచారణ జరపగా, అవి నకిలీ వీడియోలని తేలింది. తప్పుడు సమాచారం ప్రచారం చేశారనే ఆరోపణలతో అప్పట్లో ఆయన అరెస్ట్ కూడా అయ్యారు. ఆ తర్వాత 2024లో బీజేపీలో చేరిన మనీశ్, అనంతరం జన్‌సురాజ్ పార్టీ టికెట్‌పై ఈ ఎన్నికల బరిలో నిలిచి ఓటమి పాలయ్యారు.

## భారత్‌నుంచి వెళ్లి పాక్ వ్యక్తిని పెళ్లాడిన పంజాబ్ మహిళ



**న్యూఢిల్లీ, నవంబరు 15:** పాకిస్థాన్ వెళ్లిన భారతీయ సిక్కు మహిళ అక్కడ అదృశ్యమైంది. మతంతో పాటు తన పేరు మార్చుకున్న ఆమె ఆ దేశానికి చెందిన వ్యక్తిని పెళ్లాడింది. మతపరమైన యాత్ర కోసం పాక్ వెళ్లిన ఆ మహిళ భారత్‌కు తిరిగి రాకపోవడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. పంజాబ్‌లోని కపుర్తలాకు చెందిన 52ఏళ్ల సరబ్‌జీత్ కౌర్, భర్త కర్నైల్ సింగ్ నుంచి విడాకులు తీసుకున్నది. ఆమెకు ఇద్దరు కుమారులు. గురునానక్ దేవ్ 555వ జయంతిని పురస్కరించుకుని భారత్‌కు చెందిన 1,900 మందికి పైగా యాత్రికుల బృందం నవంబర్ 4న వాఘా అట్టారి సరిహద్దు దాటి పాకిస్థాన్‌లోకి ప్రవేశించారు. పాక్ పంజాబ్ ప్రావిన్స్‌లోని చారిత్రక గురుద్వారాలను వారు సందర్శించారు. మరోవైపు నవంబర్ 13న ఈ బృందం భారత్‌కు తిరిగి వచ్చింది. అయితే ఈ బృందంతో కలిసి వెళ్లిన సరబ్‌జీత్ కౌర్ పాకిస్థాన్‌లో అదృశ్యమైంది. ఇమ్మిగ్రేషన్ ఎగ్జిట్ క్లియరెన్స్ కోసం రిపోర్ట్ చేయలేదని పాకిస్థాన్ ఇమ్మిగ్రేషన్ అధికారులు గుర్తించారు. ఆమె మిస్సింగ్‌పై దర్యాప్తు చేశారు. సరబ్‌జీత్ కౌర్ ఇస్లాం మతంలోకి మారి పాకిస్థాన్‌లోని ఒక వ్యక్తిని పెళ్లి చేసుకున్నట్లు వెలుగులోకి వచ్చింది. తన పేరును నూర్‌గా మార్చుకున్న ఆమె లాహోర్ సమీపంలోని షేక్‌పురాకు చెందిన నాసిర్ హుస్సేన్‌ను వివాహమాడింది. ఉర్దూలో ఉన్న 'నిఖానామా' (ఇస్లామిక్ వివాహ ఒప్పందం) కాపీ కూడా బయటపడింది. మరోవైపు పాకిస్థాన్ పోలీసులు ఈ విషయాన్ని భారతీయ అధికారులకు తెలియజేశారు. దీంతో సరబ్‌జీత్ కౌర్, ఆమె కుటుంబం గురించి పోలీసులు సమాచారం సేకరిస్తున్నారు. పంజాబ్‌లోని ముక్తసర్ జిల్లా నుంచి ఆమె పాస్‌పోర్ట్ పొందినట్లు గుర్తించారు. పాస్‌పోర్ట్‌లో మాజీ భర్త పేరుకు బదులు తండ్రి పేరు ఉన్నట్లు కనుగొన్నారు. మాజీ భర్త కర్నైల్ సింగ్ గత 30 ఏళ్లుగా బ్రిటన్‌లో నివసిస్తున్నట్లు పోలీసులు తెలుసుకున్నారు. పాక్‌లో అదృశ్యమై మతం మారి అక్కడి వ్యక్తిని పెళ్లాడిన సరబ్‌జీత్ కౌర్ గురించి మరింతగా దర్యాప్తు చేస్తున్నారు.

## కరెన్సీనోట్ల ముద్రణకు చైనాతో నేపాల్ ఒప్పందం



### 430మిలియన్ నోట్ల డిజైన్ ముద్రణకు డీల్ ఓకే

**ఖాట్మండు, నవంబరు 15:** భారత్ పొరుగు దేశం నేపాల్ తమ కరెన్సీ నోట్లను చైనాలో ముద్రణ చేయిస్తోంది. నేపాల్ రాష్ట్ర బ్యాంక్ చైనా బ్యాంక్ నోట్ ప్రింటింగ్ అండ్ మింటింగ్ కార్పొరేషన్ తో ఒప్పందం కుదుర్చుకుంది. దీంతో నేపాల్ 1,000రూపాయల నోట్లను చైనా ప్రింట్ చేయనుంది. మొత్తం 430 మిలియన్ల నోట్లను డిజైన్ చేసి, ముద్రించి, సరఫరా చేయడానికి ఇరుదేశాల మధ్య ఒప్పందంకుదిరింది. 16.985 మిలియన్ల డాలర్ల ఖర్చుతో ఈ పని చేయడానికి అత్యంత తక్కువ ధరకు చైనా టెండర్ వేసింది. గతంలో నేపాల్ కరెన్సీ నోట్లు భారత్‌లోనే ప్రింట్ అయ్యేవి, 1945 నుంచి 1955 వరకు నేపాల్ కరెన్సీ నోట్లునాసిక్‌లోని సెక్యూరిటీ ప్రెస్‌లో తయారయ్యేవి. 2015 వరకు నేపాల్‌కు సంబంధించిన కొన్ని రకాలనోట్ల ప్రింటింగ్‌ను ఇండియా హ్యాండిల్ చేసింది. ఆ తర్వాత నుంచి నేపాల్ తమ నోట్‌ప్రింటింగ్ కాంట్రాక్టులు చైనాకు అప్పగించింది. అయితే భారత్‌ను కాదని చైనాకు అప్పగించడం వెనుక పలు కారణాలు ఉన్నాయి. గత మూడేళ్లుగా చైనా ప్రభుత్వ ఆధీనంలోని సంస్థ చైనా బ్యాంక్ నోట్ ప్రింటింగ్ అండ్ మింటింగ్ కార్పొరేషన్ నేపాల్ నోట్లను వరుసగా ఏడుసార్లు ముద్రించడానికి బిడ్లను గెలుచుకుంది. ఈ సమయంలో దాదాపు 2.38 బిలియన్ నోట్ల ముద్రణ కోసం ఈ కంపెనీ నేపాల్ నుంచి దాదాపు 63మిలియన్ డాలర్లను ఆర్జించింది. భారత్‌తో పోల్చితే చైనాలో తక్కువ ధరలో ప్రింటింగ్ అవుతోంది. అయితే నేపాల్ భారత్ నుంచి చైనాకు నోట్ల ప్రింటింగ్ షిఫ్ట్ చేయడానికి ఖర్చు మాత్రమే కారణం కాదు. నేపాల్ కొత్త కరెన్సీ నోట్లలో లిపులేఖ్, లింపియాధుర, కాలాపానీ వంటి వివాదాస్పద ప్రాంతాలు ఆ దేశంలో భాగంగా ముద్రించింది. ఇక ఈ నోట్లను భారత్‌ముద్రిస్తే రాజకీయంగా సున్నితమైన సమస్య అవుతుంది. దీంతో పాటు చైనా ఆధునిక భద్రతా ఫీచర్లను కూడా అందిస్తుండటం వల్ల నేపాల్ భారత్‌ను కాదని చైనాను ఎంచుకుంది. ప్రస్తుతం నేపాల్ అన్ని నోట్లు చైనాలో ముద్రిస్తున్నారు.ఇలా చైనా వద్ద తమ కరెన్సీని ముద్రించకుంటున్నది నేపాల్ ఒక్కటే కాదు. బంగ్లాదేశ్, శ్రీలంక, మలేషియా, థాయిలాండ్, ఆఫ్ఘనిస్తాన్ వంటి ఇతరదక్షిణాసియా దేశాలు కూడా చైనాలోనే తమ డబ్బును ముద్రించుకుంటున్నాయి. ఇక చైనాలో ఉన్న బ్యాంక్ నోట్ ప్రింటింగ్ అండ్ మింటింగ్ కార్పొరేషన్ ప్రపంచంలోనే అతిపెద్ద డబ్బును ప్రింటింగ్ చేసే సంస్థ. చైనా బిఎన్‌పిసి కాకుండా జపాన్‌లోని నేషనల్ ప్రింటింగ్ బ్యూరో, రష్యా గోజ్నాక్, అమెరికాలోని బ్యూరో ఆఫ్ ఎన్‌గ్రేవింగ్ అండ్ ప్రింటింగ్ కరెన్సీ వంటి సంస్థలు అత్యాధునిక టెక్నాలజీ ఉన్న కరెన్సీ ముద్రణతో పాటు హైసెక్యూరిటీ డాక్యుమెంట్లను ప్రింట్ చేస్తాయి.

## ఒకే కుటుంబంలోని ఎనిమిది మందిపై విషప్రయోగం

**బాగేపల్లి(కర్ణాటక), నవంబరు 15:** కర్ణాటకలోని బాగేపల్లి సమీపంలో ఒక గ్రామంలో పాత కక్షల నేపథ్యంలో దారుణ ఘటన చోటుచేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన ఎనిమిది మందిపై విషప్రయోగం జరిగింది. మధ్యాహ్న భోజనం చేసిన కొద్దిసేపటికే వారంతా తీవ్రమైన వాంతులు, కళ్లు తిరగడంతో అస్వస్థతకు గురయ్యారు. వారిని వెంటనే ఆసుపత్రికి తరలించగా, ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండటంతో వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నారు. కుటుంబ సభ్యుల్లో ఒక బాలిక స్పృహలోకి వచ్చిన తర్వాత పోలీసులకు ఇచ్చిన సమాచారంతో ఈ దారుణం వెలుగులోకి వచ్చింది. తమకు తెలిసిన చౌడారెడ్డి అనే వ్యక్తి భోజనానికి ముందు నీళ్లు తాగే నెపంతో ఇంట్లోకి వచ్చాడని, వంటగదిలో కొంతసేపు గడిపాడని బాలిక తెలిపింది. ఆమె సమాచారం ఆధారంగా పోలీసులు చౌడారెడ్డిని అదుపులోకి తీసుకుని విచారించగా, అసలు విషయం బయటపడింది. బాధితుల పక్కింట్లో నివసించే పాపిరెడ్డి అనే వ్యక్తితో వారికి చాలా కాలంగా డ్రైనేజీ విషయంలో గొడవలున్నాయి. ఈ క్రమంలో పాపిరెడ్డి సూచన మేరకే తాను వారి భోజనంలో విషం కలిపినట్లు చౌడారెడ్డి అంగీకరించాడు. మొదట పురుగుల మందు కలిపినట్లు అనుమానించినా, విచారణలో భాగంగా సాంబారులో విషపూరితమైన ఉమ్మెత్తకాయల రసం కలిపినట్లు నిందితులు ఒప్పుకున్నారు. ఈ ఘటనపై చిక్కబళ్లాపూర్ ఎస్పీ కుశాల్ చౌక్సీ స్పందిస్తూ, ఇది పక్కా ప్రణాళికతో చేసిన చర్య.నిందితులు బాధితుల నమ్మకాన్ని దుర్వినియోగం చేశారు.



## ఉక్రెయిన్‌తో యుద్ధానికి రష్యా గ్లైడ్ బాంబులు

### సీనియర్ ఇంటెలిజెన్స్ అధికారి ధ్వజం

**కీవ్, నవంబరు 15:** మూడున్నరేళ్లుగా కొనసాగుతున్న రష్యాఉక్రెయిన్ యుద్ధం ముగింపు దశకు చేరే సూచనలు ఏమాత్రం కనిపించడం లేదు. పరస్పర దాడులు కొనసాగుతున్న ఈ తరుణంలోఒకరిపై ఒకరు తీవ్రఆరోపణలు చేసుకుంటున్నారు. తాజాగా రష్యా తన ఆయుధాల ఉత్పత్తిని భారీగా పెంచుతూ తమకు సరికొత్త ముప్పును సృష్టించేందుకు సిద్ధమవుతోందని ఉక్రెయిన్ సీనియర్ ఇం టెలిజెన్స్ అధికారి సంచలన ఆరోపణలు చేశారు. రష్యా ఈ ఏడాది చివరి నాటిక 1.20లక్షల గ్లైడ్ బాంబులను తయారు చేయడానికి ప్రణాళికలు రచిస్తున్నట్లు ఆ అధికారి వెల్లడించారు. వీటిలో సుమా రు 500 కొత్త లాంగ్ రేంజ్ వెర్షన్ బాంబులు కూడా ఉన్నాయని ఇవి 12 కిలో మీటర్ల కంటే ఎక్కువ దూరంలో ఉన్న లక్ష్యాలను కూడా చేరుకోగల సామర్థ్యాన్ని కలిగి ఉంటాయని తెలిపారు. ఉక్రెయిన్ ఇంటెలిజెన్స్ అధికారి ఆరోపణల ప్రకారం రష్యన్ దళాలు ప్రస్తుతం ప్రతిరోజూ ఉక్రెయిన్ భూభా గంలోని వివిధ ప్రాంతాలపై 200 నుంచి 250 వరకు గ్లైడ్ బాంబులతో దాడులు చేస్తున్నాయి. ఈ గ్లైడ్ బాంబుల పరిధిని రష్యా క్రమంగా పెంచుకుంటూ పోతోందని భవిష్యత్తులో 400 కిలో మీటర్ల దూరంలో ఉన్న లక్ష్యాలను కూడా ధ్వంసం చేయగలిగే బాంబుల తయారీకి మాస్కో ప్లాన్ చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రష్యా తయారు చేస్తున్న ఈ చవకైన, విధ్వంసకర బాంబుల కారణంగా ఉక్రెయి న్‌కు తీవ్ర నష్టంవాటిల్లే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. వీటిని సమర్థవంతంగా ఎదుర్కోవడానికి కీవ్ సైన్యాలు సన్నద్ధమవుతున్నట్లు తెలిపారు. అయితే పౌరులను లక్ష్యంగా చేసుకొని దాడులు చేస్తున్నట్లు వస్తున్న ఆరోపణలను రష్యా ఎప్పటిలాగే ఖండించింది. ఉక్రెయిన్ ఇంటెలిజెన్స్ అధికారి చేస్తున్న ఆరోపణలపై మాస్కో వెంటనే స్పందించలేదు.2022లో ఉక్రెయిన్‌పై పూర్తిస్థాయి దాడి ప్రారంభమైనప్పటి నుంచి రష్యా తన ఆయుధాల తయారీని భారీగా పెంచింది. సైనిక అవసరాల కోసం మాస్కోలోని రక్షణ రంగానికి చెందిన కర్మాగారాలు 24 గంటలూ అవిశ్రాంతంగా పని చేస్తు న్నాయి. ఈ నేపథ్యంలోనే రష్యా తన సైనిక శక్తిని ప్రదర్శిస్తూ అనేక విన్యాసాలు నిర్వహిస్తోంది. గత నెలలో రష్యా సైన్యం భారీస్థాయిలో అణువిన్యాసాలు నిర్వహించింది. అధ్యక్షుడు పుతిన్ స్వయంగా పర్యవేక్షించిన ఈ విన్యాసాలలో అణుశక్తి ఆధారిత సబ్‌మెర్సిబుల్ డ్రోన్ పోసిడాన్, బురె వెస్ట్‌నిక్ క్షిప ణులను విజయవంతంగా పరీక్షించినట్లు పుతిన్ సైనికఉన్నతాధికారులతో జరిగిన సమావేశంలో వెల్ల డించారు. ఈ భారీస్థాయి ఆయుధోత్పత్తి ప్రణాళికలు ఉక్రెయిన్‌లో ఉద్రిక్తతలను మరింత పెంచే అవకాశం ఉంది.

### శిఖాగార్గ్ విమాన ప్రమాదం కేసు..

## రూ. 317 కోట్ల పరిహారం చెల్లించాలని షికాగో కోర్టు ఆదేశం



**వాషింగ్టన్, నవంబరు 15:** బోయింగ్ విమాన ప్రమాద ఘటనలో ఓ భారతీయ కుటుంబానికి కోర్టులో ఊరట లభించింది. 35.85 మిలియన్ డాలర్లు (రూ.317 కోట్లు) చెల్లించాలని విమాన తయారీ సంస్థను షికాగోలోని ఫెడరల్ కోర్టు ఆదేశించింది. ఆరేళ్లపాటు కొనసాగిన ఈ న్యాయ పోరాటంలో చివరకు విజయం దక్కింది. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం.. 2019లో ఇథియోపియన్ ఎయిర్‌లైన్స్ బోయింగ్ విమానం (737 మాక్స్) ప్రమాదానికి గురైంది. ఆ ఘటనలో భారతీయ పౌరురాలైన శిఖాగార్గ్ మరణించారు. అప్పుడు ఐరాసలో కన్సల్టెంట్‌గా పనిచేస్తున్న ఆమె యుఎన్ ఎన్విరాన్‌మెంట్ అసెంబ్లీ సమావేశంలో పాల్గొనేందుకు నైరోబీకి వెళ్తున్నారు. ఆ సమయంలో ఆమె పిహెచ్‌డి చేస్తున్నారు. భారతీయ సంప్రదాయం అంటే మక్కువ చూపే శిఖ చీరకట్టులో విమానం ఎక్కారని ఆ రోజుల్ని కుటుంబ సభ్యులు గుర్తు చేసుకున్నారు. ఆ విమానం ఇథియోపియాలోని బోలె అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి టేకాఫ్ అయిన కొన్ని నిమిషాల వ్యవధిలోనే కూలిపోయింది. దాంతో 150 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. మార్చిలో ఈ ఘటన జరగ్గా దానికి ఐదు నెలల ముందే ఇండోనేసియాలో మరో ప్రమాదానికి గురైంది. ఈ రెండు ఘటనల్లో కలిపి సుమారు 340 మంది మృతి చెందారు. వీటికి సంబంధించిన కేసుల్లో పరిహారం ఇచ్చి, చాలావరకు కేసుల్ని బోయింగ్ పరిష్కరించుకుంది.

## సంక్షిప్తంగా..

### కేంద్ర మాజీ మంత్రిపై బిజెపి క్రమశిక్షణ వేటు




**పాట్నా, నవంబరు 15:** బీజేపీ అధిష్ఠానం పార్టీపై విమర్శలు చేస్తూ క్రమశిక్షణ ఉల్లంఘించిన వారిపై చర్యలు చేపట్టింది. కేంద్ర మాజీ మంత్రి, బీహార్‌కు చెందిన సీనియర్ నేత ఆర్‌కే సింగ్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. బీహార్ రాష్ట్ర ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించిన మరుసటి రోజే ఈ చర్య తీసుకోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడు తున్నారనే ఆరోపణలతో ఆయనపై ఈ వేటు వేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.కొంతకాలంగా ఆర్‌కే సింగ్ ఎన్డీయే నాయకత్వంపైనా, బీహార్‌లోని నితీశ్ కుమార్ ప్రభుత్వంపైనా తీవ్ర ఆరోపణలు చేస్తూ వార్తల్లో నిలుస్తున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ ఆయనకు షోకాజ్ నోటీసు జారీ చేసింది.

### రాజకీయాలనుంచి తప్పకున్న లాలూ కుమార్తె రోహిణి



**పాట్నా,నవంబరు 15:** బీహార్ ఎన్నికల్లో ఆర్జేడీకి గట్టి షాక్ తగిలిన విషయం తెలిసిందే. రెండు విడతల్లో 243 స్థానాలకు జరిగిన ఎలక్షన్‌లో నితీశ్ కుమార్ నేతృత్వంలోని ఎన్డీయేకూటమి 202 స్థానాల్లో జయభేరి మోగించింది. ఇక అధికారంలోకి రావాలనుకున్న ఆర్జేడీ నేతృత్వంలోని ప్రతిపక్ష మహాఘట్‌బంధన్ కూటమి ఘోర పరాభవం పాలైన విషయం తెలిసిందే. ఈ ఓటమి నుంచి కోలుకోకముందే ఆర్జేడీ అధినేత లాలూ యాదవ్‌కు మరో షాక్ తగిలింది. ఆయన కుమార్తె రాజకీయాలకు గుడ్‌బై చెప్పారు. ఆర్జేడీ అధినేత లాలూ యాదవ్‌కుమార్తె రోహిణి ఆచార్య సంచలన ప్రకటనచేశారు. తాను రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. అంతేకాదు, కుటంబంతో సంబంధాలను కూడా తెంచుకుంటున్నట్లు వెల్లడించారు.

### దినసరి కూలీకి రూ.35 కోట్ల జీఎస్టీ బిల్లు



**మోఘా, నవంబరు 15:** పంజాబ్‌లోని మోఘాకు చెందిన కార్మికుడికి సుమారు 35 కోట్ల జీఎస్టీ బిల్లు వచ్చింది. దీంతో షాకైన ఆ వ్యక్తి సదురు శాఖను కలిశాడు. మోఘాలోని బోహ్నా చౌక్‌కు చెందిన అజ్మీర్ సింగ్ అనే రోజు వారి కార్మికుడికి 35కోట్ల జీఎస్టీ బిల్లు వచ్చింది. తిండి కోసం తిప్పులు పడే తనకు ఎలా ఆ బిల్లు వచ్చిందా అని ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశాడతను. గతంలోనూ ఓసారి అజ్మీర్ సింగ్‌కు భారీగానే జీఎస్టీ బిల్లు వచ్చింది. 2022లో అతనికి 21 లక్షల జీఎస్టీ నోటీసు జారీ చేశారు. అప్పుడు కూడా ఆయన జీఎస్టీ ఆఫీసుకెళ్లాడు. విచారణ చేయమని కోరాడు. కానీ ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఇప్పుడు రెండేళ్లే తర్వాత 35 కోట్ల జీఎస్టీ బిల్లు రావడం గమనార్హం.

### ఒకే కుటుంబంలో ఐదుగురు మృతి



**కైలాశ్‌పూర్(యుపి),నవంబరు 15:** ఉత్తరప్రదేశ్‌లోని శ్రావస్తి జిల్లా కైలాశ్ పూర్ గ్రామంలో దారుణం చోటుచేసుకుంది. ముంబై నుంచి గ్రామానికి తిరిగి వచ్చిన ఓ కుటుంబం మృత్యువాత పడింది. భార్యాభర్తతో పాటు ముగ్గురు పిల్లలు ఇంట్లోనే విగతజీవులయ్యారు.ఒకే ఇంట్లో ఐదుగురు చనిపోవడంతో గ్రామంలో తీవ్ర భయాందోళనను రేకెత్తించింది. పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో భార్యాపిల్లలను చంపి భర్త ఆత్మహత్య చేసుకున్నట్లు తేలింది. ఈ దారుణానికి భర్త ఎందుకు ఒడిగట్టాడనే విషయం ఇంకా తెలియరాలేదని పోలీసులు తెలిపారు.

### కాంగ్రెస్ ఎమ్మెల్యేపై ఇడి మనీలాండరింగ్ కేసు



**బెంగళూరు, నవంబరు 15:** కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే సతీశ్ కృష్ణ సెయిల్‌పై మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ శనివారం స్పెషల్ కోర్టులో ప్రాసిక్యూషన్ ఫిర్యాదు దాఖలు చేసింది. కార్వార్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన సతీశ్ కృష్ణ మల్లికార్జున్ షిప్పింగ్ ప్రైవేట్ లిమిటెడ్ మేనే జింగ్ డైరెక్టర్. మనీలాండరింగ్ నిరోధక చట్టం 2002 నిబంధనల కింద ఈడీ కంపెనీపై సైతం ప్రాసి క్యూషన్ ఫిర్యాదును దాఖలు చేసింది. ఇనుప ఖనిజాన్ని అక్రమంగా ఎగుమతి చేయడంతో ప్రభుత్వ ఖజానాకు రూ.44.09 కోట్ల నష్టం వాటిల్లిందని ఈడీ పేర్కొంది. ఈ నెల ప్రారంభంలో ఎమ్మెల్యే సతీశ్ కృష్ణకు చెందిన రూ.21 కోట్ల విలువైన ఆస్తులను ఈడీ జప్తు చేసింది. ఈ కేసులో సతీష్ కృష్ణను సెప్టెంబర్‌లో ఈడీ అరెస్టు చేసింది. ఆ వైద్య కారణాలతో ఆయనకు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. అయితే, ఈడీ స్పెషల్ పీఎంఎల్‌ఏ కోర్టు రద్దు బెయిల్‌ను రద్దు చేసింది.

# ఎపిలో మ్యాజిక్ డ్రెయిన్లు అద్భుతం

## - చత్తీస్‌గఢ్ అధికారుల బృందం సంకేతాలు
## - రాష్ట్రంలో 'ఉపాధి హామీ' పనులపై పరిశీలన

**విజయవాడ, నవంబరు 15,ప్రభాతవార్తప్రతి నిధి:** రాష్ట్రంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు తీరును చత్తీస్‌గఢ్‌కు చెందాఇన 19 మంది అధికారుల బృందం పరిశీలించింది. క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా రెండు రోజులుగా అన్నమయ్య జిల్లాలోని పలు గ్రామ పంచాయితీల్లో పర్యటించింది. అనంతరం రాష్ట్ర పంచాయితీరాజ్,గ్రామీణాభివృద్ధి శాఖ కమీషనర్ కృష్ణతేజను తాడేపల్లి కార్యాలయంలో కలిసింది.పంచాయతీ రాజ్ అధికారులతో సమావేశమైంది. ఏపీలో ఉపాధి హామీ పథకం అమలు ఆదర్శనీయంగా ఉంది. మ్యాజిక్ డ్రెయిన్ విభాగం అద్భుతం.దీన్ని దేశమంతా అమలు చేస్తే స్వచ్ఛ గ్రామాలు ఏర్పడతాయి. వర్షపునీరు భూమిలో ఇంకడంతో పాటు దోమలు లేని ఆరోగ్యకరమైన గ్రామాలను చూడగలుగుతాం.చత్తీస్‌గఢ్ లోనూ అమలు చేయడానికి ప్రణాళికలు సిద్దం చేసారు.


దాడిలో ధ్వంసం అయిన దృశ్యాలు

# వైసిపి కార్యాలయాన్ని ధ్వంసం చేసిన టిడిపి వర్గీయులు

## - దాడిని ఖండించిన వైయస్ జగన్

**హిందూపురం నవంబర్ 15 ప్రభాతవార్త** హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ దీపిక వేణు రెడ్డి కార్యాలయం పై తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకులు ముకుమ్మడిగా రాళ్లు, కర్రలతో దాడి చేసి ధ్వంసం చేశారు. శ్రీ సత్య సాయి జిల్లా హిందూపురం పట్టణంలో శనివారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో జరిగిన ఈ ఘటన హిందూపురంలో కలకలం రేపింది. వివరాలు ఇలా ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయాలన్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్ ఆర్సిపి రాష్ట్ర వ్యాప్త ఆందోళన నిర్వహిస్తున్న క్రమంలో హిందూపురంలో రచ్చబండ కోటి సంతకాల సేకరణతో అపార్టీ ఇన్చార్జ్ దీపికా వేణు రెడ్డి ఆధ్వర్యంలో శనివారం లేపాక్షి మండలం శిరివరం లో కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలకృష్ణ ను ఉద్దేశించి వేణు రెడ్డి అనుచితంగా మాట్లాడారని పేర్కొంటూ టిడిపి కన్వీనర్లు తదితర నాయకులు వైసిపి కార్యాలయం చేరుకున్నారు. సిమెంట్ ఇటుకలు, కర్రలతో కార్యాలయం పై దాడికి దిగారు. ఆ సమయంలో అక్కడ ఉ న్న ఐదు ఆరుగురు వైసీపీ కార్యకర్తలు అడ్డుకున్నందుకు ప్రయత్నించగా వారిని చితకబాదారు. తర్వాత దీపిక చాంబర్లోకి వెళ్లి అదే స్థాయిలో విధ్వంసం చేశారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం కింద వేసి పగలగొట్టారు. వైఎస్ జగన్ చిత్రపటాన్ని ఇతర ఫోటోలను కూడా అదే రీతిన చేశారు. అక్కడికి చేరుకున్న పోలీసులు దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేయకుండా పంపించి వేయడం పై వైసీపీ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకొని పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ, వేణురెడ్డి వెంటనే అక్కడికి చేరుకున్నారు. మీడియాతో వేణు రెడ్డి మాట్లాడుతూ ఈ దాడి పిరికిపంద చర్య అని అభివర్ణించారు. ఈ దుర్ఘటన హిందూపురానికే మాయని మచ్చని అన్నారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ పై ఇటీవల తాము చేపట్టిన ర్యాలీ భారీగా సక్సెస్ కావడానికి జీర్ణించుకోలేక ఈరోజు హిందూపురం కొడికొండలో బాలకృష్ణ ఉండి తన వారిని రెచ్చగొట్టి వైసిపి కార్యాలయంపై దాడి చేయించారని విమర్శించారు. మూడుసార్లు మిమ్మల్ని హిందూపురం ఎమ్మెల్యేగా ప్రజలు గెలిపిస్తే ఇలాంటి ఘటనలకు పాల్పడతారా అంటూ ప్రశ్నించారు. అధినేత జగన్ రెండోసారి సీఎం కాగానే మీ ఊహ కూడా అందనంత ప్రతీకారం ఉంటుందని హెచ్చరించారు. బాలకృష్ణ ఇక్కడ ఓడిపోతే వైసిపి అధికారంలో మీ పరిస్థితి ఏంటో ఊహించుకోండి తెలుగు తమ్ముళ్లు అన్నారు. హిందూపురం ప్రజలు కూడా ఇలాంటి వాటిని గమనించాలని చేతులెత్తి మొక్కుతున్నానన్నారు. ఏమాత్రం హిందూపురం ను అభివృద్ధి చేయని వారి కింద బానిసల్లాగా మీరు ఉంటారా అంటూ ప్రజలను ప్రశ్నించారు. జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ మాట్లాడుతూ సంఘటనను తీవ్రంగా ఖండించారు. దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదుచేసుకొని చర్యలు తీసుకోవాలని కోరారు.

# మదనపల్లి కిడ్నీ రాకెట్ కేసులో ఆరుగురు అరెస్ట్

## మిగిలిన నిందితుల కోసం నాలుగు బృందాలతో గాలింపు

**మదనపల్లె క్రైమ్ నవంబర్ 15 ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేకెత్తించిన కిడ్నీ రాకెట్ కేసులో ఆరుగురిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు మదనపల్లి డి.ఎస్.పి మహేంద్ర తెలిపారు. శనివారం డీఎస్పీ కార్యాలయంలో నిందితుల అరెస్టు వివరాలను మీడియాకు తెలిపారు. డి.ఎస్.పి మహేంద్ర కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మీడియాకు శనివారం మదనపల్లి పట్టణం ఎస్బిఐ కాలనీ లోని గ్లోబల్ ఆసుపత్రి యజమాని, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ ఆంజనేయులు ఆధ్వర్యంలో అనాథరైజ్డ్ గా కిడ్నీ ట్రాన్స్ ప్లాంటేషన్ జరుగుతున్నాయి. ఈ రాకెట్లు సుమారు 15 మంది వరకు ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ప్రస్తుతం ఏడు మందిపై కేసు నమోదు చేయక వారిలో ఆరు మందిని శనివారం అరెస్ట్ చేశారు. మరో డాక్టర్ పరారీలో ఉండడంతో ఆయన కోసం పోలీసులు గాలిస్తున్నట్లు డిఎస్పి తెలిపారు. వీరు కాక మరో ఎనిమిది మందిని గుర్తించి వారి పాత్ర పై దర్యాప్తు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలోని విశాఖపట్నం ఆనందపురం మండలం బొడ్డపాల్యం కు చెందిన సాడి కృష్ణ భార్య యమున (29) ఈనెల తొమ్మిదిన పథకం ప్రకారం కిడ్నీ రాకెట్ లోని ముఠా సభ్యులు మదనపల్లి గ్లోబల్ ఆసుపత్రికి తీసుకురావడం జరిగిందన్నారు. డాక్టర్ల బృందం సిబ్బందితో కలిసి, యమునా తో పాటు మరొకరికి కిడ్నీలను తొలగించి అమరచడం జరిగిందని చెప్పారు. ఒకరికి సక్సెస్ కాగా యమునా, ఆపరేషన్ వికటించి మృతి చెందడం జరిగిందని దర్యాప్తు తేలినట్లు డిఎస్పి మహేంద్ర పేర్కొన్నారు. ఈ కేసులో డాక్టర్ ఆంజనేయులు, ఎ2 బెంగళూరుకు చెందిన ఓ డాక్టర్, అలాగే మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలోని అపోలో దయాలసిస్ మేనేజర్ బాలరంగడు అలియాస్ బాలు, కదిరి దయాలసిస్ మేనేజర్ మెహరాజ్, కిడ్నీ రాకెట్ లో కీలక పాత్ర పోషించిన విశాఖకు చెందిన పెళ్లి పద్మ,, కాకర్ల సత్య, యమునా ప్రియుడు సూరిబాబు లను అరెస్టు చేయగా, బెంగళూరు చెందిన కిడ్నీ రాకెట్ లో ప్రముఖ పాత్ర పోషించిన డాక్టర్ని అరెస్టు చేయాల్సి ఉందని చెప్పారు. ఈ కేసులో మరో ఎనిమిది మంది నిందితులు ఉన్నారని వారిని కూడా త్వరలోనే పక్క ఆధారాలతో అరెస్టు చేస్తామని పేర్కొన్నారు. మిగిలిన నిందితులను అదుపులోకి తీసుకోవడం కోసం నాలుగు బృందాలతో గాలింపులు చేపడుతున్నట్లు డిఎస్పి తెలిపారు. పోలీస్ బృందాలు కర్ణాటక, తెలంగాణ, గోవా రాష్ట్రాల్లో గాలిస్తున్నట్లు తెలిపారు.

# ఎర్రచందనం స్మగ్లరుకు జరిమానా, జైలు శిక్ష

## తీర్పు వెల్లడించిన ఆర్ఎస్ఎస్ ఎడిజె కోర్టు న్యాయమూర్తి

**తిరుపతి కార్పొరేషన్, నవంబర్ 15 ప్రభాతవార్త :** .. కోర్టుకు హాజరు కాకపోవడంతో ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన స్మగ్లరుకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ. 6లక్షలు జరిమానా విధిస్తూ ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి శనివారం తీర్పు నిచ్చారు. ఆర్ఎస్ఎఎస్టీఎఫ్ హెడ్ ఎల్ సుబ్బారాయుడు రూపొందించిన ప్రత్యేక కార్యాచరణ మేరకు టాస్క్ ఫోర్సు ఎస్పీ పీ.శ్రీనివాస్ పర్యవేక్షణలో గతంలో నమోదై, కోర్టులో విచారణ దశలో ఉన్న కేసుల గురించి ప్రత్యేక శ్రద్ద తీసుకున్నారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అలుగూరి అమర నారాయణ ద్వారా పగడ్బందీగా సాక్ష్యాధారాలను నిరూపించి ముద్దాయిలకు శిక్షలు పడే విధంగా చేశారు. ఈ ముద్దాయి ఎర్రచందనం అక్రమ రవాణాచేస్తూ తిరుపతి జిల్లా టీఎన్ పాళెం బీటు పరిధిలో అరెస్టయ్యాడు. ఈ వ్యక్తి తమిళనాడు, తిరువన్నామలై జిల్లాకు చెందిన అన్నామలై విజయకుమార్. కాగా ఇతను కోర్టుకు హాజరు కాకపోవడంతో న్యాయమూర్తి నాన్ బెయిలబుల్ అరెస్టు వారెంట్ జారీ చేశారు. దీంతో పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి తీసుకుని వచ్చి, కోర్టులో హాజరు పరిచారు. కోర్టులో ఇతని నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఈ స్మగ్లరుకు ఐదేళ్ల జైలు శిక్ష తో పాటు రూ. 6లక్షల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

# పిజి లాసెట్, పిజిఎల్ సెట్ ప్రవేశాలకు నోటిఫికేషన్

**తిరుపతి,నవంబర్ 15ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ఉన్నతవిద్యామండలి ఆదేశాలతో తిరుపతి పద్మావతి మహిళవిశ్వవిద్యాలయం ఆదధ్వర్యంలో ఏపి లాసెట్, పిజిఎల్‌సెట్ రెండోవిడత ప్రవేశాలకు వెబ్‌కౌన్సిలింగ్‌కు ఈనెల 16న మొదలవుతుంది. రిజిస్ట్రేషన్ ప్రాసెసింగ్ ఫీజుచెల్లింపులు 16వతేదీ నుండి 19వతేదీ వరకు జరుగుతుందని కన్వీనర్ ఆచార్య సీతాకుమారి తెలిపారు.

# బీహార్ గెలుపు డబుల్ ఇంజన్ మలుపు : ఎంపి పురందేశ్వరి

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, నవంబర్ 15( ప్రభాతవార్త):** కామన్వెల్త్ సమావేశాలు, ఐక్య రాజ్య సమితి (యుఎన్ఓ) సమావేశాలలో పాల్గొనడం తనకు దక్కిన రెండు అరుదైన గౌరవాలని రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. కామన్వెల్త్ సమావేశాల్లో మహిళా సాధికారిత గురించి వివరించినట్లు ఆమె గుర్తుచేసారు. తాజాగా యుఎన్ఓ వెళ్లిన బృందానికి కూడా నాయకత్వం వహించడం, జనరల్ అసెంబ్లీలో అణుశక్తి గురించి మాట్లాడ్డం ఆనందంగా ఉందన్నారు. వినాశనానికి కాకుండా ప్రజాహితానికి అణుశక్తిని ఎలా వినియోగించాలో వివరించినట్లు ఎంపీ పురందేశ్వరి చెప్పారు. ముఖ్యంగా కాన్సర్ వంటి చికిత్సలకు, విద్యుత్ ఉత్పత్తి వంటి అభివృద్ధి కోసం ఎలా వినియోగించవచ్చో వివరించినట్లు తెలిపారు. స్థానిక క్వారీ ప్రాంతంలోని జిల్లా బిజెపి కార్యాలయంలో శనివారం ఉదయం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే 200స్థానాలకు పైగా గెలుచుకోవడం అద్భుత విజయమని ఆమె అన్నారు. సుపరిపాలనకు, అభివృద్ధికి, సంక్షేమానికి బీహార్ ప్రజలు స్పష్టమైన సంకేతం ఇచ్చారని ఎంపీ పురందేశ్వరి పేర్కొన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్ ద్వారా బీహార్ రాష్ట్రం అభివృద్ధి సంక్షేమంలో మరింత ముందుకు వెళుతుందని ప్రజలు విశ్వసించి, ఎన్డీయేకు పెద్ద పీట వేశారని ఆమె విశ్లేషించారు . ఈ విజయాన్ని బాధ్యతగా తీసుకుని ఎన్డీయే పాలన సాగిస్తుందన్నారు. రాజమండ్రి పార్లమెంట్ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా రాజమండ్రి రైల్వే స్టేషన్ కి 270 కోట్లు తెచ్చామని ఎంపీ పురందేశ్వరి ప్రస్తావించారు. గోదావరి పుష్కరాలలోగా పనులు పూర్తిచేయడానికి వీలుగా ఫ్లాట్ ఫారమ్స్, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, స్టేషన్ కి ఇరువైపులా అభివృద్ధి పనులు ఇలా 3 ప్యాకేజ్ లు గా విభజించి టెండర్లు పిలవాలని రైల్వే మంత్రి అశ్వినీ విష్ణవ్ తో మాట్లాడినట్లు ఆమె తెలిపారు. త్వరలోనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తారని ఎంపీ పురందేశ్వరి తెలిపారు. ఈస్ట్ రైల్వే స్టేషన్ వైపు రోడ్డు విస్తరణ పనులలో జాప్యాన్ని కూడా అధిగమిచనున్నట్లు ఆమె సూచించారు. కొవ్వూరులో రెండు రైళ్లు, ఆపడానికి అనుమతి తెచ్చామని అలాగే అనపర్తిలో జన్మభూమి ఎక్స్ ప్రెస్ ఆపాలన్న డిమాండ్ ని ఎన్నికల సమయంలో ప్రజలు తమ దృష్టికి తేవడంతో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని రైల్వే మంత్రి అశ్వని వైష్ణవ దగ్గరకు తీసుకెళ్లి వివరించామని ఎంపీ పురందేశ్వరి గుర్తుచేసారు. జన్మభూమి హాల్ట్ కి కూడా అనుమతి వచ్చిందన్నారు. పొగాకు రైతులు అధిక పంటపై పెనాల్టీ గతంలో రద్దుచేయించామని, అయితే ఇప్పుడు కూడా అధికం గా పంట పండించారని, ఈ విషయాన్నీ కేంద్రమంత్రి పియూష్ గోయల్ దృష్టికి తీసుకెళ్లామని, స్లాబ్ వారీగా తగ్గించే కార్యక్రమం చేయనున్నట్లుతెలిపారు.



# భక్తులతో పోటెత్తిన కాణిపాకం ఆలయం

## - దర్శనానికి నాలుగు గంటల సమయం

**కాణిపాకం, నవంబర్ 15 ప్రభాతవార్త:** కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి అలయం శనివారం భక్తుల రద్దీతో పోటెత్తింది. సాధారణంగా ఆలయంలో వారంతపు రోజులు శని, ఆదివారాలు, వరుస సెలవు రోజుల్లో భారీ స్థాయిలో రద్దీ వుంటుంది. ఈమేరకు శని,ఆదివారాలు వారాంతపు రోజులు కావడంతో శనివారం ఆలయ దర్శనార్థం పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు.

ఉభయ తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాలకు చెందిన భక్తులతో పాటు తిరుమల వెళ్ళే భక్తులు కూడా కాణిపాకం స్వామివారి దర్శనార్థం పెద్దఎత్తున తరలి రావడంతో ఆలయంలో తీవ్రస్థాయిలో రద్దీ నెలకొంది. దీనితో ఆలయంలోని క్యూలైన్లుతో పాటు క్యూకాంప్లెక్స్ పూర్తిగా నిండి పోవడంతో ఆలయం వెలుపల బారులు తీరి నిలబడ్డారు. దీనితో భక్తులు గంటల తరబడి స్వామి దర్శనం కోసం వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. 100 రూపాయల శీఘ్రదర్శనం, 150 రూపాయల అతిశీఘ్రదర్శనం టిక్కెట్లు తీసుకున్న భక్తులు కూడా క్యూకాంప్లెక్స్, క్యూలైన్లులో సుమారు మూడు నాలుగు గంటల సమయం వరకు వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేపట్టారు.

# ప్రకృతికి చేసిన ద్రోహానికి తగిన మూల్యం తప్పదు

## - 'ఎక్స్' ఆపరేషన్ అరణ్య అనే హ్యాష్‌ట్యాగ్‌తో డి సిఎం పవన్ పోస్టు
## -విశాఖ నగరంలో భారీ ఎత్తున అక్రమ గోమాంసం నిల్వలు బయటపడిన ఘటనపై అసహనం

**విజయవాడ,నవంబరు 15,ప్రభాతవార్తప్రతినిధి:** అడవులు ప్రకృతికి జరిగిన ద్రోహనికి బాధ్యులైన వారు తగిన మూల్యం చెల్లించక తప్పదని జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హెచ్చరించారు.ఈ మేరకు ఆయన చేసిన ఒక ట్వీట్ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఆపరేషన్ అరణ్య అనే హ్యాష్‌ట్యాగ్‌తో ఆయన పెట్టిన పోస్ట్, ఎర్రచందనం స్మగ్లింగ్‌పై ప్రభుత్వం ఉక్కుపాదం మోపడానికి సిద్ధమవుతోందనే బలమైన సంకేతాలను ఇస్తోంది. శేషాచలం, తూర్పు కనుమల్లో సహజ వనరుల దోపిడీపై ఆయన చేసిన వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయి.కొంతకాలం క్రితం తాను ది వైల్డ్ ఈస్ట్ అనే పుస్తకాన్ని చదవడం ప్రారంభించానని, అందులోని వివరాలు తనను తీవ్రంగా ఆశ్చర్యపరిచాయని పవన్ కల్యాణ్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. "వ్యవస్థ కళ్లెదుటే శేషాచలం, తూర్పు కనుమల్లోని ఎర్రచందనం, మన అమూల్యమైన సహజ సంపదను ఎలా దోచుకున్నారో ఈ పుస్తకం కళ్లకు కట్టినట్టు చూపిస్తుంది. రాజకీయం ముసుగులో దాక్కున్న



కొందరు నేతలు పూర్తిస్థాయి మాఫియా డాన్లలా ఎలా వ్యవహరించారో ఇది బహిర్గతం చేస్తుంది" అని ఆయన వివరించారు. పుస్తకంలోని ఒక పాత్ర తనను ప్రత్యేకంగా ఆకట్టుకుందని పవన్ తెలిపారు. "ఓ చిన్నపాటి కాంట్రాక్టర్, అధికార దాహంతో ఎర్రచందనం స్మగ్లింగ్ సామ్రాజ్యానికి అధినేతగా ఎలా మారాడో రచయిత అద్భుతంగా చూపించారు. అది చదువుతుంటే కేవలం నేరాన్ని అర్థం చేసుకోవడమే కాదు.. మన నేల, అడవులు, ప్రకృతి, ప్రజలకు జరిగిన ద్రోహాన్ని అనుభూతి చెందవచ్చు" అని ఆయన వివరించారు. ఇక అటవీ భూముల పరిరక్షణకు ఉద్దేశించిన చట్టంచట్టం కఠినంగానే ఉందిటవీ భూముల పరిరక్షణకు ఉద్దేశించిన చట్టం కఠినంగా ఉందని పవన్ కల్యాణ్ మరో "ఎక్స్" పోర్టులో స్పష్టం చేసారు.. చట్టం ప్రకారం ముందుకు వెళ్లాల్సి న విధి అధికార యంత్రాంగంపై ఉంది. అటవీ ఆస్తులను కబ్జా చేస్తే కఠిన చర్యలకి ఉపక్రమించండి. మంగళంపేట అటవీ భూముల వ్యవహారం చూస్తే చట్టం కఠినంగా ఉన్నా అమలు ఆ విధంగా లేకపోవడం మూలంగానే ఆక్రమణలు సాగాయి. మంగళంపేట సర్వే నంబరు 295, 296ల్లో ఉన్న అసలు భూమి విస్తీర్ణం ఎంత..? అది కాలానుగుణంగా ఎలా పెరిగింది అనేది కీలకమైన అంశం. సర్వే నంబర్లను సబ్ డివిజన్ చేసి, అటవీ భూములను ఓ ప్రణాళిక ప్రకారం కలిపేసుకున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. రిజిస్ట్రేషన్ చేసే సమయంలో ఓ రకమైన భూ లెక్కలు, అండంగల్ లో మరో రకం భూ లెక్కలు కనిపిస్తున్నాయి. వెబ్ ల్యాండ్ నమోదులోనూ మతలబు ఉన్నట్టు కనిపిస్తోంది. ఇదంతా ఎలా జరిగింది..? ఎవరి ప్రమేయం ఉంది అనే అంశాలపై దృష్టి పెట్టాలి.

# విశాఖలో అక్రమంగా గోమాంసం నిల్వ

## డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ సీరియస్

**(విశాఖ క్రైమ్ ప్రభాతవార్త)** విశాఖలో అక్రమంగాగో మాంసం నిల్వ ఘటనపై డిప్యూటీసీఎం పవన్ కల్యాణ్ సీరియస్ అయ్యారు..గో మాంసం నిల్వ చేసిన ముఠాఅసలు మూలాలు వెంటనే బయటపడాలంటూ.. విశాపోలీసులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ ఘటవెనుక ఎవరి ప్రమేయం ఉన్నా.. ఎలాంటి ఉపేక్ష ఉండదనిఆయన తేల్చి చెప్పారు. విశాఖలో భారీ స్థాయిలో గోమాంసంనిల్వలు వెలుగులోకి రాగానే.. పవన్ కల్యాణ్ స్వయంగాపోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి కు కాల్ చేసి కేసుకు సంబంధించిపూర్తి వివరాలు తెలుసుకున్నారు. అంత పెద్ద ఎత్తున గోమాంసాన్ని ఒకే చోట ఎలా నిల్వ చేశారో? ఎక్కడి నుంచితెచ్చారో? ఎక్కడికి తరలించడానికి సిద్ధమయ్యారో? వీటిఅన్నిటి పై ఆయన వివరంగా ఆరా తీశారు.డిఆర్ఐ అధికారులు మిత్ర కోల్డ్ స్టోరేజీలో.. 1.89 లక్షల కిలోగోమాంసాన్ని స్వాధీనం చేసుకున్నట్లు.. ఆ తర్వాత కేసునుపోలీసులకు అప్పగించినట్లు పోలీస్ కమిషనర్ బాగ్చి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కు వివరించారు. దాడుల సమయంలోకోల్డ్ స్టోరేజ్ నిర్వాహకులను అదుపులోకి తీసుకుని విచారకొనసాగుతోందని కూడా తెలిపారు. ఈ గోమాంసం ఎక్కడినుంచి తెచ్చారు? అక్రమ రవాణా నెట్వర్క్ ఎంత పెద్దది?అవసరమైన అనుమతుల విషయంలో ఏయే ఉల్లంఘనలుజరిగాయి.

# తిరుమల సమాచారం

## దేశవ్యాప్తంగా శ్రీవారి ఆలయాల నిర్మాణం వేగవంతంచేయాలి

### - అమరావతి, ఒంటిమిట్ట, తిరుచానూరు ఆలయాల మాస్టర్‌ప్లాన్‌లపై సూచనలు - ఇఒ సింఘాల్



**తిరుమల,నవంబర్ 15ప్రభాతవార్తప్రతినిధి:** హిందూ సనాతనధర్మాన్ని మరింతగా వ్యాప్తి చేయడానికి, మతమార్పిడిలను అడ్డుకట్టవేయడానికి దేశవ్యాప్తంగా శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్ అధికారులను ఆదేశించారు. అన్ని రాష్ట్రాల రాజధానుల్లో శ్రీవారి ఆలయాల నిర్మాణానికి సంబంధించి ఆయా రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులతో ఉత్తరప్రత్యుత్తరాలను మరింతగా పరిశీలించాలన్నారు. రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతాల్లో ఆలయాల నిర్మాణం కోసం భూసేకరణకు సంబంధించి ఆయా జిల్లాల కలెక్టర్లకు లేఖలురాయాలని ఇఒ సూచించారు.అమరావతి, ఒంటిమిట్ట, తిరుచానూరు ఆలయాల మాస్టర్‌ప్లాన్‌లపై ఇంజనీరింగ్ అధికారులతో చర్చించి, ఆలయాల్లో లైటింగ్స్,గ్రిల్స్ విషయాలపై ఆర్కిటెక్ అధికారుల సూచనలు తీసుకోవాలన్నారు. శనివారం సాయంత్రం టిటిడి పరిపాలన భవనంలో టిటిడి జెఇఒ వీరబ్రహ్మం, సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ, ఎఫ్ఎసిఎఒ ఓ.బాలాజీ, సిఇ సత్యనారాయణ, ఐటి జిఎం డి.ఫణికుమార్‌నాయుడు, రవాణ జిఎం శేషారెడ్డి, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి తదితరులతో కలసి ఇఒ సింఘాల్ పలు విషయాలపై సమీక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుమలలో శ్రీవారి భక్తుల సౌకర్యార్థం,వివిధ ప్రాంతాలను భక్తులు సులువుగా గుర్తించేలా సూచిక బోర్డులను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలన్నారు. టిటిడి ఆలయాల్లో ఉత్సవాల సమయంలో ఆలయాల సుందరీకరణలో భాగంగా ఉద్యానవనవిభాగం, విద్యుత్‌విభాగం సమన్వయంతో పనిచేయాలన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న టిటిడి భూముల మాస్టర్‌డేటా బేస్‌ను ఏర్పాటుచేయాలని, కల్యాణమండపాల నిర్వహణపై నివేదిక తయారుచేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

## తిరుచానూరు ఆలయానికి నగదు లెక్కింపు యంత్రం విరాళం



**తిరుమల,నవంబర్ 15ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుచానూరు శ్రీపద్మావతిఅమ్మవారికి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖ నగదు లెక్కింపు యంత్రాన్ని విరాళంగా అందించారు. శనివారం ఉదయం 3.45లక్షల రూపాయలు విలువైన ఈ యంత్రాన్ని యోగిమల్లవరం శాఖ నగదు లెక్కింపు యంత్రాన్ని అమ్మవారి ఆలయ డిప్యూటీ ఇఒ పి.హరీంద్రనాథ్, ఆలయ ఏఇఒ దేవరాజులు, ఇన్‌స్పెక్టర్ చలపతిరి అందజేశారు. అనంతరం బ్యాంకు అధికారులకు ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం చేయించితీర్థప్రసాదాలు అందజేశారు.

## బూందీపోటుకు అధునాతన కన్వేయర్ బెల్ట్

### - ముడిపదార్థాల రవాణాకు సులభ ప్రక్రియ



**తిరుమల,నవంబర్ 15ప్రభాతవార్తప్రతినిధి:** అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి లడ్డూల తయారీలో ముందుగా బూందీ తయారీ సామర్థ్యం పెంచేందుకు వీలుగా ముడిపదార్థాలు రవాణాకు అధునాతన కన్వేయర్ బెల్ట్ ఏర్పాటుచేస్తున్నారు. ఇప్పటికే నూతన కన్వేయర్‌బెల్ట్ యంత్రంతిరుమలకు చేరుకుంది. తిరుమలలో భక్తుల భద్రతను మెరుగుపరచడానికి లడ్డూ ప్రసాదాల తయారీలో సామర్థ్యాన్ని పెంచడానికి కొత్త కన్వేయర్‌బెల్ట్‌లు ఏర్పాటవుతున్నాయి. కొత్తసదుపాయంతో బూందీ తయారీకి ముడిపదార్థాలు తరలించడం,లడ్డూలను విక్రయశాలకు తరలించే విధానం వేగంగా జరగనుంది. ఈ మార్పులు తిరుమల ఆలయ నిర్వహణలో సామర్థ్యాన్ని ,భక్తులకు మెరుగైన సౌకర్యాన్ని అందించేందుకు టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్, అదనపు ఇఒ చిరుమామిళ్ళవెంకయ్యచౌదరి చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే తిరుమలలో ఆలయానికి వెనుకవైపు ఉగ్రాణం నుండి దేవదేవునికి నిత్యనైవేద్యాల ప్రసాదాల తయారీకి వినియోగించే అన్ని ముడిపదార్థాలను, చక్కెర,బియ్యం, నెయ్యి వంటి వాటిని కన్వేయర్‌బెల్ట్‌ద్వారానే ఆలయంలోపలకు చేరవేస్తున్న విధానం అమలవుతోంది. ఇక్కడ సిబ్బంది అనుక్షణం అప్రమత్తతతో దీన్ని నిర్వహిస్తున్నారు. ఆలయంలోపలకు మహద్వారం మీదుగా తీసుకెళ్లడం భక్తులకు అసౌకర్యంగా, ఇబ్బందికరంగా మారుతుంది. ఈ నేపథ్యంలో కన్వేయర్‌బెల్ట్ యంత్రం ద్వారా సులభంగా నేరుగా వకుళమాత పోటకు చేరవేస్తున్నారు.


## క్రికెట్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

### - భారత మహిళ క్రికెటర్ చరణికి టిటిడి ఛైర్మన్ ఆశీర్వాదం



**తి ం వ ల , న వ ం బ ం 15ప్రభాతవార్తప్రతినిధి:** భారత మహిళ క్రికెటర్ చరణి భవిష్యత్తులో క్రికెట్‌లో మరిన్ని ఉన్నతశిఖరాలను అధిరోహించాలని ,ఇందుకు ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆశీస్సులు కలగాలని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు ఆకాంక్షించారు. మహిళా క్రికెట్ వరల్డ్‌కప్ పోటీల్లో భారత్ జట్టు ఘనవిజయం సాధించిన నేపథ్యంలో చరణి కుటుంబంతో కలసి తిరుమలకుకాలినడకన వచ్చారు.శనివారం ఉదయం నైవేద్యవిరామ సమయంలో ఆలయం వద్దకు రాగానే ఆలయ అధికారులు స్వాగతం పలికి ఆమెకు, కుటుంబసభ్యులకు శ్రీవారి దర్శనం చేయించారు. ఆలయంలో రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. దేవదేవుడు తిరుమల శ్రీవారి ఆశీస్సులతోనే ప్రపంచకప్‌లోరాణించామని చరణి తెలిపారు. తనకెంతో ఆనందంగా ఉందన్నారు. అనంతరం ఆమె తిరుమలలోని ఛైర్మన్ బిఆర్‌నాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. ఛైర్మన్ నాయుడు, బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి చరణిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా దుశ్శాలువ కప్పి శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## టిటిడికి రూ.74లక్షల విద్యుత్ బస్సు విరాళం



**తిరుమల,నవంబర్ 15ప్రభాతవార్తప్రతినిధి:** దేవునిపట్ల భక్తివిశ్వాసాలతో దాత 74.24లక్షలు విలువైన విద్యుత్‌బస్సును విరాళంగా అందించారు. శనివారం ఉదయం పూణేకు చెందిన పినాకిల్ మొబిలిటీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ యాజమాన్యం ఆలయం ముందు పూజలుచేసి తాళాలను, రికార్డులను ఆలయ డిప్యూటీ ఇఒ ఎం.లోకనాథం, డిఐ వెంకటాద్రినాయుడుకు అందజేశారు. భక్తులను ఉచితంగా తరలించేందుకు ఈ బస్సును వినియోగించుకోనున్నారు.

## ఇద్దరు ఎర్రచందనం దొంగలు అరెస్ట్

**తిరుమల,నవంబర్ 15ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలలో పోలీసులు, టాస్క్‌ఫోర్స్ అధికారులు ఇద్దరు ఎర్రచందనం దొంగలను అరెస్ట్ చేశారు. వారినుండి కారును స్వాధీనం చేసుకున్నారు. శ్రీవారిమెట్టుమార్గంలో అక్రమంగా రవాణా చేస్తున్న తొమ్మిది ఎర్రచందనం దుంగలను పట్టుకున్నారు. కూంబింగ్‌లో ఈ అక్రమరవాణా, స్మగ్లర్లు తమిళనాడు కృష్ణగిరి ధర్మపురికి చెందినవారని ఎస్పీ శ్రీనివాసులు తెలిపారు.

# విజయవాడ విమానాశ్రయానికి పూర్వవైభవం : విప్ యార్లగడ్డ

**గన్నవరం, నవంబర్ 15, ప్రభాతవార్త :** విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయానికి పూర్వవైభవం తెచ్చేందుకు కేంద్రప్రభుత్వ సహకారంతో కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషిచేస్తుందని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ భరోసా ఇచ్చారు. ఇండిగో సంస్థ ఏర్పాటు చేసిన విజయవాడ-సింగపూర్ డైరెక్ట్ విమానసర్వీసును శనివారం ఉదయం గన్నవరం విమానాశ్రయంలో యార్లగడ్డ జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా విమానాశ్రయ టెర్మినల్‌లో జరిగిన కార్యక్రమంలో కేకుకోసి, మొదటి ప్రయాణికునికి బోర్డింగ్‌పాస్‌ను యార్లగడ్డ చేతులమీదుగా అందచేసారు. ఈసందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ 2014-19 మధ్యకాలంలో టిడిపి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు గన్నవరం విమానాశ్రయంలో ప్రయాణికుల వార్షిక సగటు ప్రపంచంలోనే మొదటి స్థానంలో ఉండని, తదుపరి వచ్చిన వైసిపి ప్రభుత్వం పట్టించుకోకపోవటంతో విమాన సర్వీసులు తగ్గిపోవటంతో ప్రయాణికుల సంఖ్య తగ్గిపోయిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత చంద్రబాబునాయుడు చేపట్టిన చర్యలకు తోడు కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు చొరవతో గన్నవరం విమానాశ్రయానికి విమానసర్వీసులు పెరిగాయని చెప్పారు. ప్రస్తుతం రోజుకు 45 విమానసర్వీసులు అందుబాటులో ఉండగా 4వేలమంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నట్లు వివరించారు.

## ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతను పాటించాలి

పొన్నూరు, నవంబరు 15,ప్రభాతవార్త: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతను తప్పనిసరిగా పాటించాలని మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు సూచించారు. ప్రతి నెలా మూడో శనివారం స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని నేతాజీనగర్ మునిసిపల్ హైస్కూల్‌లో విద్యార్థులకు చేతులు శుభ్రపరచుకొనుట, పబ్లిక్ టాయిలెట్లను వాడుకొనే విధానం, బహిరంగ మల,మూత్ర విసర్జన రహిత పట్టణంలో మార్చేందుకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి రోజూ భోజనం చేసే ముందుకు చేతులు శుభ్రపరచుకోవాలని సూచించారు. బహిరంగ మల, మూత్ర విసర్జనలు నిషేధించి పబ్లిక్ టాయిలెట్లు వాడుకోవాలని తెలిపారు. మన పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే అద్భుతా పర్యావరణం పరిశుభ్రంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ డిఇ వెంకయ్య, ప్రధానోపాధ్యాయుడు కాకుమాను లాజరుబాబు, ఉపాధ్యాయుడు నాగశ్రీనివాస్, నాయకులు మాదల వెంకటేశ్వరరావు, ఆకుల సాంబశివరావు, లక్ష్మీనారాయణచౌదరి, విన్నమనేని కోటేశ్వరరావు,ముగ్గుబేగ్, దేశంశెట్టి సూర్య తదితరులున్నారు.

## గోకులం షెడ్ల పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

పొన్నూరు, నవంబరు 15,ప్రభాతవార్త: పశుపోషకులు, పశు సంరక్షకులు గోకులం షెడ్ల పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఆత్మా ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటేశ్వరరావు కోరారు. మండల పరిధిలోని బ్రాహ్మణకోడూరు గ్రామంలో పాడిపశువుల పెంపకం, యాజమాన్యం, లింగ నిర్ధారిత వీర్యం యొక్క ప్రాధాన్యతనురైతులకు వివరించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పాడిపశువుల అభివృద్ధి ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తుందన్నారు. వీటిని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. పొన్నూరు వ్యవసాయ సహాయ సంచాలకురాలు వి.రామకోటేశ్వరి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టి ప్రధానమంత్రి కిసాన్ యోజన పీఎం కార్డులను గోకులం షెడ్లను, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద పశుగ్రాసాలు సాగును చేపట్టవచ్చన్నారు. ఈ విధానం రైతులకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. పశువైద్య వైద్యాధికారులు మాట్లాడుతూ దూడపుట్టిన వెంటనే తేనెరంతగాని ముర్రుపాలు తాపించడం, బొడ్డును టించర్ ఐడిన్‌తో అద్ది కత్తిరించడం, దూడలకు ఎటువంటి వ్యాధులు రాకుండా పుట్టిన 15రోజుల నుంచి క్రమం తప్పకుండా పశువైద్యుల సలహా మేరకు నట్టల నివారణ మందులు వాడాలన్నారు. పశువు కట్టడానికి ఎద లక్షణాలను గమనించడం సరైన ఎదలో ఉన్నప్పుడు వైద్యుని చేత ఎద ఇంజెక్షన్ చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల పశువైద్యాధికారులు డాక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, డాక్టర్ యాస్మిన్, డాక్టర్ ఉష, డాక్టర్ శైలజ, సర్పంచి అశోక్, రామినేని శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి పవర్‌లిఫ్టింగ్‌లో విజ్ఞాన్ విద్యార్థినికి బంగారు పతకం



చేబ్రోలు(పొన్నూరు), నవంబరు 15,ప్రభాతవార్త: మండల పరిధి వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీకి చెందిన ఈటూరి లక్ష్మీ వినయశ్రీ జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించి విశేష ప్రతిభ చాటిందని వర్సిటీ వైస్ చాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పి.నాగభూషణ్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా యూనివర్సిటీలో జరిగిన అభినంద కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీలో సీఎస్ఈ-ఏఐఎంఎల్ మొదటి సంవత్సరం చదువుతున్న లక్ష్మీ వినయశ్రీ డిసెంబర్ 2వ తేదీ నుంచి 6వ తేదీ వరకు హిమాచల్ ప్రదేశ్‌లో పవర్‌లిఫ్టింగ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన ఫెడరేషన్ కప్ (మెన్ అండ్ ఉమెన్) క్లాసిక్ అండ్ ఎక్విప్డ్ పవర్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో 84కిలోల విభాగంలో అద్భుత ప్రతిభ కనబర్చిందన్నారు. ఆఖరి రౌండ్‌లో బెంచ్ ప్రెస్, స్క్వాట్, డెడ్ లిఫ్ట్ అనే మూడు కేటగిరీల్లో కలిపి 287.5కిలోల బరువును ఎత్తి బంగారు పతకాన్ని కైవసం చేసుకుందన్నారు. ఈ విజయంతో లక్ష్మీ వినయశ్రీ వచ్చే ఏడాది మే నెలలో చైనాలో జరగబోయే ఏసియన్ గేమ్స్‌కు నేరుగా అర్హత సాధించిందన్నారు. ఇది విజ్ఞాన్ యూనివర్సిటీకే గర్వకారణమన్నారు. అదేవిధంగా క్రీడల్లో ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులను ప్రోత్సహించడంలో భాగంగా, లక్ష్మీ వినయశ్రీ ప్రతిభను ముందుగానే గుర్తించి వర్సిటీ తరుపున 75శాతం ఫీజు మినహాయింపు ఇచ్చినట్లు తెలిపారు. క్రీడల ద్వారా యూనివర్సిటీ పేరు దేశవ్యాప్తంగా నిలబెట్టినందుకు ఆమెను ప్రశంసించారు. మా విద్యార్థులు అకాడెమిక్స్‌తో పాటు క్రీడల్లో కూడా అత్యున్నత స్థాయిలో ప్రతిభ చూపించడం ఆనందదాయకమన్నారు. బంగారు పతకం సాధించిన ఈటూరి లక్ష్మీ వినయశ్రీ మాట్లాడుతూ విజయం సాధించడానికి తల్లిదండ్రులు, కోచ్‌లు, యూనివర్సిటీ అందించిన సహకారం ఎంతో దోహదపడిందన్నారు. ఈ విజయం నాకు కొత్త ఆరంభం. ఏసియన్ గేమ్స్‌లో పతకం సాధించి దేశానికి గౌరవం తీసుకురావడమే నా తదుపరి లక్ష్యమని తెలిపారు. బంగారు పతకం సాధించిన ఈటూరిలక్ష్మీ వినయశ్రీని యూనివర్సిటీ వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, ఫిజికల్ డైరెక్టర్లు, కోచ్‌లు విద్యార్థులు ఘనంగా అభినందించారు.

## రైతుల సంక్షేమం-పారదర్శక సేవలే డీసీఎమ్మెస్ లక్ష్యం

పొన్నూరు, నవంబరు 15,ప్రభాతవార్త: రైతుల సంక్షేమం, పారదర్శక సేవలు, మెరుగైన మార్కెటింగ్ సౌకర్యాలు సుస్థిర వ్యవసాయ అభివృద్ధికి సహకార వ్యవస్థ కీలకభూమిక పోషిస్తుందని జీడీసీఎమ్మెస్ ఛైర్మన్ వడ్రాణం హరిబాబు అన్నారు. 72వ అఖిల భారత సహకార వారోత్సవాలలో భాగంగా కార్యాలయంలో జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వడ్రాణం హరిబాబు మాట్లాడుతూ ఈ సహకార ఉద్యమంలో ఏడు రంగుల ఐక్యత, నమ్మకం, సహకారం, సమిష్టి అనే విలువలను ప్రతిబింబిస్తూ, సహకారం ద్వారా సమృద్ధి సాధించే భారత లక్ష్యానికి ప్రతీకగా నిలుస్తున్నాయన్నారు. రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం ఎప్పుడూ ముందు వరుసలో ఉంటుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వారి శ్రేయస్సు కోసం కృషి చేస్తున్నారన్నారు. సహకారం నుండి సమృద్ధి-ఆత్మనిర్భర్ భారత్ సాధనలో సహకార సంఘాలు అనే థీమ్‌తో దేశవ్యాప్తంగా వారోత్సవాలు వారం రోజుల పాటు నిర్వహించనున్నట్లు చెప్పారు. రైతులు పండించిన ధాన్యాన్ని రైతు సేవాకేంద్రాల ద్వారా విక్రయించుకొని మద్దతు ధర పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోఆపరేటివ్ జోనల్ ఆఫీసర్ వేదాంతరెడ్డి, డీసీఓ వీరారెడ్డి, సీనారెడ్డి, డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ హరగోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

## కార్తీక వన సమారాధనలు ఆరోగ్యాన్ని పెంచుతాయి

అమర్తలూరు(పొన్నూరు), నవంబరు 15,ప్రభాతవార్త: కార్తీక వన సమారాధనలు మానవుల ఆరోగ్యాన్ని పెంచుతాయని కార్యనిర్వహణాధికారి ఎన్‌వివిఎన్ మల్లేశ్వరి చెప్పారు. అమర్తలూరు మండల పరిధిలోని మూల్పూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీరాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వరస్వామివారి దేవాలయంలో కార్తీక వన సమారాధన జరిగింది. ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారి ఎన్‌వివిఎన్ మల్లేశ్వరి మాట్లాడుతూ కార్తీక మాసం అత్యంత పవిత్రమైన మాసమన్నారు. ఈ మాసంలో నెల రోజులపాటు ఉపవాస దీక్షలు చేసి మంచి ఆరోగ్యాన్ని పొందుతారన్నారు. పవిత్ర స్నానం, నేల మీద పడుకోవడం, శాకాహార భోజనం ఇవన్నీ మానవులకెంతో ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయన్నారు. మల్లేశ్వరి స్వయంగా భక్తులకు వడ్డన చేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు ధనుంజయ శర్మ, మామిళ్ళపల్లి మృత్యుంజయ శివాచార్య, భక్తులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ రహిత మంగళగిరి వైపు మరో అడుగు

మంగళగిరి, నవంబర్ 15, ప్రభాతవార్త: మంగళగిరి-తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ రహిత మంగళగిరి లక్ష్యంగా చేపట్టిన కార్యక్రమంలో మంగళగిరి పట్టణంలోని మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో రైతు బజార్ వద్ద ఏటీబీ (ఆటోమేటెడ్ ట్రాష్ బిన్) మిషన్లను శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ప్యూర్ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ ఆరుద్ర భూలక్ష్మి, మంగళగిరి మార్కెట్ యార్డ్ ఛైర్మన్ జవ్వాది కిరణ్ చంద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అలీంభాష, మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు నల్లగొండ పరమేశ్వరరావు, బైరబోయిన వద్యావతి, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం తగ్గించేందుకు, పట్టణాన్ని శుభ్రంగా-హరితంగా మార్చేందుకు ఈ ఏటీబీ మిషన్లు ఉపయోగపడతాయని తెలిపారు. ప్రజలు ప్లాస్టిక్ వ్యర్థాలను వీటిలో వేయడం ద్వారా తగిన భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## కెఎల్‌యు లో ఘనంగా 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

తాడేపల్లి,నవంబర్ 15,ప్రభాతవార్త : కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా ప్రారంభించారు.ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైనవారి టి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు మాట్లాడుతూ జీవితంలో విద్యావ్యాసంగం ప్రాధాన్యతను హైలైట్ చేసి కెఎల్ సెంట్రల్ లైబ్రరీని ఆసియాలో అత్యుత్తమ గ్రంథాలయాల్లో ఒకటిగా అభివర్ణించారు.గ్రంథాలయాలు సృజనాత్మకత,ఆలోచనా శక్తిని పెంపొందించే విద్యా కేంద్రాలని అన్నారు.సమాజాన్ని కలిపే వేదికలుగా,జీవితాంతం విద్యను ప్రోత్సహిస్తాయన్నారు . సందర్భంగా విద్యార్థులకు పలురకాల క్విజ్ పోటీలు,వ్యాస రచన పోటీలను నిర్వహించారు. విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

# నాణ్యత విషయంలో విద్యార్థులు, తల్లితండ్రుల అభిప్రాయాలను పరిగణనలోనికి తీసుకోవాలి

**స్థానిక అశోక్ నగర్ లోని కె.పి . డి టి హైస్కూల్ ని ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్ కె. వెట్రిసెల్వి..**



విద్యార్థులతో కలిసి భోజనం చేసిన కలెక్టర్

**ఏలూరు, నవంబర్, 15 : ప్రభాతవార్త** ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యతను ఉపాధ్యాయులు పరిశీలించిన తరవాతే విద్యార్థులకు అందించాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి విద్యాశాఖాధికారులను ఆదేశించారు. స్థానిక అశోక్ నగర్ లోని కె.పి. డి టి హైస్కూల్ ని శనివారం కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేసి మధ్యాహ్న భోజనం నాణ్యత , విద్యా బోధనల స్థాయిలను కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థినీ, విద్యార్థులతో కలిసి కలెక్టర్, డీఈఓ సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం నాణ్యత విషయంలో ఏజెన్సీ వారు, ఉపాధ్యాయులు ఎటువంటి రాజీ పడవద్దన్నారు. విద్యార్థులు, వారి తల్లితండ్రుల సూచనలు, అభిప్రాయాలను పరిగణనలోనికి తీసుకోవాలని, మధ్యాహ్న భోజనం రుచి, శుచి తప్పనిసరిగా ఉండేలా ఉపాధ్యాయులు బాధ్యత వహించాలన్నారు. కె.పి. డి టి హైస్కూల్ లో భోజనం నాణ్యతను విద్యార్థులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. కొంతమంది విద్యార్థులు ఇంటివద్దనుండి బాక్స్ లలో భోజనాన్ని తీసుకురావడంపై కలెక్టర్ వారిని పిలిచి అందుకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ విద్యార్థులతో కలిసి భోజనం చేసి, నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులను సమస్యలను గురించి కలెక్టర్ అడుగగా, పాఠశాలలో ఫ్యాన్లు తక్కువగా ఉన్నాయని, విద్యార్థుల సంఖ్య కు అనుగుణంగా ఫ్యాన్లు ఏర్పాటుచేయాలని విద్యార్థులు కోరారు. ఈ విషయంపై వెంటనే చర్యలు తీసుకోవాలని డీఈఓ ను కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, అంగన్వాడీ లలో అందించే మధ్యాహ్న భోజనం పూర్తి నాణ్యతతో ఉండాలని, ఎంఈఓ లు, సంబంధిత [illegible] ప్రతిరోజు భోజనాన్ని తనిఖీ చేయడం, పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు, భోజనం నాణ్యతను పర్యవేక్షి[illegible] ఒకదం తమ పర్యటన లో ఒక భాగం చేసుకోవాలన్నారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్.. పాఠశాల తనిఖీలో భాగంగా 8వ తరగతిలో విద్యార్థినులను కలెక్టర్ కొన్ని ప్రశ్నలు వేశారు. ఇంగ్లీష్ పాఠ్యాంశాన్ని చదవవలసిందిగా కలెక్టర్ విద్యార్థినులను కోరగా, చదవలేకపోవడం, ఉపాధ్యాయులను ప్రశ్నించగా వారు కూడా సక్రమంగా జవాబు ఇవ్వకపోవడంపై కలెక్టర్ ఉపాధ్యాయులపై ఆగ్రహంవ్యక్తం చేశారు.

## విజయవాడలో నేడు రచయిత్రి గొల్లపల్లి లక్ష్మి స్మారక సాహిత్య పురస్కారాల ప్రదానం

**విజయవాడ,నవంబరు 15,ప్రభాతవార్తప్రతినిధి:** కవిత్వం , నానీలు , అంబేడ్కర్ గేయాల రచయిత, గొప్ప సాహిత్యాన్ని సృష్టించి తనదైన శైలిలో అనేకంశాల పట్ల అవగాహన కలిగిన రచయిత్రి గొల్లపల్లి లక్ష్మి స్మారక సాహిత్య పురస్కారాలను విజయవాడలో ఈ నెల 16న అందిస్తుందని బరవే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తంగిరాల సోనీ తెలిపారు.గొల్లపల్లి లక్ష్మి బుద్ధుడు దగ్గర నుంచి కాన్షీరాం , అంబేద్కర్ వరకు, అనేక సాహిత్య ప్రక్రియలలో సామాజిక దృక్పథంతో సాహిత్య సేవ చేసారని తెలిపారు.ఆమె పేరిట ఇచ్చే స్మారక ప్రతిభ పురస్కారాల సభ విజయవాడలో గల బుక్ ఫెస్టివల్ సొసైటి హాల్ నందు ఆదివారం ఉదయం 10గంలకు జరుగుతుందన్నారు.

## బిపిఎస్ స్కీమును సద్వినియోగం చేసుకోండి

పొన్నూరు, నవంబరు 15,ప్రభాతవార్త: మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ మంజూరు చేసిన నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనాల నియంత్రణ, జరిమానా విధింపుకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు తెలిపారు. నోటిఫికేషన్ ఉత్తర్వులను అనుసరించి 1-1-1985నుండి 31-8-2025లోపు ముందు మంజూరు చేసిన ప్లానుకు విరుద్ధంగా నిర్మించిన భవనాలను బిపిఎస్ స్కీము ద్వారా రెగ్యులర్ చేసుకోవచ్చున్నారు. అందుకు సంబంధించి రూ.10వేలు అపరాధ రుసుము ముందస్తుగా చెల్లించి సంబంధిత దస్తావేజుతో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. స్క్రూట్నీ తదుపరి నిబంధనల మేరకు మిగతా ఫీజులు చెల్లించాలన్నారు. నిర్ణీ వ్యవధి 12-11-2025 నుండి 120 రోజుల లోపు 12 మార్చి 2026లోపు దాఖలు చేసుకోవాలన్నారు. నివాస భవనాల ఎత్తు 18మీటర్లు దాటితే,వాణిజ్య భవనముల ఎత్తు 15మీటర్లు దాటితే ఫైర్ ఎన్‌వోసీ తప్పనిసరిగా సమర్పించాలన్నారు. 31-8-2025 తారువాత నిర్మించి భవనములు, అంతస్తులు అపరాధ రుసుముకు అర్హులు కారని తెలిపారు. ఈ స్కీముకు అర్హత కలిగి ఉండి సకాలంలో దరఖాస్తు చేసుకోక పోయిన భవనములను గుర్తించి చట్టప్రకారం చర్యలు తీసుకొంటామన్నారు. అందులో భాగంగా శనివారం సెట్ బ్యాక్ డీవియేషన్స్‌తో భావనారాయణపేటలో, 24వ వార్డులోని షాదీఖానా రోడ్డులోని రెండు భవన నిర్మాణాల డీవియేషన్స్ పోర్షన్‌ను శాఖాపరంగా తొలగించినట్లు పట్టణ ప్రణాళికాధికారి రఘురాం తెలిపారు.

## మహిళకు బాసటగా నిలిచిన ఛైర్మన్ వడ్రాణం హరిబాబు



పొన్నూరు, నవంబరు 15,ప్రభాతవార్త: అర్ధరాత్రి నల్లపాడు రోడ్డుపై అనారోగ్యంతో బోసిపోయి ఒంటరిగా పడి ఉన్న వజ్రమ్మ అనే వృద్ధురాలిని గుర్తించిన జీడీసీఎమ్మెస్ ఛైర్మన్ వడ్రాణం హరిబాబు తన వాహనాన్ని ఆపి ఆమెతో మాట్లాడారు. ఆమె అనారోగ్యంతో బాధపడుతుంటే ఆమెకు వైద్య సహాయం అందించి ఉదారతను చాటుకున్నారు. సొంతవాళ్ళు చూపించాల్సిన ప్రేమాభిమానాలను చూపించకుండా వారు రోడ్డుపై వదిలేసి వెళితే ఇలాంటి పరిస్థితుల్లోనే ఆదుకోవాలనే మానవత్వంతో వడ్రాణం స్పందించారు. ఆమెకు వైద్య పరీక్షల అనంతరం ఆమెను అనాథాశ్రమంలో చేర్పించారు. సమాజం ఎదగాలంటే పదవులు కాదు....ఇలాంటి హృదయం కావాలని....హరిబాబు నిరూపించారని పలువురు హరిబాబును కొనియాడుతున్నారు.

## భక్తిశ్రద్ధలతో వేణుగోపాస్వామికి పుష్పయాగం

మోపర్రు(పొన్నూరు), నవంబరు 15,ప్రభాతవార్త: అమర్తలూరు మండల పరిధిలోని మోపర్రు గ్రామంలో వేంచేసియున్న శ్రీ వేణుగోపాలస్వామివారికి కార్తీక మాస ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని వివిధ రకాల పుష్పాలతో పుష్పయాగం నిర్వహించారు. కార్యనిర్వహణాధికారి ఎన్‌విఎన్ మల్లేశ్వరి కార్యక్రమంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు అందుకున్నారు. అనతరం రాత్రికి స్వామివారికి కోటి దీపోత్సవం నిర్వహించారు. అర్చకస్వాములు బ్రిందావనం వెంకట దీక్షితులు, వేదాంతం సర్వభూమాచార్యులు, నారాయణం శ్రీహరిబాబు, వేదాంతం శ్రీనాథ్, బ్రిందావనం శశిధర్‌లు పూజాధికార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాద గోష్టి జరిగింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా కార్యనిర్వహణాధికారి ఎన్‌విఎన్ మల్లేశ్వరి నేతృత్వంలో సిబ్బంది ఏర్పాట్లు చేశారు.




## నిజమైన కార్యకర్తకు జనసేనలో ప్రత్యేక గుర్తింపు

పొన్నూరు, నవంబరు 15,ప్రభాతవార్త: జనసేన ముసుగులో ఉండి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి పనిచేసే వారిని పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించదని జనసేన పార్టీ నియోజకవర్గ నాయకుడు వడ్రాణం మార్కండేబాబు అన్నారు. మండల పరిధిలోని ఆరెమండ, దండమూడి గ్రామాల్లో జరిగిన జనసేన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మొదటి నుంచి జనసేన పార్టీకి అంకితభావంతో పనిచేసిన కార్యకర్తకు సముచిత స్థానం కల్పించడం జరుగుతుందన్నారు. టిడిపి, బిజెపి, జనసేన కూటమిగాను ముందుకెళ్తుందన్నారు. పార్టీకి అంకితభావంతో పనిచేసిన కార్యకర్తలకు కూటమి పక్షాన న్యాయం చేసే విధంగా చూస్తామన్నారు. త్వరలో జనసేన పార్టీ సభ్యత్వ నమోదును ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఈసారి గతం కన్నా ఎక్కువ మందిని సభ్యులుగా చేర్చేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో దేశంశెట్టి సూర్య, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఇహ-పర కోర్కెల సాధనకు సత్యదేవుని వ్రతాలు

పొన్నూరు, నవంబరు 15,ప్రభాతవార్త: కార్తీక మాసంలో మానవుల ఇహపర కోర్కెల సాధనకు శ్రీ రమా సహిత సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరించినట్లయితే సత్ఫలితాలు కలుగుతాయని శ్రీ వీరాంజనేయస్వామి దేవాలయం ముఖ్య అర్చకస్వామి అగ్నిహోత్రం వేంకట రాఘవ కృష్ణప్రసాద్(ఎవిఆర్‌కె ప్రసాద్) సూచించారు. స్థానిక శ్రీ సహస్రలింగేశ్వరస్వామి, శ్రీ వీరాంజనేయస్వామివారి దేవాలయ కళ్యాణ మండపంలో శనివారం ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీ రమా సహిత సత్యనారాయణస్వామివారి సామూహిక ఉచిత వ్రతాలను నిర్వహించారు. శ్రీ స్వామివారి కళ్యాణ మండపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కళ్యాణ వేదికపైకి శ్రీ స్వామివారిని వేంచేపు చేసి కళ్యాణోత్సవాన్ని అంత్యంత భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎవిఆర్కె ప్రసాద్ మాట్లాడుతూ హిందూ సంప్రదాయంలో శ్రీ రమాసహిత సత్యనారాయణ స్వామి వ్రతానికి చాలా ప్రాముఖ్యత ఉందన్నారు. ప్రతి ఒక్కరి జీవితంలో ఏవైనా ముఖ్యమైన శుభకార్యాలు జరిగిన ప్రతి సందర్భంలో ఈ సత్యనారాయణస్వామి వ్రతం ఆచరించడం అనాదిగా వస్తున్న ఆచారమన్నారు. సాధారణంగా వైశాఖ, శ్రావణ మాసాలు, ప్రతి నెలా ఏకాదశి లాంటి పర్వదినాల్లో ఈ సత్యనారాయణ స్వామి వ్రతాలు ఆచరించడం పురాణ కాలం నుంచి వస్తున్న సంప్రదాయమన్నారు. కార్తీక మాసం నెల రోజులపాటు అత్యంత పవిత్రంగా కార్తీక మాసాన్ని ఆచరిస్తారన్నారు. కార్తీక మాసం అంతా శివారాధనతో ఆలయాలన్నీ మార్మోగిపోతాయన్నారు. కొత్తగా పెళ్ళి అయినవారు, నూతన గృహ ప్రవేశం చేసినప్పుడు, నూతన కార్యక్రమాలు ప్రారంభించినప్పుడు విద్య, శ్రేయస్సు కోసం, ఆరోగ్య సమస్యలు, వ్యాపారంలో విజయం సాధించడం కోసం ఈ వ్రతాన్ని ఆచరించడం మంచిదన్నారు. సుమారు 120మంది దంపతులు ఈ కళ్యాణోత్సవంలో పాల్గొని వ్రతాలను ఆచరించారు.



## అర్బన్ పోలీసు స్టేషన్లో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర

మాచర్ల, నవంబరు 15 ప్రభాతవార్త: స్థానిక అర్బన్ పోలీసు స్టేషన్లో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా అర్బన్ సీఐ టి.వెంకటరమణ ఆధ్వర్యంలో ఎపోలీసులు భారీ స్థాయిలో శుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. పోలీసు స్టేషన్ ప్రాంగణం, చుట్టుపక్కల రహదారులు, పార్కింగ్ ప్రదేశాలను సిబ్బంది స్వచ్ఛందంగా శుభ్రం చేశారు. ఎస్సైలు వెంకటరావు, అనంతకృష్ణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

మాచర్ల, నవంబరు 15 ప్రభాతవార్త: స్థానిక 24వ వార్డుకు చెందిన బండారు చెన్నయ్య కుమారుడు బండారు శ్రీనివాసరావు అనారోగ్యంతో ఇటీవల వైద్యం చేయించుకుని ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయిన విషయం తెలుసుకొని మాజీ ఎమ్మెల్యే, పల్నాడు జిల్లా వైసీపీ అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పరామర్శించారు. శనివారం శ్రీనివాసరావు గృహానికి స్వయంగా వెళ్లి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఆయన వెంట స్థానిక నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## ఆవాస్ 2.0 సర్వేను తనిఖీ చేసిన హౌసింగ్ డీఈఈ

మాచర్ల, నవంబరు 15 ప్రభాతవార్త: తాళ్లపల్లిలో జరిగే ఆవాస్ 2.0 సర్వేను హౌసింగ్ డీఈఈ బాలోజీనాయక్ తనిఖీ చేసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంత స్థలం ఉండి, ఇల్లు లేని లబ్ధిదారులు తమ వివరాలు, స్థలం ఆవాస్ యాప్‌లో నమోదు చేసుకున్న వారికి మాత్రమే ప్రభుత్వం పక్కా ఇల్లు మంజూరు చేస్తుందన్నారరు. ఈ సర్వే ప్రతి గ్రామంలో జరుగుతుందని, ఈ నెల 30వ తేదీలోపు ప్రతి లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సర్వే చేస్తున్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈలు మరియదాసు, వర్క్ఇన్‌స్పెక్టర్ టి.అలీ, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ వై.సాయిప్రియా తదితరులు పాల్గొన్నారు.

## శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన

మాచర్ల, నవంబరు 15 ప్రభాతవార్త: మాచర్ల శాఖా గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం పుస్తక ప్రదర్శన నిర్వహించినట్లు గ్రంథాలయ ఇన్‌ఛార్జి మాచర్ల మెర్సీ అన్నారు. ఈ పుస్తక ప్రదర్శనలో పోటీ పరీక్షల పుస్తకాలు, ప్రముఖుల జీవిత చరిత్రలు, ఆధ్యాత్మిక పుస్తకాలు, రామాయణాలు, మహాభారతం, భాగవతం, మోరల్ స్టోరీస్ మొదలైన పుస్తకాలు ప్రదర్శనలో ఉంచి విద్యార్థులకు వివరించారు. గ్రంథాలయాలను విద్యార్థులు వినియోగించుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని మెర్సీ కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీ బాలికోన్నత పాఠశాల పీఈటీ నాగవేణి, శ్రీనివాసరావు, స్వరూప పాల్గొని ప్రసంగిస్తూ ప్రతి విద్యార్థి నిత్యం గ్రంథాలయానికి వచ్చి పుస్తక పఠనం అలవర్చుకోవాలని కోరారు. మొబైల్ ఫోన్లకు, టీవీలకు దూరంగా ఉండాలన్నారు.

## దేవాలయానికి ఎన్టీపీసీ ఆధ్వర్యంలో డస్ట్‌బిన్లు అందజేత

మాచర్ల, నవంబరు 15 ప్రభాతవార్త: స్థానిక వడ్డెర బజారులోని వెంకటేశ్వరస్వామి ఆలయానికి ఎన్‌టీపీసీ ఆధ్వర్యంలో రెండు డస్ట్‌బిన్లను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎన్టీపీసీ డీజీఎం దివాకర్ మాట్లాడుతూ ఎన్టీపీసీ ఆధ్వర్యంలో తాళ్లపల్లి, భైరవునిపాడు గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేశామన్నారు. మాచర్ల ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి తమ సంస్థ సహకారం అందించిందన్నారు. పచ్చదనం పరిశుభ్రతలో భాగంగా మొక్కలను నాటే కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు. స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆలయానికి డస్ట్‌బిన్లను అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు ఉప్పుతోళ్ల గోవిందరాజులు, కమిటీ సభ్యులు ఓరుగంటి చెన్నకేశవరావు, కొమెర శ్రీనివాసరావు, ఉప్పుతోళ్ల ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

## చెంచుకాలనీలో బాలల దినోత్సవ వేడుకలు

మాచర్ల, నవంబరు 15 ప్రభాతవార్త: స్వామి వివేకానంద ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో స్వామి వివేకానంద సేవాశ్రమం సమీపంలోని చెంచుకాలనీలో పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ 137వ జయంతి సందర్భంగా బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు ట్రస్టు ఫౌండర్, ఛైర్మన్ మెట్టు గోవిందరెడ్డి తెలిపారు. కాలనీలో చిన్నారులు, పెద్దలతో కలిసి నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గోవిందరెడ్డి మాట్లాడుతూ భారతదేశ తొలి ప్రధానిగా, పంచవర్ష ప్రణాళిక రూపశిల్పిగా, స్వాతంత్ర్య సమరయోధుడిగా, పేదల నాయకుడిగా భారతదేశానికి చేసిన సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. ఆర్టీసీ రాయప్ప, గుంటూరు ప్రభావతి, ఆర్టీసీ శ్రీనివాసరావు, చెంచు చిన్నారులు, పెద్దలు తదితరులు పాల్గొన్నారు. అనంతరం చిన్నారులకు దుస్తులు, మిఠాయిలు పంచిపెట్టారు.

## రోడ్ సేఫ్టీ, ట్రాఫిక్‌పై అవగాహన

మాచర్ల, నవంబరు 15 ప్రభాతవార్త: రోడ్ సేఫ్టీ, ట్రాఫిక్ నియమాలపై ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాన్ని మాచర్ల పట్టణ పోలీసు స్టేషన్లో సీఐ టి.వెంకటరమణ ఆధ్వర్యంలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రహదారి భద్రతా నియమాలను డ్రైవర్లు తప్పనిసరిగా పాటించాలన్నారు. రోడ్లపై ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించేలా ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలపకూడదన్నారు. వాహన తనిఖీల సమయంలో డ్రైవర్లు లైసెన్సులు, వాహన పత్రాలు కలిగి ఉండాలన్నారు. పోలీసులకు సహకరించాలన్నారు. ట్రాఫిక్ రూల్స్ అతిక్రమించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## పల్నాటి ఉత్సవాలకు నాగులేరు శుభ్రం

కారంపూడి, నవంబరు 15 ప్రభాతవార్త: పల్నాటి చరిత్రలో నాగులేరుకు ఒక విశిష్టత ఉంది. ఈ ప్రాంత ప్రజలు నాగులేరును దక్షిణకాశిగా అభివర్ణిస్తారు. ఈ నెల 19 నుంచి పల్నాటి వీరారాధనోత్సవాలు అయిదు రోజులపాటు జరుగుతాయి. ఈ ఉత్సవాల్లో ముఖ్య ఘట్టం నాగులేటిలో పల్నాటి ఉత్సవాల కొణతాలను నాగులేటి నీటితో శుభ్రపరచి ఉత్సవాలను ప్రారంభిస్తారు. పలు జిల్లాల నుంచి వచ్చే వీరాచారవంతులు నాగులేరులోని గంగధారి మడుగులో స్నానాలు చేసి వీర్ల దేవాలయంలో పూజలు నిర్వహిస్తారు. ఎంతో పవిత్రమైన నాగులేరును శుభ్రం చేసే పనిలో ఎంపీడీఓ గంటా శ్రీనివాసరెడ్డి, తహశీల్దారు వెంకటేశ్వర్లు నాయక్, ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరెడ్డి, పంచాయతీ కార్యదర్శి కసిన్యానాయక్, సర్పంచ్ సరస్వతిబాయి నాగులేరును శుభ్రం చేసే పనిలో నిమగ్నమయ్యారు. నాగులేరులో చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రం చేస్తున్నారు. దేవాలయ ప్రాంతంలో స్నానఘట్టాలు ఏర్పాటు చేసఉ్తున్నారు. స్నానాలు చేసే సమయంలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా బారికేడ్లు ఏర్పాటు చేయనున్నారు.

## వివేకానంద స్కూల్లో ఘనంగా బాలల దినోత్సవం

కారంపూడి, నవంబరు 15 ప్రభాతవార్త: స్థానిక వివేకానంద స్కూల్లో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు పాఠశాల ప్రిన్సిపల్ సత్యవతి, ఉమామహేశ్వరరావులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలల దినోత్సవం నేపథ్యంలో నవంబరు 2వ తేదీ నుంచి విద్యార్థులకు వివిధ అంశాలపై పోటీలు నిర్వహించామన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ వేడుకల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహించారు.

## చిన్ననాటి మిత్రుల ఆత్మీయ కలయిక

విజయపురిసౌత్, నవంబరు 15 ప్రభాతవార్త: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివిన 1983-84 పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆనాటి మిత్రులతో కలిసి పాఠశాలలో ఒక వేడుకలా పండుగ వాతావరణంలో ఉత్సాహంగా జరుపుకున్నారు. బిగ్‌హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక ఛైర్మన్ షేక్ చాంద్‌పాషా మిత్రులు అందరినీ ఒక దగ్గరకు చేర్చారు. ఈ వేడుకకు చాలామంది మిత్రులు సుదూర ప్రాంతాల నుంచి చేరుకున్నారు. 41 సంవత్సరాల తర్వాత కలుసుకున్న తమ మిత్రులను చూసి ఆనంద భాష్పాలతో భావోద్వేగానికి లోనై ఒకరిని ఒకరు ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. ఈ కలయిక మా మనసులకు కొత్త అనుభూతిని పంచిందని ఆనందాన్ని వ్యక్తం చేశారు. తాము చదువుకున్న పాఠశాలలో ఆనాటి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుంటూ ఉల్లాసంగా గడిపారు. పాఠశాల విడిచిన అనంతరం ఎక్కడెక్కడో స్థిరపడిన సుమారు 50 మందికిపైగా మిత్రులందరూ ఒక్కదగ్గర చేరి గెట్‌టుగెదర్ నిర్వహించారు. నాటి సంగతులను గుర్తు చేసుకుంటూ ఆనందంగా పలకరించుకున్నారు. ఈ కార్యక్రమంలో బాలునాయక్ సబ్ ఇన్‌స్పెక్టర్, చాగంటి పద్మ ఉపాధ్యాయులు, డేనియల్ దయాకర్ ప్రొఫెసర్, జక్కి ప్రభాకర్ ఉపాధ్యాయులు, జి.వసంత, మహమ్మద్ ఇంజినీర్, రత్నకుమారి, హన్నాకుమార్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## పల్నాటి వీరారాధనోత్సవాలకు జిల్లా అధికారులను ఆహ్వానం

కారంపూడి, నవంబరు 15 ప్రభాతవార్త: పల్నాటి వీరారాధనోత్సవాలకు కారంపూడి సిద్ధమైంది. అయిదు రోజులపాటు ఉత్సవాలు ఘనంగా జరగనున్నాయి. ఈ నేపథ్యంలో పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవ అయ్యవారు, పీఠం నిర్వాహకులు బొగ్గరం విజయ్, తహశీల్దారు వెంకటేశ్వర్లునాయక్, ఎంపీడీఓ గంటా శ్రీనివాసరెడ్డిలు జిల్లా అధికారులను కలిసి ఉత్సవాలకు ఆహ్వాన పత్రికలను అందించారు. జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, జిల్లా ఎస్పీ కృష్ణారావులను కలిసి ఆహ్వాన పత్రాలను అందజేశారు. ఈ నెల 21న జరగనున్న మందపోరు - చాపకూడు కార్యక్రమాలకు జిల్లా ప్రముఖులను ఆహ్వానించారు.

16-11pg10exKM 12 GNT_16-11pg10exKM.qxd 15/Nov/25 11:12 PM Page 1



## కుమామోటో మాస్టర్స్: సెమీస్‌లో లక్ష్య ఓటమి

**న్యూఢిల్లీ:** కుమామోటో మాస్టర్స్ 2025, సెమీస్‌లో కెంటా నిషిమోటో చేతిలో భారత్ షట్లర్ లక్ష్య సేన్ ఓటమిపాలయ్యాడు. జపాన్‌లోని కుమామోటో నగరంలో శనివారం జరిగిన మాస్టర్స్ సూపర్ 500 టోర్నమెంట్‌లో భారత ఏస్ లక్ష్య సేన్ సెమీఫైనల్స్ నుంచి నిష్క్రమించాడు. 77 నిమిషాల పాటు జరిగిన మూడు గేమ్‌ల మ్యాచ్‌లో అతను హోమ్



ఫేవరెట్ కెంటా నిషిమోటో చేతిలో 19-21, 21-14, 12-21 తేడాతో పరాజయం చెందాడు. దీంతో ఈ సంవత్సరంలో తన రెండవ ఫైనల్‌కు చేరుకోలేకపోయాడు. ఇండోనేషియా ఓపెన్ ప్రిక్వార్టర్ ఫైనల్ తర్వాత నిషిమోటోపై సేన్ వరుసగా ఇది రెండో ఓటమి. ఇప్పుడు వారి హెడ్‌టుహెడ్ రికార్డును 3-3తో సమం చేసింది. ఈరోజు జరిగిన సెమీస్‌లో లక్ష్య తొలి గేమ్‌లో మంచి ఆరంభాన్ని పొందినా, నిషిమోటో అతనిపై కొంత ఒత్తిడి తెచ్చాడు. గట్టి పోటి ఉన్న మొదటి గేమ్‌లో 19-21తో ఓడిపోయాడు. అదేవిధంగా, నిషిమోటో రెండవ గేమ్‌లో మంచి ఆరంభాన్ని పొందాడు, కానీ ఈసారి దాన్ని గోల్‌గా మార్చలేక పోవడంతో 14-21 తేడాతో ఓడిపోయాడు. ఇక చివరి గేమ్‌లో అనుభవజ్ఞుడైన జపనీస్ షట్లర్ ఆట అంతటా తన ఆధిక్యాన్ని కొనసాగించాడు. దీంతో టోర్నీని సులభంగా 21-12తో స్కోరు చేశాడు. ఫలితంగా మిగిలిన ఏకైక పోటీదారు లక్ష్య ఈ ఓటమితో కుమామోటో మాస్టర్స్‌లో సెమీఫైనల్ దశలో భారత్ ప్రచారం ముగిసినట్లయింది. ఈ ఫలితం ఈ సంవత్సరం వరల్డ్ టూర్ ఫైనల్స్‌లో స్థానం కోసం లక్ష్య ప్రయత్నం కూడా దాదాపు ముగిసింది. అతను ప్రస్తుతం టూర్ ర్యాంకింగ్స్‌లో 13వ స్థానంలో ఉన్నాడు. ఈ సంవత్సరం వరల్డ్ టూర్ ఫైనల్స్, ఆస్ట్రేలియన్ ఓపెన్ వరకు అతనికి పోటీ మాత్రమే మిగిలి ఉంది, కానీ అందుబాటులో ఉన్న టాప్8 స్థానాల కోసం లక్ష్య ఇంకా చాలా తేడాతో వెనుకబడి ఉన్నాడు.

## తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 189 రన్స్‌కు ఆలౌట్

### 63 పరుగుల ఆధిక్యంలో దక్షిణాఫ్రికా

**న్యూఢిల్లీ:** సౌతాఫ్రికాతో తొలి టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో 189 పరుగులకు టీమిండియా ఆలౌట్ అయింది. 30 పరుగుల లోటుతో రెండో ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన దక్షిణాఫ్రికా రెండో రోజు శనివారం ఆట ముగిసే సమయానికి 35 ఓవర్లలో 7 వికెట్లకు 93 పరుగులు చేసింది. మొత్తంగా దక్షిణాఫ్రికా 63 పరుగుల ఆధిక్యంలో ఉంది. క్రీజులో కెప్టెన్ టెంబా బవుమా(29 బ్యాటింగ్) ఒంటరి పోరాటం చేయగా మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. బవుమాతో పాటు



టెయిలెండర్ కోర్బిన్ బోష్(1 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. భారత బౌలర్లలో రవీంద్ర జడేజా(4/29) నాలుగు వికెట్లు, కుల్దీప్ యాదవ్(2/12) రెండు వికెట్లు, అక్షర్ పటేల్‌కు ఓ వికెట్ దక్కింది. అంతకుముందు 37/1 ఓవర్‌నైట్ స్కోర్‌తో రెండో రోజు ఆటను ప్రారంభించిన భారత్ 189 పరుగులకు ఆలౌటైంది. కేఎల్ రాహుల్(39), వాషింగ్టన్ సుందర్(29) టాప్ స్కోరర్లుగా నిలిచారు. రిషభ్ పంత్(27), రవీంద్ర జడేజా(27) పర్వాలేదనిపించారు. సౌతాఫ్రికా బౌలర్లలో మార్కో జాన్సెన్(3/35), సిమన్ హర్మర్(4/30) భారత్ పతనాన్ని శాసించగా.. కేశవ్ మహరాజ్, కోర్బిన్ బోష్ చెరో వికెట్ పడగొట్టారు. పిచ్ పూర్తిగా బౌలర్లకు సహకరించడంతో శనివారం ఒక్క రోజే 17 వికెట్లు నేలకూలాయి. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 159 పరుగులకు ఆలౌటైంది. ఎయిడెన్ మార్క్‌రమ్(48 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్‌తో 31), వియాన్ మల్డర్(51 బంతుల్లో 3 ఫోర్లతో 24), ర్యాన్ రికెల్టన్(22 బంతుల్లో 4 ఫోర్లతో 23), టోనీ డీ జోర్జి(55 బంతుల్లో ఫోర్, సిక్స్‌తో 24) టాప్ స్కోరర్లుగా నిలిచారు. భారత బౌలర్లలో జస్‌ప్రీత్ బుమ్రా(5/27) ఐదు వికెట్లతో సఫారీ పతనాన్ని శాసించగా, మహమ్మద్ సిరాజ్(2/47), కుల్దీప్ యాదవ్(2/36) రెండేసి వికెట్లు పడగొట్టారు. అక్షర్ పటేల్‌కు ఒక వికెట్ దక్కింది.




## స్లోవేనియా విక్టరీ

**న్యూఢిల్లీ:** బిల్లీ జీన్‌కింగ్‌కప్ 2025లో భారత్‌తో తలపడే ముందు ప్లేఆఫ్స్‌లో స్లోవేనియా 2-1 తేడాతో నెదర్లాండ్స్‌ను ఓడించింది. దీంతో స్లోవేనియాకు చెందిన తమరా జిడాన్సెక్ (ప్రపంచ నంబరు 162), కాజా జువాన్ (98) వరుసగా అరాంక్సా రస్(139),సుజాన్ లామెన్స్ (87) లలో ఉన్నతర్యాంక్ పొందిన ప్రత్యర్థులను ఓడించడం ద్వారాస్థాయిని పెంచుకుంది. శనివారం జరిగిన డబుల్స్ లో,డచ్ ద్వయం లామెన్స్-డెమి షుర్స్ డాలియా జాకుపోవిక్-నికా రాడిసిక్‌పై జోడీపై విజయం సాధించింది. 2021 ఫ్రెంచ్ ఓపెన్ సెమీఫైనలిస్ట్ తమరా, సౌత్ పా అరాంటెక్సాపై షార్ట్‌వర్క్ చేసి, ప్రతిభను ప్రదర్శించింది. మొదటి సెట్‌లో షార్ట్ బాల్స్‌పై విజృంభించింది. 34 ఏళ్ల అరాంటెక్సా రెండవ సెట్‌లో ఫ్లాట్ గ్రౌండ్ స్ట్రోక్‌లను కొట్టి టైబ్రేక్ వచ్చింది. ఓవర్‌హెడ్ ఫోర్‌హ్యాండ్‌ను కొట్టడంలో నిష్ణాతు రాలు తమరా అప్రోచ్ షాట్ కార్నర్‌ల నేపథ్యంలో నెట్‌లోకి దూసుకెళ్లి పాయింట్లను అధికమించేందుకు వీలు కల్పించింది. ఇక గ్రూప్‌లోని ఇద్దరు ఆటగాళ్లలో సుజాన్ శక్తివంతమైన ఫోర్‌హ్యాండ్‌లను కొట్టగా, కాజా 2-5 తేడాతో ఉన్న ప్రతికూ లతను అధిగమించి మొదటి సెట్‌ను 76(7)తో గెలుచుకున్నాడు. ఆతర్వాత సుజాన్ ప్రత్యర్థిని ఓడించి, కీలకమైన సమయాల్లో సర్వీస్‌ను నిలబెట్టుకుని రెండవ సెట్‌ను ముగించాడు. ఇక ఆతిథ్య భారత్ ఫేవరెట్ స్లోవేనియాతో తలపడుతుంది. స్లోవేనియా భారత్‌ను ఓడిస్తే, మాజీ జట్టు ఈ మూడు జట్ల గ్రూప్‌లో తొలి విజేతగా నిలుస్తుంది.

## ఐపిఎల్ ట్రేడ్ విండో: 8 మంది ప్లేయర్లు ఫిక్స్

### సంజూ నుంచి అర్జున్ వరకు డీల్



**న్యూఢిల్లీ:** ఐపీఎల్ 2026కు సంబంధించి వచ్చే నెలలో జరగనున్న మినీ వేలానికి ముందు ప్లేయర్ల ట్రేడింగ్ విండో ముగిసింది. ఈ పద్ధతి ద్వారా మొత్తం 8 మంది ఆటగాళ్లను వివిధ ఫ్రాంచైజీలు పరస్పరం మార్పిడి చేసుకున్నారు. సీనియర్ ఆల్ రౌండర్, చెన్నై సూపర్ కింగ్స్ మాజీ కెప్టెన్ రవీంద్ర జడేజా రాబోయే ఐపీఎల్ సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తాడు. చెన్నై తరపున 12 సీజన్లు ఆడిన జడేజా 250 కంటే ఎక్కువ మ్యాచ్‌లు ఆడాడు. ఐపీఎల్ సీనియర్ ఆటగాళ్లలో ఒకడుగా ఉన్న జడేజా వాణిజ్య ఒప్పందంలో భాగంగా అతని లీగ్ ఫీజును రూ.18 కోట్ల నుండి రూ.14 కోట్లకు సవరించారు. రాజస్థాన్ కెప్టెన్, వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ సామ్సన్ ప్రస్తుత లీగ్ ఫీజు రూ.18 కోట్లతో చెన్నై తరపున ప్రాతినిధ్యం వహిస్తాడు.

లీగ్‌లో అత్యంత అనుభవజ్ఞులైన ఆటగాళ్లలో ఒకరైన సామ్సన్ 177 ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడాడు. సంజూ ఐపీఎల్ కెరీర్‌లో ఇప్పటి వరకు ఢిల్లీ, రాజస్థాన్ తరుపున ఆడాడు. సీఎస్‌కే అతడికి మూడో ఫ్రాంచైజీ అవుతుంది. ఇక ఇంగ్లాండ్ ఆల్ రౌండర్ సామ్ కర్రాన్ చెన్నై నుండి రాజస్థాన్‌కు మారాడు. అతని ప్రస్తుత లీగ్ ఫీజు రూ.2.4 కోట్ల మొత్తాన్నే అందుకోనున్నాడు. 27 ఏళ్ల ఈ ఆటగాడు ఇప్పటి వరకు 64 ఐపీఎల్ మ్యాచ్‌లు పంజాబ్ కింగ్స్, చెన్నై సూపర్ కింగ్స్ తరుపున ఆడాడు. రాజస్థాన్ అతడికి మూడో ఫ్రాంచైజీ కానుంది. కాగా భారత్ వెటరన్ పేసర్ మహ్మద్ షమీ సన్‌రైజర్స్ హైదరాబాద్ నుంచి లక్నో కు మారాడు. ప్రస్తుత ఫీజు రూ.10 కోట్ల మొత్తాన్నే అతడు ఐపీఎల్ 2026 సీజన్‌లోనూ జీతంగా అందుకోనున్నాడు.

2013లో ఐపీఎల్ లో అరంగ్రేటం చేసిన షమీ ఇప్పటి వరకు 119 ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడాడు. లెగ్ స్పిన్నర్ అయిన మయాంక్ మార్కండే కోల్‌కతా నుంచి తన పాత ఫ్రాంచైజీ అయిన ముంబైకు తిరిగి వచ్చాడు. తన ప్రస్తుత ఫీజు రూ.30లక్షలతోనే అతడు ముంబైలో చేరాడు. మార్కండే తన ఐపీఎల్ కెరీర్‌ను ముంబైతోనే ప్రారంభించాడు. ఆ తరువాత అతడు రాజస్థాన్, సన్‌రైజర్స్ హైదరాబాద్, కేకేఆర్ తరుపున తరుపున ఆడాడు. అలాగే గత కొన్నాళ్లుగా ముంబైలో భాగమైన అర్జున్ టెండూల్కర్ లక్నోకు మారాడు. అతడి ప్రస్తుత ఫీజు రూ.30లక్షలతోనే అతడు లక్నోలో చేరాడు. రాజస్థాన్ ట్రేడ్ ద్వారా నితీష్ రాణా ఢిల్లీ క్యాపిటల్స్‌కు మారాడు. అతడు ప్రస్తుత ఫీజు రూ.4.2 కోట్లతోనే ఢిల్లీకి వెళ్లాడు. ఐపీఎల్‌లో అతడు 100కు పైగా మ్యాచ్‌లు ఆడాడు.

ఢిల్లీ నుండి విజయవంతమైన ట్రేడ్ తర్వాత ఆల్ రౌండర్ డోనోవన్ ఫెరీరా తన మొదటి ఫ్రాంచైజీ రాజస్థాన్‌కి తిరిగి వచ్చాడు. బదిలీ ఒప్పందం ప్రకారం అతని ఫీజును రూ.75 లక్షల నుండి రూ.1 కోటికి పెంచారు.

## శ్రీలంకపై పాకిస్థాన్ ఘన విజయం

**న్యూఢిల్లీ:** వైట్‌బాల్ క్రికెట్‌లో పాకిస్తాన్ తమ జైత్ర యాత్రను కొనసాగిస్తోంది. రావల్పిండి వేదికగా శ్రీలంకతో జరిగిన రెండో వన్డేలో 8 వికెట్లు తేడాతో పాకిస్తాన్ ఘన విజయం సాధించింది. తీంతో మూడు వన్డేల సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలిఉండగానే 2-0 తేడాతో పాక్ సేన సొంతం చేసుకుంది.

ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన శ్రీలంక నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లు నష్టానికి 288 పరుగులు చేసింది. లంక ఇన్నింగ్స్‌లో జనిత్ లియానగే (54) టాప్ స్కోరర్‌గా నిలవగా, కమిందు మెండిస్ (44), హసరంగా (37 నాటౌట్), సమరవిక్రమ (42) రాణించారు. పాకిస్తాన్ బౌలర్లలో అబ్రార్ అహ్మద్, హారిస్ రవూఫ్ తలా మూడేసి వికెట్లు పడకొట్టారు. అనంతరం 289 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన పాకిస్తాన్ కేవలం 2 వికెట్లు మాత్రమే కోల్పోయి 48.2 ఓవర్లలో ఛేదించింది. పాక్ స్టార్ ప్లేయర్ ఆజం అజేయ సెంచరీతో చెలరేగాడు. సుమారు రెండున్నరేళ్ల తర్వాత బాబర్ అంతర్జాతీయ సెంచరీ మార్క్‌ను అందుకున్నాడు. ఈ మాజీ కెప్టెన్ 119 బంతుల్లో 8 ఫోర్ల సాయంతో 102 పరుగులు చేసి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

పాక్ బ్యాటర్లలో ఓపెనర్ ఫఖర్ జమాన్ (78), మహ్మద్ రిజ్వాన్ (51 నాటౌట్) హాఫ్ సెంచరీలతో రాణించారు. బాబర్ అజం, మహ్మద్ రిజ్వాన్‌లు మూడో వికెట్‌కు 103 పరుగుల అజేయ భాగస్వామ్యం నెలకొల్పారు. లంక బౌలర్లలో చమీరా ఒక్కడే రెండు వికెట్లు పడగొట్టాడు.

# వాణిజ్యం

## టిమ్‌కూక్ వారసుడిపై అంచనాల జోరు!

**కాలిఫోర్నియా, నవంబరు 15:** ప్రపంచంలోనే అత్యంత పెద్దదయిన మొబైల్ తయారీ సంస్థ యాపిల్ సిఇఒ టిమ్‌కూక్ 65 ఏళ్ల పూర్తిచేసుకోవడంతో ఆయన సిఇఒ బాధ్యతలనుంచి వైదొలుగుతారన్న ప్రచారం జోరందుకుంది. దీంతో టిమ్ కుక్ తర్వాత యాపిల్‌కు తదుపరి సీఈవో ఎవరన్న చర్చ మొదలైంది. టిమ్ కుక్ వారసుడిగా సీఈవో రేసులో సంస్థలో



పనిచేస్తున్న జాన్ టర్నస్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. జాన్ ప్రస్తుతం యాపిల్‌లో హార్డ్‌వేర్ ఇంజినీరింగ్ విభాగంలో సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. టిమ్ కుక్ తర్వాత ఆ అత్యున్నత పదవిని చేపట్టబోయే వ్యక్తి జాన్ టర్నస్‌గా ప్రచారం జరుగుతోంది. జాన్ దాదాపు 24 సంవత్సరాలుగా యాపిల్‌లో ఉంటూ కీలక పదవులను చేపట్టారు. ప్రస్తుతం ఆయన వయసు 50 ఏళ్లు. యాపిల్ సీఈవోగా బాధ్యతలు తీసుకున్నప్పుడు టిక్ కుక్ వయసు కూడా 50 సంవత్సరాలే. 2011లో టిమ్ కుక్ యాపిల్ సీఈవోగా బాధ్యతలు స్వీకరించారు. అప్పటి నుంచి సంస్థను ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లడంలో ఎంతో కృషి చేశారు. ఆయన నాయకత్వంలో కంపెనీ తన ఉత్పత్తి శ్రేణిని భారీగా విస్తరించింది. టిమ్ కుక్ యాపిల్ ఆపరేషనల్ మాస్టర్ మైండ్ అయితే జాన్ టర్నస్ హార్డ్‌వేర్ ఆర్కిటెక్ట్. టర్నస్ 2001 లో యాపిల్‌లో చేరారు. ఆయనకు టిమ్ కుక్ దగ్గర మంచి పేరు ఉంది. అయితే సీఈవో బాధ్యతల నుంచి వైదొలిగే అంశం గురించి టిమ్ కుక్ ఇప్పటివరకు ఎలాంటి బహిరంగప్రకటన చేయలేదు.

## 2043నాటికి 20వేల కొత్త విమానాలు

### భారత్, చైనాల్లోనే పెరుగుతున్న విమానయాన రంగం!




**న్యూఢిల్లీ, నవంబరు 15:** విమానయాన రంగంలో ఆసియాపసిఫిక్‌ప్రాంతం ప్రపంచంలోనే అతిపెద్ద ఏవియేషన్‌మార్కెట్‌గా నిలుస్తుందని, రానున్న రెండు దశాబ్దాల్లో ఇదే నమోదవుతుందని ప్రముఖ విమాన తయారీ సంస్థ ఎయిర్‌బస్ అంచనావేసింది. 2043 నాటికి 19,560 కొత్త విమానాలు అవసరం అవుతాయని అంచనావేసింది. ఆర్థిక వృద్ధి, పట్టణీకరణ పెరగడం, ఎయిర్‌ట్రావెల్‌పట్ల ఆసక్తిపెరగడంతో ఆసియా పసిఫిక్ ప్రాంతంలో విమానయాన రంగానికిమంచి భవిష్యత్తు ఉంటుందని అంచనావేసింది. అత్యధికంగా భారత్,చైనాలనుంచే ఈ వృద్ధినమోదుకాగలదని కూడా స్పష్టంచేసింది. భారత్‌లో దేశీయ ఎయిర్‌ట్రాఫిక్ శరవేగంగాపెరుగుతోంది. ప్రాంతీయ కనెక్టివిటీ పెరగడం కూడా ఇందుకు కారణం. వచ్చే 20 ఏళ్లకు భారత్‌కు 2200 కొత్త విమానాలు అవసరం అవుతాయని స్వల్పదూరం రూట్లలో సింగిల్ ఐసిల్ జెట్‌లు కూడా ఉంటాయని వెల్లడించింది. చైనా ఇప్పటికే ప్రపంచ వైమానికరంగ మార్కెట్‌లో అతిపెద్ద మార్కెట్ అన్నది తేలింది. నేషనల్ ఏవియేషన్‌నెట్‌వర్క్‌లో ద్వితీయ శ్రేణి నగరాలకు చైనా విస్తరిస్తోంది. సింగిల్ ఐసిల్, వైడ్‌బాడీ విమానాలు కూడా ఎక్కువ అవసరం అవుతాయి. పాతవాటిస్థానంలో కొత్తవాటిని చేర్చుకుంటుందని ఎయిర్‌బస్ అంచనావేసింది. ఆసియా పసిఫిక్ రీజియన్‌లో నిర్వహణ,శిక్షణ, డిజిటల్ ఆపరేషన్లపరంగా శరవేగంగా పెరుగుతుందని వెల్లడించింది. ఈ మార్కెట్ 2043 నాటికి రెట్టింపుస్థాయిలో వృదిధచెందుతుందని తెలిపింది. అయితే మౌలికవనరుల కల్పనపరంగా ఈ రెండుదేశాలకు కొన్ని కొత్తసవాళ్లు ఎదురుకావచ్చని కూడా వెల్లడించింది.

## ఉద్యోగులకు ఇన్ఫోసిస్ బోనస్!




**బెంగళూరు, నవంబరు 15:** ఐటి దిగ్గజకంపెనీ ఇన్ఫో సిస్ ఉద్యోగులకు పనితీరు ఆధారిత బోనస్‌ను ప్రకటించింది. వివిధ కేటగిరీల్లో ఉన్న ఉద్యోగులకు వారి జీతాలు ఆధారంగా పనితీరును బట్టి బోనస్‌ను ప్రకటించింది. 75 శాతంమంది ఉద్యోగులు బోనస్‌కు అర్హత సాధించినట్లు కంపెనీ ప్రకటించింది. కీలక పోస్టుల్లో ఉన్నవారు, మధ్యస్థాయి ఉద్యోగులు చెల్లింపుల్లో కొంత తగ్గినట్లుగుర్తించారు. ఏప్రిల్ జూన్ సైకిల్‌తోపోలిస్తే సెప్టెంబరులో తగ్గిందన్న ఆందోలన ఉంది. మొత్తంగా కంపెనీ బోనస్ సగటున 80శాతంవరకూ ఉంది. ఔట్‌స్టాండింగ్ కేటగిరీవారికి 83శాతం లభించింది. 78.5శాతం కమెండబుల్ పనితీరుచూపినవారికి, 75శాతం అంచనాలు చేరుకున్నవారికి బోనస్ లభించింది. బోనస్ శాతం దిగువస్థాయి ఉద్యోగులవరకూ క్రమేపీ తగ్గుతూ వచ్చింది. మొత్తంగా అర్హత పొందిన ఉద్యోగులకు 70.5శాతంనుంచి 83శాతం వరకూ బోనస్ లభించింది. తమకు లభించిన బోనస్ గత త్రైమాసికం కంటే 5నుంచి 7శాతం తక్కువ ఉందని వెల్లడించారు. 4,5,6 లెవల్ ఉదోనయగులు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, టెక్నికల్ లీడ్స్, సీనియర్‌మేనేజర్లు వంటి వాఉన్నారు.

## కొత్తసంస్థల్లో బెర్క్‌షైర్ హాత్‌వే పెట్టుబడులు!



**న్యూయార్కు, నవంబరు 15:** స్టాక్ గురు 95ఏళ్ల బెర్క్‌షైర్ హాత్‌వే సిఇఒ వారెన్ బఫెట్ సిఇఒ పదవినుంచి ఈ ఏడాది చివరిలో వైదొలగాలని నిర్ణయించుకన్నారు. ఈ లోపు ఆయన తన సంపదలో మరికొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నారు. 382 బిలియన్ డాలర్లవరకూ ఉన్న నగదు నిల్వలను కొత్త విభాగాల్లో పెట్టుబడులు పెడుతున్నారు. ఒక్సిడెంటల్‌పెట్రోలియమ్ పెట్రోకెమికల్ యూనిట్‌లో 9.7 బిలియన్ డాలర్లు, యునైటెడ్ హెల్త్‌గ్రూప్‌లో 1.6 బిలియన్ డాలర్ల వాటాను కొనుగోలుకు నిర్ణయించారు. అలాగే తమ పెట్టుబడులను క్రమబద్ధీకరించేక్రమంలో కొన్ని సంస్థల్లో పెట్టుబడులు కుదించారు. బ్యాంక్ ఆఫ్ అమెరికాలో 37.2 మిలియన్ షేర్లను విక్రయిస్తున్నారు. బ్యాంకులో 7.7శాతం వాటా ఉంది. అలాగే యుఎస్ హోం బిల్డర్ డి.ఆర్ హోర్టన్‌నుంచి పూర్తిగా వైదొలిగింది. యాపిల్‌లో కూడా తన వాటా పరిస్థితిని సమీక్షిస్తోంది. కంపెనీ 280 మిలియన్ వాటాలను 238.2 మిలియన్ వాటాలకు కుదించింది. ఒకప్పుడు అత్యధికంగా ఉనన యాపిల్‌లోని వాటాలను 90 కోట్లవరకూ విక్రయించింది. ఇప్పటికీ బెర్క్‌షైర్ కంపెనీకి యాపిల్‌లో అతిపెద్ద వాటాగా ఉంది. 60.7 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. అలాగే కంపెనీ గూగుల్ మాతృసంస్థ ఆల్ఫాబెట్‌లో కూడా పెట్టుబడులు పెట్టింది. యాపిల్, బ్యాంక్ ఆఫ్ అమెరికాల్లో కుదించిన తర్వాత ఇపుడు ఆల్ఫాబెట్‌వైపు బెర్క్‌షైర్ దృష్టిపెట్టింది.






Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14